# మూసీ

# MUSI


Samputi : 25 • Sanchika : 09 • Pages : 64 • Rs. 20 • July 2022

UGC Care List Approved Journal


మూసీ 25 వసంతాలు

- దక్షిణ భారతీయ భాషలలో తొలి నవల - కంబుకంధర చరిత్ర
- ఓరియంటల్ కళాశాల ఒక సుందర స్వప్నమా ?
- సూర్యకాంతి ప్రకాశమే 'సారస్వతం'
- తిరుమలలో దైవం వేంకటేశ్వరుడు కాదా ?
- ఎరుకల భాషకు పాణిని సూత్ర అనుసరణ
- నన్నయ భారతంలోని రెండు ఘట్టాలు - విలువల బోధన
- తెలంగాణ మాండలికంలో జంట పదాలు
- అపూర్వ సంస్కృతాంధ్ర శతావధానం



ISSN 2457-0796
మూసీ మాసపత్రిక సంపుటి -25 : సంచిక - 9

UGC Care List Approved Journal
హైదరాబాద్ జులై : 2022



వ్యవస్థాపకులు
**శ్రీ బి.ఎన్.శాస్త్రి**

సంపుటి : 25 సంచిక : 9
జులై - 2022
'శుభకృత్' ఆషాఢ మాసం
**సంపాదకులు** (EDITOR)
**సాగి కమలాకర శర్మ**
**SAGI KAMALAKARA SHARMA**
**సహ సంపాదకులు** (ASSOCIATE EDITOR)
**డా. దత్తయ్య అట్టెం**
**Dr. DATTAIAH ATTEM**

Printed and Published by
B. Anantha Laxmi
*Type Setting at :*
**Kavyasree Graphics**
Ph: 934 797 1177

Printed at : Sri Sai Process
Ph. 27563075

**విడిప్రతి : 20/-**
**సంవత్సర చందా : 200/-**
**శాశ్వత సభ్యత్వం : 2500/-**
(పది సంవత్సరాలు మాత్రమే)

చెక్కులు, డి.డి.లు 'మూసీ తెలుగు మాసపత్రిక' (MUSI Telugu Monthly Magazine) పేరుపై మాత్రమే పంపాలి.

వివరాలకు : మేనేజర్, మూసీ మాసపత్రిక,
2-2-1109/బికె - ఎల్ఐజి-10,
బతుకమ్మకుంట, బాగ్ అంబర్‌పేట,
హైదరాబాద్ - 500 013
ఫోన్ : 934 797 1177
email : editormusi@gmail.com

INTERNATIONAL STANDARD SERIAL NUMBER
ISSN 2457-0796
UGC APPROVED JOURNAL



# మూసీ

సాహిత్య సాంస్కృతిక చారిత్రక

చదివి దాచుకోదగిన ఏకైక తెలుగు మాసపత్రిక

## ఈ సంచికలో ...

### వ్యాసాలు

దక్షిణ భారతీయ భాషలలో తొలి నవల - కంబుకంధర చరిత్ర ... ఎం. శంకర్ 7
ఓరియంటల్ కళాశాలలు ఒక సుందర స్వప్నమా? ... డా. శ్రీరంగాచార్య 11
బంగారు గురిగి (బందారం కథలు - 8) ... డా. నందిని సిధారెడ్డి 15
సూర్యకాంతి ప్రకాశమే 'సారస్వతం' ... డా. సాగి కమలాకర శర్మ 19
పద్య మనోహరం - 32 ... డా. గన్నమరాజు గిరిజా మనోహర్ బాబు 22
భారతీయీకరణ2 : ఆంగ్లమూలం : బలరాజ్ మధోక్, తెలుగు : కోవెల సంపత్కుమార 23
అవగాహన 2 : తిరుమలలో దైవం వేంకటేశ్వరుడు కాదా? ... రోచిష్మాన్ 27
ఎరుకల భాషకు పాణిని సూత్ర అనుసరణ ... డా. వి.ఎం. సుబ్రహ్మణ్య శర్మ 29
నవ్య సాహిత్య మాల - సమీక్ష (గ్రంథాంతరంగం-14) ... ఘట్టమరాజు 33
కథ : పాటల మంగమ్మ ... డా. పేట శ్రీనివాసులు రెడ్డి 35
నన్నయ భారతంలోని రెండు ఘట్టాలు : విలువల బోధన ... డా. కె.వి.ఎన్.డి. వరప్రసాద్ 39
విస్మృత జంటకవులు 'బాబయ్య గుప్త - మచ్చ లక్ష్మయ్య' ... డా. పెబ్బేటి మల్లికార్జున్ 43
తెలంగాణ మాండలికంలో జంట పదాలు ... డా. సిహెచ్. చంద్రయ్య 45
అపూర్వ సంస్కృతాంధ్ర శతావధానం ... డా. బోచ్కర్ ఓం ప్రకాశ్ 49
వినిపించే విజ్ఞాన సర్వస్వం కిరణ్ ప్రభ టాకీషో ... బి. మదన్ మోహన్ రెడ్డి 53
కె.విశ్వనాథ్ చలన చిత్రాలు - సామాజిక అవలోకనం 25 ... టి. లక్ష్మీనారాయణ 55

### కవితలు

ప్రకృతి పలుకు ... డా. వొజ్జల శరత్ బాబు - 5; తుకారాం అభంగం ... డా. మంత్రి శ్రీనివాస్ - 6; వర్ణం లేని చోట ఒకటవుదా ... వినోద్ కుమార్ యెల్లం - 6; బోనాల పండుగ ... డా. బి. నీలిమా కృష్ణమూర్తి - 13; ఎదురుచూపు ... డా. కందుల శ్రీను - 31; నెత్తిమీది పొద్దు ... అవని శ్రీ - 32; జీవనగీతం ... డా. సిహెచ్. ఆంజనేయులు - 44; పొలిటికల్ సర్కస్ ... వనపట్ల సుబ్బయ్య - 62;

### సమీక్షలు

ప్రామాణిక కథాహారం 'పల్లవి' ... అమ్మిన శ్రీనివాస రాజు 59
స్వీకృతి ... 61

**ఈ పత్రికలోని వ్యాసాలు, కథలు, కవితలు, అభిప్రాయాలు ఆ యా రచయితల సొంతమే కాని పత్రికకు ఆ అభిప్రాయాలతో ఎటువంటి సంబంధం లేదు.**

*Printed, Published and Owned by* : **B. Anantha Laxmi,** 3-4-245/1, Lingampally, Kachiguda, Hyderbad - 500 027. Telangana.
*Office :* 2-2-1109/BK-LIG 10, Bathukammakunta, Bagh Amberpet, Hyderabad - 13.
*Printed at* Sri Sai Process, 3-4-612/1, Narayanguda, Hyderabad - 500 029. Telangana.
*Editor :* **Dr. Sagi Kamalakara Sharma.** **RNI No. 37723/80**

ISSN 2457-0796
UGC Care List Approved Journal
మూసీ మాసపత్రిక సంపుటి -25 : సంచిక - 9  హైదరాబాద్ జులై : 2022

## సంపాదకీయం





వ్యక్తి శక్తి కావాలి

మనిషి మనీషి కావాలి

మానవుడు
మహనీయుడు కావాలి

ఉన్న స్థానం నుండి
ఉన్నత స్థానానికి చేరాలి

పరిమితుడు
అపరిమితుడు కావాలి

స్థాయి విస్తరించాలి

దైవత్వం మేల్కొనాలి

తనను తాను నిరంతరం
ఉద్ధరించుకోవాలి

అందరికీ ఆదర్శంగా
అమృతమూర్తిగా
మారాలి

**నీలో దీపం వెలిగించు**
**నీవే వెలుగై వ్యాపించు**



# స్థాయి

స్థా అనే సంస్కృత ధాతువు ఉండుట అనే అర్థానిస్తుంది. ఆంగ్లంలోకి మార్చుకుంటే స్టాండ్ అనేది నిలబడటానికి, స్థిత (సిట్) అనేది కూర్చోవడానికి వినియోగిస్తాం. మధ్యస్థ, పరస్థ, అంతస్థ అనే శబ్దాలలోనూ ఉండుట అనే అర్థం. 'స్టే' అనే శబ్దం స్థాకు అతి సన్నిహితం. దాని నుండే స్టేషన్, స్టుడెంట్, ఇన్‌స్టి ట్యూషన్ మొదలైన పదాలన్నీ ఏర్పడుతున్నాయి. వ్యక్తి తానుండే విధానం, ప్రదేశం ద్వారా అతని స్థాయి నిర్ణయించబడుతుంది. పైకి ఎదగడం, క్రిందికి జారడం వంటి అన్ని అంశాలలోనూ స్థాయి కనిపిస్తుంది. స్థాయీ భేదాలు అనేక శాస్త్రాల్లో, అనేక విషయాల మాధ్యమంగా విశ్లేషించుకుంటూ ఉండడం సహజం.

స్థాయి పెరగాలంటే, స్థాయి పెరిగిన వారితో నిరంతర సహవాసం అవసరం అవుతుంది. భూమి నిరంతరం సూర్యుని చుట్టూ తిరగడం (ప్రదక్షిణం) వల్ల భూమి యొక్క స్థాయి పెరుగుతుంది. భూమి సూర్యుని చుట్టూ తిరిగినప్పుడే, భూమి చుట్టూ చంద్రుడు తిరగడం ఉంటుంది. స్థాయి తగ్గిన వారితో కలిసి ఉండడం వల్ల అన్ని రంగాలలోనూ తిరోగమనం కనిపిస్తూ ఉంటుంది.

తాను ఎదగాలి, స్థాయిని పెంచుకోవాలి అనుకున్న వారు స్థాయి పెరిగిన వారిని ఆదర్శంగా తీసుకొని వారి మార్గాన్ని అనుసరించడమో, అనుకరించడమో చేయాలి. కలిసి ఉండాలి. చుట్టూ తిరగాలి. చుట్టూ ఉండే బంధాలు, ఒత్తిడులు, చికాకుల చుట్టూ మన భావాలన్నీ ఉన్నంత వరకు ఎదుగుదల శూన్యం అవుతుంది. లోపలి శక్తి కూడా త్వరగా కోల్పోవలసి వస్తుంది.

స్థాయి పెరగడమంటే లౌకికార్థంలో ప్రమోషన్ వంటిది. స్థాయి పెరిగిన వారికి జీతభత్యాలు కూడా ఎక్కువగానే వస్తుంటాయి. స్థాయి తగ్గితే తగ్గిపోతాయి. మనస్సును ఆనందం, సంతృప్తి, సంతోషం, ఉన్నతి, ఉత్తమ వ్యవహారాల చుట్టూ ఎప్పుడూ తిప్పడం ద్వారా దాని స్థాయి పెరుగుతుంది. బలహీనతలవైపు తిప్పితే బలహీనత, బలాలతో కలిసి ఉంటే బలంగా శరీరం మారుతుంది. ఒక కార్పొరేటర్ క్రమంగా శాసన సభ్యుడిగా, మంత్రిగా, ముఖ్యమంత్రిగా, ప్రధానమంత్రిగా విస్తరించడం కావాలి. ఇది సక్రమమైన ఎదుగుదల. చిన్న ఉద్యోగులు క్రమంగా పెద్ద అధికారాలు పొందితే స్థాయి పెరిగినట్లు. స్థాయి పెరిగిన వారికి సామాజిక గౌరవం కూడా పెరుగుతుంది.

భూమి కన్నా జలం, జలం కన్నా అగ్ని, అగ్ని కన్నా వాయువు, వాయువు కన్నా ఆకాశాదులు స్థాయి పెంచుకుని విస్తరించాయి. ఆకాశం నుండి భూ స్థాయికి రావడం 'అవతారం'గా చెప్పబడింది. క్రిందికి జారడం లాంటిది. భూ స్థాయిలో ఉన్నవారంతా ఆకాశ స్థాయికి, శక్తి స్థాయికి చేరిననాడే సరియైన మార్గంలో ఉన్నట్లు అర్థం. మనస్సును నిరంతరం ఉన్నత వ్యవహారాల చుట్టూ సంచరింప జేయడం ద్వారా వ్యక్తి ఉన్నతుడవుతాడు. చిన్న వ్యవహారాల చుట్టూ సంచరించిన మనస్సు వల్ల బలహీనుడవుతున్నాడు.

శక్తి, బుద్ధి మొదలైన వానితో కలిసి ఉండేవారు శక్తివంతులు, బుద్ధిమంతులు అవుతున్నారు. శక్తి ఉన్నవాని స్థాయి ఎప్పుడూ పెరుగుతుంది. లోకంచేత నమస్కరించదగిన ఉన్నత వ్యక్తులంతా తమ వ్యక్తిత్వం ద్వారానే పెరిగినవారు. ఆ వ్యక్తిత్వం మార్చుకున్న స్థాయిని బట్టే ఉంటుంది. స్థాయిని బట్టి గుర్తింపు, స్థాయిని బట్టి ఆర్థిక ఫలితం, సామాజిక గౌరవం దక్కుతుంది. ఆధ్యాత్మిక విధానంలో కూడా స్థాయి తగ్గిన వారు అనేక అంశాలను అంటుకోవాల్సి వస్తుంది. బంధనం కలుగుతుంది. స్థాయి పెరిగిన వారికి మాత్రమే మోక్షం లభిస్తుంది.

ISSN 2457-0796 UGC Care List Approved Journal
మూసీ మాసపత్రిక సంపుటి -25 : సంచిక - 9  హైదరాబాద్ జులై : 2022

# ప్రకృతి పలుకు



ధర్మము దప్పగా నవని ధార్మికులెందరొ క్షోభనేడ్చిరే
ధర్మపు మర్మముల్ తెలిసి దైవిక భావము మానునట్లుగన్
ధర్మము గిర్మముల్ వలదు దానము గీనము డొల్లలే ధరన్
ధర్మమనంగ మానవులు తల్చినదేయది ధర్మమౌ ననన్

జీవులు తల్లడిల్లె నిట జీవము నిల్వదు భూమిపై ననెన్
జీవులు చచ్చునట్లుగను చేయగ బూనెను మర్త్యుడెందుకో
జీవమనంగ నాదనుచుచిత్తపు రీతిన పాడుజేయుచున్
జీవుల తుల్యతల్ చెదిన జీతము లేదని బోరు బోరునన్

క్ష్మాజము కంట నీరొలుక కాటికె మా బ్రతుకిప్పుడట్లనెన్
క్ష్మాజములీ భువిన్ మనుచు చాకిరి చేయగ మానవోత్తముల్
క్ష్మాజ ఘనత్వమున్ దెలిపి కావుము మానవ యన్న కానడే
క్ష్మాజము లేనినాడిలను కానరు జీవపు ఛాయనిండుగన్



సంద్రము లేద్చె మానవుని జాడ్యము లన్నిటి జూచి బాధతోన్
సంద్రము నేమమున్ విడిచి సాగెడి రీతిన చేయుచుండెనే
సంద్రపు లాభముల్ తెలిసి జాగృతమవ్వడె యీ నరుండెటుల్
సంద్రము నేలుకొమ్మనగ చావుకు ముందుకు వెళ్ళుచుండెనే

కొండలు గుట్టలున్ నరుని కోరికలన్నిటి గాంచి యిట్లనెన్
కొండల నెక్కిరిన్ తగెను కోనల జూసిరి చెల్లెనంతటిన్
కొండలు త్రవ్వి ప్రకృతిని కూల్చగ బూనుట నెట్లు చెల్లునే
కొండలు లేక జీవులకు గుండెలు నిల్వవు గాదె చూడగన్



గాలియు బాధతో ననెను కానదు మానదు పాడు వద్దనన్
గాలిని ఆపదు చేయ కన కాంక్షల సాగరమందు మున్గుచున్
గాలికి శ్వాసకు న్నెపుడు గాయము జేయుచు నీల్గుచుండెనే
గాలియె జీవితం బెరిగి కాంచుము స్వచ్ఛతరంపు గాలిగన్

జీవనదీమతల్లులు సజీవులమై ధర నుండలేమనెన్
చేవలుడుంగ చేయుటకు చేయదలంచిన దంత చేయుచున్
మా వనము న్వృథా సలిపి మానవుడెల్లరకున్వినాశనమున్
కావలసిట్లు పూనుకొన గాయములే మిగులెల్లవేళలన్

మానవులిట్లు సాగుచు కుమార్గము లెననగ జీవులన్నియున్
కానల బోవునే? మతి వికారము బొందెనొ? యేమి జేతుమే
వే నియమాలు దప్పుటకు వేలకు వేల కుమార్గ గీతులన్
గానము జేయబూనుదురు కాటికి బోవని యంబరంబనెన్

డా. వొజ్జల శరత్ బాబు
హైదరాబాద్, ఫోన్ : 996 353 3937

ISSN 2457-0796
UGC Care List Approved Journal
మూసీ మాసపత్రిక సంపుటి -25 : సంచిక - 9 6 హైదరాబాద్ జులై : 2022

# వర్ణం లేని చోట ఒకటవుదాం...



నాకోసమే
ఎదురుచూస్తూ ఉంటుందని నేను,
తను వచ్చే ఉంటాడు
నాదే ఆలస్యం అని నువ్వు
ఆకుపచ్చని వర్షంలో ఉండలేక నువ్వు,
కాషాయపు ఎండల్లో ఇమడలేక నేను
విధ్వంసపు పొగమంచుల్లో ఉండలేక నువ్వు
స్వార్థపు గాలుల్ని పీల్చలేక నేను
హింస కోసం చాచే చేతులు చూడలేక నువ్వు
నన్ను బంధించే పిడికిల్లో ఊపిరాడక నేను
నువ్వెంటో ...
తెలియని నీకై పోరాటమేల అని నువ్వు,
నేనంటే ....
రంగు మాత్రమే కాదు అని చెప్పలేక మూగబోయి నేను
మన పేరును రంగుల్లో
మన అర్థాలను పిడికిల్లో
మన విలువలను వాళ్ళ స్వార్థంలో
మన మనుగడని మట్టిలో కలిపిన
రాక్షసులకు దూరంగా
ఇద్దరం కలిసి శూన్యం లోకి
ఏ రంగుల్లేని ఇంద్ర ధనస్సు లోకి
మనుషుల్లేని మరో లోకం లోకి
వలస పోయి కలిసి పోవాలి ....

**వినోద్ కుమార్ యెల్లం**
ఫోన్ : 903 272 2807

## తుకారాం అభంగం

హరి నామ గుణగానము
హృదయమందు హరి చింతనము
చేయు నరుని జీవనము
చూడ పరమ పావనము

లేదీడ హరితో వియోగము
లాభాల బాట కవరోధము
హరిత మనసు సంయోగము
చేయు నరుని కది యోగము

హరినామ జపమే బలము
సదా నుంచుము నీ గళము
నిర్మల చిత్తము పలుకు శుభవాణి
నుండు నరుని జీవనము
పరమాత్మ వలెనే పావనము

తుకా పలుకు హరిదాసులు
తీరీ తీరుగ నుందురు
దిక్కులన్ని దివ్యత పొందే
శుభాలు పంచుచుందురు




**అనువాదం : డా॥ మంత్రి శ్రీనివాస్**
ఆదిలాబాద్.
ఫోన్ : 83283 33720

ISSN 2457-0796 UGC Care List Approved Journal
మూసీ మాసపత్రిక సంపుటి -25 : సంచిక - 9 (7) హైదరాబాద్ జులై : 2022

# దక్షిణ భారతీయ భాషలలో తొలి నవల – కంబుకంధర చరిత్ర

ఎం. శంకర్, పిజిటి తెలుగు, ఎల్లారెడ్డి, కామారెడ్డి జిల్లా, ఫోన్ : 9951569644

## పరిచయం

వెయ్యి సంవత్సరాలకు పైగా చరిత్ర కలిగి ఉండి నేటికీ మనుగడ కొనసాగిస్తున్న భారతీయ భాషలలోని ప్రాచీనతను గుర్తించి ఆ భాషలను అభివృద్ధి పరిచే సదుద్దేశంతో భారత ప్రభుత్వం 2004వ సంవత్సరం అక్టోబర్12వ తేదీన క్లాసికల్ భాషలు అనే నూతన విభాగాన్ని భారత రాజ్యాంగంలోని 8వ షెడ్యూల్లో చేర్చడం జరిగింది. ఈ క్రమంలో భారతీయ సాహితీ వేత్తలు తమ భాషల ప్రాచీన సాహిత్యాన్ని పునర్మూల్యాంకనం చేసుకోవాల్సిన అవసరం ఏర్పడింది. భారతీయ భాషల్లోని ప్రాచీన సాహిత్యం వెలుగులోకి వచ్చింది. సంగమ కాలం నుంచి సాహిత్య ఆధారాలు కలిగిన తమిళ భాషకు 2004వ సంవత్సరంలో ప్రాచీన భాష హోదా లభించింది. తర్వాత 2005లో సంస్కృత భాషకు, 2008లో కన్నడ, తెలుగు భాషలకు, 2013లో మలయాళ భాషకు, 2014లో ఒడియా భాషకు ప్రాచీన భాష హోదా లభించింది. తమిళ ప్రాంతానికి చెందిన ఆర్. గాంధీ 2008లో ప్రాచీన భాష హోదా ఇచ్చేంత సాహిత్యం తెలుగు భాషలో లేదని మద్రాస్ హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేయడం జరిగింది. నన్నయ్య మహాభారతం అనువాద కావ్యమని ఆర్.గాంధీ వాదించారు. ఈ వాదనకు వ్యతిరేకంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సరైన ఆధారాలు చూపలేకపోయింది. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం తర్వాత 2016వ సంవత్సరంలో తెలంగాణ ప్రభుత్వం తెలుగు భాష ప్రాచీనతకి తగిన ఆధారాలు తెలంగాణ ప్రాంతంలో ఉన్నాయని మద్రాస్ హైకోర్టులో అఫిడవిట్ దాఖలు చేయడం జరిగింది. క్రీ.శ.945లో కన్నడ ఆదికవి పంపకవి సోదరుడైన జినవల్లభుడు వేయించిన కుర్క్యాల శాసనంలోని మూడు తెలుగు కంద పద్యాలను, కరీంనగర్ జిల్లా కోటిలింగాల ప్రాంతంలో లభించిన 1వ శతాబ్దం నాటి ధూలికట్ట బౌద్ధస్థూపాన్ని, తెలుగు నాణాలను, శాసనాలను మద్రాసు హైకోర్టులో ఆధారాలుగా చూపి తెలుగు భాష ప్రాచీనతని నిలబెట్టడం జరిగింది. ఎనిమిదేళ్ల వివాదం తర్వాత 2016 ఆగస్టు 8న తెలుగు భాషకు వివాద రహిత ప్రాచీనత లభించింది. ఇది మన కళ్ళముందు జరిగిన చారిత్రక సత్యం.

ఒకవేళ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రాంతీయ విభేదాన్ని చూపక తెలంగాణ ప్రాంత సాహిత్యానికి, ఇక్కడ లభించిన శాసనాలకి సరైన ప్రాధాన్యత ఇచ్చి ఉండుంటే, నన్నయ కంటే పూర్వమే తెలంగాణ ప్రాంతం నుంచి శాసన సాహిత్యం వచ్చిందని నిర్ధారించి కుర్క్యాల శాసనంలోని కంద పద్యాలను వెలుగులోకి తెచ్చి ఉండుంటే తెలుగు భాష ప్రాచీనతని ప్రశ్నించడానికి అవకాశం ఉండేది కాదు. ప్రాంతీయ వివక్ష భాషా ప్రాచీనతకి, గొడ్డలిపెట్టుగా నిలిచిన విధానానికి ఈ సంఘటన ఒక నిదర్శనం.

ప్రాంతీయ కలహాలు ఎలా ఉన్నా ప్రక్రియ తొలి రచనల గుర్తింపులో ఇలాంటి సంఘటనలు భవిష్యత్తులో పునరావృతం కావడానికి ఆస్కారముంది. భారత ప్రభుత్వం భారతీయ భాషలలోని ప్రాచీన సాహిత్య రచనలకి ప్రాధాన్యం ఇచ్చినట్టే భవిష్యత్తులో సాహిత్య ప్రక్రియల పరంగా తొలి రచనలకి ప్రాధాన్యం ఇచ్చే అవకాశం మెండుగా ఉంది. ప్రాచీన తొలి రచనల మధ్య వివాదం చెలరేగినట్టే ఆధునిక తొలి రచనల మధ్య కూడా కోర్టు వివాదాలు తలెత్తే అవకాశం ఉంది. కాబట్టి నవలా సాహిత్యానికి పరిమితమై దక్షిణ భారతదేశంలో తొలి నవల తెలుగు ప్రాంతం నుండి వచ్చిందని నిరూపించే చిరు ప్రయత్నం ఈ వ్యాసం.

## విషయ వివరణ

దక్షిణ భారతీయ భాషలలో 'నవల' పంతొమ్మిదవ శతాబ్దంలో ఆవిర్భవించింది. 'నవల' ఆవిర్భావానికి పూర్వం జానపద కథల రూపంలోను, స్థల వర్ణనలు, పుక్కిటి పురాణాల రూపంలో దక్షిణ భారతీయ భాషలలో కథాసాహిత్యం వ్యాప్తిలో ఉండింది. మలయాళంలో వ్యాప్తిలో ఉన్న 'వట్టక్కన్ పుటుక్కల్' (ఉత్తర మలబార్ ప్రాంత) వీరగాథలు, తమిళ, తెలుగు, కన్నడ ప్రాంతాలలో వ్యాప్తిలో ఉన్న జానపద కథలను ఇందుకు ఉదాహరణగా చెప్పవచ్చు.

## 1. మలయాళ – తొలి నవల

మలయాళ ప్రాంతంలో తొలుత అడుగుపెట్టిన పోర్చుగీసువారు మతవ్యాప్తి, వ్యాపార విస్తరణలో భాగంగా తాము మలయాళాన్ని నేర్చుకొనడమే కాక మలయాళంలోకి బైబిల్ని అనువాదం చేశారు. ఫ్రెంచివారి తరువాత మలయాళ ప్రాంతంలోకి వచ్చిన డచ్చివారు ఫ్రెంచివారి వలే మలయాళ ప్రాంత సంస్కృతిని, సాహిత్యాన్ని ప్రభావితం చేయలేదు. కోళికోడ్ ప్రధాన కార్యాలయంగా మలబార్ ప్రాంతాన్ని పాలించిన ఆంగ్లేయులు మలయాళ సాహిత్యానికి విశేష సేవ చేశారు. 'సంక్షేప వేదార్థం' (1772), 'వర్ధమాన పుస్తకం', 'కవిట్టునాటకం' వంటి వచన రచనలను ముద్రించారు. ఫలితంగా వచన రచనలకి ఆదరణ పెరిగి 'నవల' ఆవిర్భావానికి వాస్తవ మార్గం ఏర్పడింది.

మలయాళ నవల ఇంగ్లీష్ భాషతో పరిచయం ఉన్న ముగ్గురు వ్యక్తులతో ప్రారంభమైంది. వారు అప్పునెడుంగడి, ఒ. చందుమీనన్, సి.వి. రామన్ పిళ్ళై. ఈ ముగ్గురిలో అప్పునెడుంగడి నవలా

సాహిత్యానికి శంకుస్థాపన చేస్తే చందుమీనన్, రామన్ పిళ్ళై నవలా సాహిత్యాన్ని వికసింప చేశారు.

అ) కుందలత (1887) అప్పునెడుంగడి రాసిన తొలి మలయాళ నవల.

ఆ) ఇందులేఖ (1889) ఒ. చందుమీనన్ రాసిన తొలి మలయాళ సాంఘిక నవల.

ఇ) మార్తాండ వర్మ (1891) సి.వి. రామన్ పిళ్ళై రాసిన తొలి మలయాళ చారిత్రక నవల. మలయాళ సాహిత్యంలో నవల ఆవిర్భావం జరగడానికి ఈ మూడు రచనలు మూల కారణం.

## 2.తమిళ – తొలి నవల

తమిళ ప్రాంతంలో అడుగు పెట్టిన ఆంగ్లేయులు క్రైస్తవ మత గ్రంథాలను ముద్రించే ఉద్దేశంతో క్రీ.శ.1577లో అచ్చుయంత్రాన్ని స్థాపించారు. తరువాతి కాలంలో క్రైస్తవ సిద్ధాంతాలను, జపములను, అర్చనాక్రమాన్ని తమిళంలోకి అనువదించారు. వచన రచనలని ప్రోత్సహించే ఉద్దేశంతో 'దినవర్తమాని' (1856), 'జనవినోదిని' (1870) 'స్వదేశమిత్ర' (1882) వంటి పత్రికలు వచ్చాయి. ఈ అంశాలు తమిళ ప్రాంతంలో నవల ఆవిర్భావానికి భూమికగా నిలిచాయి.

తమిళంలో నవల పంతొమ్మిదవ శతాబ్దంలో ఆవిర్భవించింది. పంతొమ్మిదవ శతాబ్దానికి పూర్వం తమిళంలో గద్య రచనలు ఉన్నా 'నవల' లక్షణాలతో కూడిన రచనలు మాత్రం పంతొమ్మిదవ శతాబ్దంలో వచ్చాయి.

వేద నాయగం పిళ్ళై రచించిన 'ప్రతాపముదలియార్ చరిత్ర' నవల ద్వారా తమిళ నవలా ప్రస్థానం మొదలైంది. ఇది తమిళ తొలి నవల మరియు తొలి సాంఘిక నవల. వేద నాయగం పిళ్ళై గారి 'ప్రతాప ముదలియార్ చరిత్ర' నవల కన్నా ముందు కొన్ని గద్య రచనలు తమిళంలో వెలువడ్డాయి. ఈ గద్య రచనలలో ప్రాచీన తమిళ 'తొల్కాప్పియం' వంటి రచనలలో ఉన్న గద్యం ఒక ఎత్తైతే ఆధునిక కాలంలో ఆంగ్లేయ పరిపాలన పట్ల ఆంగ్లేయ సాహిత్య ప్రభావంతో వచ్చిన అనువాద, అనుసరణ రచనలు ఇంకో ఎత్తుగా చెప్పవచ్చు. 'ఫాదర్ బెస్చి' 1822లో 'పరమార్థ గురు కథై' అనే గద్య రచన వెలువరించారు. తండవరణ్య ముదలియార్‌గారు 'పంచతంత్రకథై' (1826), 'యుసుఫ్ కట్టుకథైకల్' (1813), 'మదన్ కామరాజ కథై' (1855), 'తమిళ లానియుమ్ పెరుమల్ కథై' (1869) వంటి గద్య రచనలు రచించారు. ఈ రచనలు ప్రతాప ముదలియార్ చరిత్ర కన్నా పూర్వం గద్యరూపంలో తమిళంలో వెలువడ్డాయి. ఈ రచనలు తమిళంలో 'నవల' ఆవిర్భావానికి నాంది వాక్యంగా పనిచేశాయి. ఆ తరువాత తమిళ తొలి నవల మరియు తొలి సాంఘిక నవల ప్రతాప ముదలియార్ చరిత్ర(1879) వెలువడింది.

## 3. కన్నడ – తొలి నవల

మతప్రచారం నిమిత్తం కర్ణాటక ప్రాంతానికి వచ్చిన 'రెవరెండ్' వంటి ఆంగ్లేయులు కన్నడంలో 'పరమాత్మ జ్ఞానం', 'కథామాలై' వంటి వచన రచనలని ముద్రించడంతో పాటు 'నాగవర్మ' రచించిన 'చందోభుదిని' పరిష్కరించి ప్రచురించారు, 'జాన్‌స్టీవెన్‌సన్' కన్నడ తొలి నవలల సరసన నిలువగల 'కెంపూ నారాయణ'గారి 'ముద్రామంజూషను' పరిష్కరించి ప్రచురించారు. ఈ అంశాలు కన్నడ నవల ఆవిర్భానికి దారితీసాయి.

నవలని కన్నడంలో కాదంబరి అనడం పరిపాటి. ఒకపక్క కన్నడ భాష గద్యం ఆధునిక రూపం ధరిస్తున్న తరుణం. ఇంకో పక్క అప్పుడప్పుడే కన్నడ భాషకి నిఘంటువులు, వ్యాకరణ గ్రంథాలు వెలువడుతున్న సందర్భంలో పూర్తిగా కన్నడ భాష ఆంగ్ల భాషా ప్రభావానికి లోనుకాక మునుపే కాదంబరి అని చెప్పుకోదగ్గ మూడు రచనలు కన్నడంలో వచ్చాయి. అవి:

1) కళావతి పరిణయ (1815) యాదవ కవి.
2) సౌగంధికా పరిణయ (1821) ముమ్మడి కృష్ణరాజ ఒడయార్.
3) ముద్రా మంజూష (1823) కెంపూ నారాయణ.

ఈ ప్రారంభ కాలంలో కన్నడంలో వెలువడ్డ ఒక్కో నవలకి ఒక్కో ప్రత్యేకత ఉంది.

యాదవ కవి రచించిన 'కళావతి పరిణయ' (1815) నవలను పోలిన రచన. కానీ పూర్తి నవల కాదు. పెళ్లికి ముందే పెళ్లికూతురు తనకు కాబోయే భర్తకు లొంగడానికి నిరాకరించడం ఇందులోని ఇతివృత్తం. 'ఇది ప్రథమ కన్నడ ఐతిహాసిక కాదంబరి". (శేషగిరి, ఎల్.ఎన్. 2014: 125)

'కృష్ణరాజ ఒడయార్ రచించిన సౌగంధికా పరిణయ (1829) వెయ్యి పుటలకు పైగా ఉన్న వచన ప్రబంధం" (చెన్నకేశవరెడ్డి, జి. 1999: 142)

'కెంపూ నారాయణ ముద్రా మంజూష (1823) విశాఖదత్తుని నాటక కథను అనుసరించి రచించిన గద్య గ్రంథం. ఇందులో రాజకీయ విషయాలకు అధిక ప్రాధాన్యం ఇవ్వబడింది.' (చెన్నకేశవ రెడ్డి, జి(సం). 1999: 142)

1892లో ప్రకటితం అయిన 'సూర్యకాంత' నవలను కన్నడ స్వతంత్ర ఐతిహాసిక కాదంబరిగా ఎల్.ఎన్. శేషగిరిరావు గారు పేర్కొన్నారు. (శేషగిరి రావు ఎల్.ఎన్., 2014:125)

'1897లో ప్రకటితం అయిన చోరగ్రహణ తంత్ర తొలి కన్నడ డిటెక్టివ్ నవల (శివరాయ, తు.సు. 2013:217).

కన్నడలో వచ్చిన తొలి గద్య గ్రంథం కళావతి ప్రణయ(1815).

### 4. తెలుగు–తొలి నవల

తెలుగు భాషకి 1817లో విలియంబ్రౌన్ 'ఎ గ్రామర్ ఆఫ్ జంటూ లాంగ్వేజ్' పేర వ్యాకరణాన్ని రచించారు. ఎ.డి.కాంప్‌బెల్, బ్రౌన్, ఎట్స్ వంటి విదేశీయులు తెలుగు భాషకి విశేష సేవ చేసారు. అప్పటివరకు గ్రాంథిక రూపంలో ఉన్న తెలుగు భాష పాశ్చాత్య ప్రభావంతో వచన రూపం ధరించింది. ముద్రణాయంత్రం వచ్చిన తరువాత తెలుగులో విస్తృతంగా వచన రచనలు వచ్చాయి. ఈ అంశాలు నవల ఆవిర్భావానికి నాందీ వాక్యంగా పనిచేశాయి.

తెలుగు నవల ప్రస్థానం 1866లో ప్రారంభమైంది. 'కంబుకంధర చరిత్ర' (1866), 'కామరూపకథ' (1866) నవలల తరువాత 1867లో కొక్కొండ వెంకటరత్నం పంతులు రచించిన 'మహాశ్వేత' నవల వెలువడింది. మహాశ్వేత నవల తరువాత 1872లో శ్రీ నరహరి గోపాలకృష్ణమ సెట్టి 'శ్రీరంగరాజుచరిత్ర', 1878లో కందుకూరి వీరేశలింగం పంతులు 'రాజశేఖరచరిత్ర' నవలలు వెలువడ్డాయి. ఈ నవలల్లో తొలి తెలుగు నవల ఏది అన్న విషయంలో వాదవివాదాలు జరిగాయి.

అసంపూర్ణం, యథామాతృకానువాదం, అలభ్యం అయిన మహాశ్వేత తొలి తెలుగు నవల కాదని డా.అక్కిరాజు రమాపతిరావు గారు ఉదాహరణలతో సహా నిరూపించారు. (రామానుజరావు, దేవులపల్లి. 1973: 3, 4). అక్కిరాజు రమాపతి రావు గారు శ్రీరంగరాజుచరిత్రను తొలి తెలుగు నవలగా గుర్తించారు. శ్రీరంగరాజు చరిత్ర నవల కన్నా ముందే నల్లగొండ జిల్లా హుజూర్ నగర్ ప్రాంతానికి చెందిన తడకమళ్ళ వెంకట రామకృష్ణారావు గారు 1866లో కంబుకంధర చరిత్ర, కామరూపకథ నవలలను రచించారు.

డా. సంగిశెట్టి శ్రీనివాస్ గారు కామరూప కథ, కంబుకంధర చరిత్రల గురించి ప్రస్తావిస్తూ, "తొలి తెలుగు నవల కంబుకంధర చరిత్ర (1866), మద్రాసు లైబ్రరీలో అందుబాటులో ఉన్న ఈ నవలను పునర్ముద్రించినట్లయితే తెలుగు పాఠకులకు తొలి నవల అందుబాటులోకి వస్తుంది" (వెంకటేశ్వర్లు, పంతంగి. 2014: 17–22) అని పేర్కొన్నారు. ఈ నవల సేకరించే ప్రయత్నంలో నేను మద్రాసు లైబ్రరీని సందర్శించడం జరిగింది. అక్కడ క్యాటలాగులో D.No. 433P (కంబుకంధర చరిత్ర) Kambukundhara Charitra by Tadakamalla Venkata Krishna Rao. D.No. 1401. P (కామరూపకథ) Kamarupakatha by Tadakamalla Venkata Krishna Rao అని పుస్తకాల పేర్లు ఉన్నాయి కాని పుస్తకాలు అందుబాటులో లేవు. కంబుకంధర చరిత్రకి లైబ్రరీ వారు రాసిన కాటలాగులో ఆధునిక నవలను పోలిన రచన అని చాలా స్పష్టంగా చెప్పడం జరిగింది.

ఈ నవల గురించి సంగిసెట్టి శ్రీనివాస్, కాసుల ప్రతాపరెడ్డి, ముదిగంటి సుజాతరెడ్డి వంటి పరిశోధకులు తమ పరిశోధనా







వ్యాసాలలో పేర్కొన్నారు. కాని ఈ నవల నేటికి అందుబాటులో లేదు. ఈ నవల ముద్రణ రూపంలో వచ్చినట్లయితే నిర్వివాదంగా తెలుగు నవల చరిత్ర ఇంకో ఆరు సంవత్సరాలు వెనక్కి వెళ్ళడానికి ఆస్కారముంటుంది. కాల ప్రాతిపదికగా 1866లో రచించబడిన 'కంబుకంధర చరిత్ర' తొలి తెలుగు నవల అవుతుంది.

### ముగింపు

అన్ని దక్షిణ భారతీయ భాషలలో నవల ఆవిర్భావానికి పూర్వం ఒకే విధమైన సామాజిక పరిస్థితులు ఉన్నాయి. విదేశీయుల రాక, మతవ్యాప్తిలో భాగంగా వచన రచనల ముద్రణ, భాష ప్రాచీన పద్య, గద్య రూపాన్ని వీడి ఆధునిక రూపాన్ని ధరించడం, పాశ్చాత్య సాహిత్యంతో స్థానికులకు పరిచయం కలగడం, నూతన సాహిత్య ప్రక్రియలలో భాగంగా 'నవల' ఆవిర్భావం వంటి అంశాలు ఉమ్మడిగా అన్ని దక్షిణ భారతీయ భాషలలో నవల ఆవిర్భావానికి పూర్వం కనిపిస్తాయి.

తెలుగు, కన్నడ భాషలలో తొలి నవల ఏది? అన్న విషయంలో వివాదం ఉంది. తమిళ, మలయాళ భాషలలో ఈ వివాదం లేదు. తమిళంలో తొలి నవల మరియు తొలి సాంఘిక నవల 'ప్రతాప ముదలియార్‌చరిత్ర' (1879). మలయాళంలో తొలి నవల 'కుందలత (1887)' తొలి సాంఘిక నవల 'ఇందులేఖ' (1889). కన్నడలో 'కళావతిపరిణయ' (1815), 'సౌగంధికా పరిణయ' (1821), 'ముద్రామంజూష' (1823)లలో తొలి నవల ఏది అన్న విషయంలో వివాదం ఉంది. తెలుగులో కంబుకంధర చరిత్ర (1866), శ్రీరంగరాజుచరిత్ర (1872), రాజశేఖరచరిత్ర (1878) నవలలో తొలి నవల ఏది అన్న విషయంలో వివాదం ఉంది.

కన్నడ "కళావతి పరిణయ"(1815) నేటికి అలభ్య రచన. కన్నడ విమర్శకులు ఈ రచనని నవలగా కాక నవలను పోలిన రచనగా గుర్తిస్తున్నారు. "సౌగంధికా పరిణయ"(1821) ప్రాచీన పురాణ ఇతిహాసాల నేపథ్యంగా వచ్చిన కల్పిత గద్య గ్రంథం. "ముద్రా మంజూష" (1823) అలభ్య చారిత్రక గద్య కావ్యం. ఈ రచనల తర్వాత కన్నడలో అనువాద నవలలు వచ్చాయి. 1842లో బనియన్

రచించిన "పిలిగ్రిమ్స్ ప్రోగ్రెస్" 'యాత్రికన సంచార' పేర కన్నడంలోకి అనువాదం అయింది. 1857లో డానియల్ డెఫోగారి, రాబిన్‌సన్ కుస్రో కన్నడంలోకి అనువాదం అయింది. ఆ తరువాత ఇతర భారతీయ భాషల నుండి నవలలు కన్నడంలోకి అనువాదం అయ్యాయి. 1869లో బాబా పద్మాన్‌జి మరాఠీలో రచించిన 'యమునా పర్యటన్' కన్నడంలోకి అనువాదం అయింది.

తెలుగులో మొదట 'కంబుకంధరచరిత్ర' (1866) నవల రచించ బడింది. తరువాత 'శ్రీరంగరాజుచరిత్ర' (1872), 'రాజశేఖరచరిత్ర' (1878) నవలలు వచ్చాయి. కాల ప్రమాణంగా తొలి తెలుగు నవల కంబుకంధర చరిత్ర అవుతుంది.

మలయాళ తొలి నవల కుందలత 1887లో వచ్చింది. తమిళ తొలి నవల ప్రతాపముదలియార్ చరిత్ర 1879లో వచ్చింది. 1815లో రచించినట్లు చెప్పబడుతున్న కన్నడ తొలి నవల "కళావతి పరిణయ" నేటికి అలభ్య రచన. నవలా సాహిత్యంలో ఎంతో ప్రాముఖ్యం కలిగిన కంబుకంధరచరిత్ర నవలను ముద్రణ రూపంలో తీసుకువచ్చినట్లయితే నిర్వివాదంగా దక్షిణ భారతీయ భాషలలో ముద్రిత తొలి నవల కంబుకంధర చరిత్ర అవుతుంది.

**ఉపయుక్త గ్రంథ సూచి**

1. కుటుంబరావు, బి.వి. 1971. ఆంధ్రనవలా పరిణామము. హైదరాబాదు: గాయిత్రి ప్రచురణలు.

2. చెన్నకేశవ రెడ్డి, జి. (సం). 1999. విజ్ఞాన సర్వస్వం సంపుటం – 6. హైదరాబాదు: తెలుగు విశ్వవిద్యాలయం.

3. జయప్రకాశ్, ఎస్ (అ). 2008. ప్రతాపముదలియార్ చరిత్ర (వేదనాయగం పిళ్ళై), కుప్పం : ద్రావిడవిశ్వవిద్యాలయం.

4. జయప్రకాశ్, ఎస్ (అ). 2016. ఇందులేఖ (ఒ. చందుమీనన్), న్యూఢిల్లీ: నేషనల్ బుక్ ట్రస్ట్.

5. దేవులపల్లి(సం.పా). 1973. తెలుగు నవల నూరు సంవత్సరాలు. హైదరాబాదు : ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి.

6. ప్రతాపరెడ్డి, కాసుల. 2017. తెలంగాణ నవలా వికాసం. హైదరాబాదు : తెలంగాణ సాహిత్య అకాడమి.

7. ముగళి, శ్రీ.రం. 1978. కన్నడ సాహిత్య చరిత్ర. న్యూఢిల్లీ: సాహిత్య అకాడమి.

8. రాధాకృష్ణశర్మ, చల్లా. 1998. తమిళ సాహిత్య చరిత్ర. హైదరాబాదు: ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి.

9. వెంకటేశ్వర్లు, పంతంగి. 2014. తెలంగాణ తెలుగు నవల. వరంగల్: కాకతీయ విశ్వవిద్యాలయం.

10. శివరాయ, తు.సు. 1887. కన్నడ సాహిత్య చరిత్ర. మైసూర్: ఉదయరవి ప్రింటర్స్.

11. శేషగిరిరావ్, ఎల్.ఎన్. 2013. హొసగన్నడ సాహిత్య చరిత్రే. బెంగళూరు: స్వప్నా బుక్ హౌస్.

12. George, K.M. 1984. Comparative Indian Literature. Kerala: Sahitya Academy, Trichur.


# ఆలోకనం

**(తెలంగాణ 31 జిల్లాల చరిత్ర సాహిత్య సాంస్కృతిక సమాచారం)**

ప్రపంచ తెలుగు మహాసభల సందర్భంగా మూసీ మాసపత్రిక ప్రత్యేకంగా సంకలనం చేసిన గ్రంథం ఆలోకనం.

తెలంగాణ 31 జిల్లాలకు సంబంధించిన విలువైన సమాచార సూచిక ఇది.

330 పేజీల ఈ గ్రంథం విలువైన రంగు చిత్రాలతో కూడుకుని ఉన్న విశేష గ్రంథం.

అన్ని రకాల కాంపిటీషన్ పరీక్షలకు కూడా వినియోగపడే సమగ్ర సమాచార దర్పణం.

**మూసీ కార్యాలయంలో దీనిని పొందదలచిన వారికి కేవలం 300/- (అసలు 500/-) కు మాత్రమే అందిస్తున్నాం. సంప్రదించండి.**

# 'కదంబం'

**(తెలుగు సాహిత్య ప్రక్రియలు - రూపాలు)**

**మూసీ మాసపత్రిక ప్రచురించిన ప్రత్యేక గ్రంథం**

**ప్రాచీన, అధునాతన, జానపద ప్రక్రియలన్నింటిపై ప్రత్యేక వ్యాసాలు**

(పురాణం, ఇతిహాసం, కావ్యం మొదలైన ప్రక్రియలు మొదలు నానీలు, హైకూల వరకు 82 సాహిత్య ప్రక్రియలపై ప్రముఖ సాహితీవేత్తల కలాల నుండి జాలువారిన ప్రత్యేకాంశాల సమాహారం. పోటీ పరీక్షలకు, కళాశాలలకు, వ్యక్తిగతంగా అందరికీ వినియోగపడే ఉత్తమ గ్రంథం 'కదంబం'.

**440 పేజీలతో వెలువడిన ఈ గ్రంథం వెల రూ. 350/-**

ISSN 2457-0796 UGC Care List Approved Journal
మూసీ మాసపత్రిక సంపుటి -25 : సంచిక - 9 11 హైదరాబాద్ జులై : 2022

# ఓరియంటల్ కళాశాలలు ఒక సుందర స్వప్నమా!

**డా. శ్రీ రంగాచార్య,** పూర్వ ప్రధానాచార్యులు, పాలెం ఓరియంటల్ కళాశాల. ఫోన్ : 929 945 1266

2022 జూన్ 'మూసీ' పత్రికలో వచ్చిన 'సుభ్యా' గారి చరిత్రగా మారనున్న ప్రాచ్య కళాశాలల ఘనమైన గతం' అనే వ్యాసం చదివిన తర్వాత ఈ వ్యాసం వ్రాస్తున్నాను. ఇందుకు 'సుభ్యా' గారికి, వ్యాసాన్ని ప్రచురించిన 'మూసీ' పత్రికవారికి ధన్యవాదాలు తెల్పుతున్నాను. ఎందుకంటే – మనకొక రాష్ట్రం సిద్ధిస్తే ఎంతో అభివృద్ధి ముఖ్యంగా విద్యారంగానికి జరుగుతుందని భావించిన అస్మాదృశులకు మిగిలింది నిరాశయే. తెలంగాణ ఏర్పడింతర్వాత ప్రాచ్యకళాశాలలు సమూలంగా పేరు గూడా లేకుండా పోతున్న సమాచారాన్ని ఇప్పటివరకు ఏ పత్రిక కూడా ప్రభుత్వ దృష్టికి తేలేదు. నాకు తెలిసినంతవరకు 'మూసీ' పత్రికయే ఈ విషయం గూర్చి ప్రప్రథమంగా తెల్పినందుకు ధన్యవాదాలు తెల్పటం ఒక విధి.

మనం మదరాసు నుండి విడివడి ఆంధ్రరాష్ట్రం ఏర్పాటు చేసుకొని, అనంతర పరిణామాలతో తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు చేసుకున్న గొప్ప ఉద్యమకారులం. ఎప్పుడు ఏ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడినా భాషా సంస్కృతులను, ప్రాచీన విద్యా వైభవస్ఫూర్తి కేంద్రాలైన సంస్కృతాంధ్రాది విద్యాశాలలను దెబ్బతీయలేదు. పైగా వాటి మనుగడ నిమిత్తం కొంత గ్రాంటునిచ్చి అభివృద్ధికి దోహదం చేసినారు. ఈ విధమైన ప్రోత్సాహం వల్లనే వేలసంఖ్యలో సంస్కృతాంధ్రాది భాషల్లో గొప్ప విద్వత్తు గలవారు తయారై, వారి శిష్య ప్రశిష్యులను కూడా 'శిష్యాదిచ్ఛేత్ పరాజయం' సూక్తికి నిదర్శనులుగా చేసినారు. ఇదంతా మన పూర్వ పూర్వ పండిత సంప్రదాయం. అదే మనలను నిలుపుతున్నది. తిరుపతి, విజయనగరం, చిట్టిగూడూరు, కొవ్వూరు, సీతారాంబాగ్‌లలోని ప్రాచ్య కళాశాలల చరిత్ర అక్షరాలా ఘనమైనది. ఆనాడు వీటిల్లో 'గురుకుల క్లిష్ట' దశలో చదివినవారు మన షట్‌శాస్త్ర ధురీణులు – సాహితీ మహోన్నతులైన విషయం మనం కాస్త వెనకకు వెళ్లి పరిశీలిస్తే తెలిసే ఆశ్చర్యకర విద్యామూర్తిమత్త్వమే మనలను జలదరింపు చేస్తుంది. మన తెలంగాణ (నైజాం) ప్రాంతం ముస్లింరాజుల ఆధిపత్యం నుండి మోక్షం పొందిన తర్వాత ఎందరో మహానుభావులు భాషల అభివృద్ధికి, భాషా సంస్థలు గ్రంథాలయాలనే గాక వివిధ సాహిత్య సంస్కృతిక కేంద్రాల స్థాపన చేసి మన విద్యా – సంస్కృతీ – సాహిత్య – సంప్రదాయాలను అభివృద్ధి చేసి 'అక్షర' యశస్కులైనారు.

అనంతర కాలంలో ఏర్పాటైన మన ప్రజా ప్రభుత్వాల తీరు 'గుడ్డి కన్న మెల్లె నయం' అనే సామెతను సార్థకం చేసినాయి. ప్రథమ దశలో ప్రాచ్య విద్యాసంస్థలు స్వయం పోషకాలుగానే మనుగడ సాగించినాయి. విజయనగర రాజుల వంటి మహోదార సాహితీ




సంపన్నులు, వీటికొక స్థితి కల్పించి, విద్యావ్యాప్తి చేసి చిరస్మరణీయులైన విషయం సాహిత్య పరీమళం గల ప్రతి వ్యక్తికీ తెలిసిన విషయమే!

ఎక్కడో తమిళదేశం నుండి నగరానికి విచ్చేసి స్వయంపోషక **'వేద – సంస్కృత'** పాఠశాల నారంభించి దానికే తన సర్వశక్తులను ధారపోసి **'వేదాంత వర్ధినీ సంస్కృత కళాశాల'**గా అభివృద్ధి చేసి నాటి నిజాం కాలం నుండి ఇప్పటి కాలం దాకా వేలమంది జీవనోపాధికి ముఖ్యకారకులైన **శ్రీమాన్ ఉ.వే. కోయిల్‌కందాడై శఠకోప రామానుజాచార్య (స్వామివారు)** కృషిని మరుస్తామా! ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలుగు శాఖను సహస్ర రీతుల విస్తరింపచేసి – నల్లకుంటలో ఆంధ్ర ప్రాచ్య కళాశాల, అనంతరం తెలుగులోనే బోధన నిమిత్తం వివేకానంద తెలుగు కళాశాల, వివేకానంద ఉన్నత పాఠశాలలను స్థాపించి అసిధార వ్రతంగా వాటిని నిర్వహించిన ఖండవల్లి వారిని విస్మరింతామా! ప్రాచ్య కళాశాలల అధ్యాపకు లందరికి యుజిసి వేతనాలిప్పించిన పి.వి. నరసింహారావు, కప్పగంతులవారిని అనుదినం స్మరించలేమా?.

నేటి నాగరకర్నూల్ జిల్లాలోని పాలెం గ్రామం ఒకనాడు గురుకుల పద్ధతిని మించిన విద్యాసంస్థల నిలయం. ఆ వూరిలోని సామాన్య వ్యక్తి ఒక హైస్కూల్, ఒక సైన్సు కాలేజి, ఒక ఓరియంటల్ కాలేజీని స్థాపించడమే గాక అనేక యితర సంస్థలను ఏర్పాటు చేసి తన **యశశ్చంద్రికా ధవళరుక్తతి ధరాతరుణి కైశిక పుష్పదామం**గా మార్చిన మహానుభావుడే తోటపల్లి సుబ్రహ్మణ్యం (ఈయనే పాలెం సుబ్బయ్య). ఈయన స్థాపించిన యితర సంస్థల గూర్చి తెలుపటం కన్న 'శ్రీ వేంకటేశ్వర ప్రాచ్య కళాశాల' గూర్చి తెలుసుకుందాం. సుబ్బయ్యగారు అప్పటికే క్రమశిక్షణతో విద్యాసంస్థలను నిర్వహిస్తున్న విషయం, అప్పటి రాష్ట్ర ముఖ్యమంత్రి కాసు బ్రహ్మానందరెడ్డిగారు గమనించి,




రాష్ట్రంలో తెనుగు పండితుల కరువును పారద్రోల తలచి – సుబ్బయ్యగారిని ఒక ఓరియంటల్ కాలేజీ పెట్టుమని ప్రోత్సహించి ఆ కళాశాలను గ్రాంట్ – ఇన్ – ఎయిడ్‌లో చేర్చి గ్రాంటునిచ్చి అధ్యాపక పదవుల వేతనాలను విడుదల చేసిన సహృదయుడు బ్రహ్మానందరెడ్డిగారు. దీని ఫలితంగా 1964లో కాలేజీ ఏర్పాటై, నిత్యాభివృద్ధిగా పేరు గాంచిన విషయం తెలిసిందే. (నేను 1966 ఆగస్టులో ఆ కాలేజి యందు అధ్యాపకునిగా ప్రవేశించి 2002లో రిటైరయినాను). ఈ కళాశాల గురించి ఇక్కడ వివరించటానికి అవకాశం లేదు.

అప్పట్లో తెలంగాణంలో వున్న కాలేజీలకు గ్రాంటిన్ ఎయిడ్ లభించటం కష్ట సాధ్యంగానే వున్నప్పుడు పాలెంలోని కాలేజీలు వెంటనే ప్రభుత్వ గ్రాంటుకు అర్హమైనవని జి.ఓ. రావటం ఒక చర్చనీయాంశం. సుబ్బయ్యగారు శ్రద్ధాళువై సంస్థలను నడిపిన ధీశాలి. అనంతర కాలంలో పాలెం ప్రాచ్య కళాశాల ప్రభుత్వ కాలేజీ అయింది (1981లో). ఉస్మానియా విశ్వవిద్యాలయ ఉపాధ్యక్షులుగా వున్న నవనీతరావుగారి కృషి వల్ల ఈ ప్రాచ్య కళాశాల యుజిసి గుర్తుకు అర్హమైంది. ఇక్కడ మనం గమనించవలసిన ముఖ్య విషయాలు రెండు. దానిలో ఒకటి ప్రభుత్వ స్వాధీనమైన కళాశాల. రెండవది యుజిసి గ్రాంట్సు పొందటానికి అర్హత. ఈ రెండింటికి ఈ కళాశాలయే మొదటిది. (తర్వాత మరికొన్ని కాలేజీలు యుజిసి గ్రాంటు పొందే ఏర్పాటై, ప్రభుత్వ వశమైనాయి). కాలేజీ ప్రభుత్వ వశం అయింతర్వాత యుజిసి నిధులతో అనేకమైన అభివృద్ధి కార్యక్రమాలను జరిపినాం. కంప్యూటర్లు, ఫర్నీచర్ అప్పటికున్న లైబ్రరీని వృద్ధి చేసి సుమారు 70 వేలు వివిధ భాషల పుస్తకాలను ఏర్పాటుచేసి ప్రభుత్వానుమతితో 2002లో తెలుగు ఎం.ఏ కోర్సును ఆరంభించినాం. నేను రిటైరయ్యేవరకు ఆ కళాశాలలో 180 మంది విద్యార్థినీ విద్యార్థు లున్నారు. విశ్వవిద్యాలయంలో ఈ కళాశాల కీర్తి ప్రతిష్టలు గణనీయంగా వుండేవి. ఈ కాలేజి నుండి నేను ఓ.యు. ఎకడమిక్ సెనేటు మెంబరుగాను, బి.ఓ.ఎస్. అధ్యక్షునిగాను పనిచేయటం ఒక విశేషం.

పాలెం ప్రాచ్య కళాశాల విద్యార్థులు సిద్ధం చేయించిన 25 కిలోల పంచలోహ విగ్రహం శృంగేరి శారద. దీన్ని 'వాదరంజిత వాగ్దేవత'గా రోలింగ్ షీల్డ్ ఏర్పాటు చేసి ప్రతి సంవత్సరం జరిగే ఉపన్యాస పోటీలయందు ప్రథమునిగా గెల్చిన వ్యక్తికి (విద్యార్థి) నగదు మొదలైన వాటితో ఈ విగ్రహాన్ని ఇచ్చే సంప్రదాయం వుండేది. అట్లా ప్రతి సంవత్సరం విజేతలైనవారిలో శ్రీ శలాక రఘునాథ శర్మ, గిరిజా మనోహరబాబు, శేషం రామానుజాచార్య, మోతుకూరి నరహరి మొదలైన వారున్నారు. కాలేజీలో చాలా సదస్సులు, పండిత ప్రసంగాలు ఎన్నో కార్యక్రమాలను గొప్పగా నిర్వహించి భవిష్యత్తులో సుప్రసిద్ధులయ్యే విద్యార్థులను సిద్ధంచేసిన ఈ సంస్థ ఎన్.టి.రామారావుగారు ముఖ్య మంత్రిగా వున్నరోజుల్లో అప్పటి ఉన్నత విద్యా విభాగ సంచాలకురాలు 'వనజాక్షి' పర్యవేక్షణలో ఒక సంఘాన్ని "ప్రాచ్య కళాశాలలు ఎన్ని రద్దు చేయవచ్చునో" సూచించమంటే ఆమె పాలెం కాలేజీ చూడకుండానే పాలెం కాలేజీని మూసివేత జాబితాలో చేర్చింది. ఆనాటి ఎం.ఎల్.ఏలు, ఇతర నాయకులు కృషి చేసి రద్దును రద్దు చేయించి నిర్విఘ్నంగా కాలేజీ కొనసాగే ఏర్పాటును సుగమం చేసి కృతజ్ఞతాపాత్రులైనారు. ఈ వనజాక్షి కమిటీ కారణంగా కొన్ని కాలేజీలు (ఎక్కువగా ఆంధ్రాలో) రద్దయినవి. ఇది ఆరోజుల్లో ఒక సంచలన విషయం.

సుప్రసిద్ధులు దేవులపల్లి రామానుజారావుగారు ఆంధ్ర సారస్వత పరిషత్ ప్రాచ్య కళాశాలను స్థాపించి గొప్పవారి బోధనలతో విద్యార్థులను దిద్ది తీర్చినారు. రవ్వా శ్రీహరి, కె.ఎ. సింగరాచార్య, కె.కె. రంగనాథాచార్య వంటివారు దీనియందధ్యాపకులు. నేటికీ ఈ కళాశాల విద్యార్థి క్షామంతో మిణుక్కుమంటున్నది.

ఇంకా నగరంలోని అభ్యుదయ ఓరియంటల్ కాలేజి, ఇతర భాషల కళాశాలలు 'మేమున్నాం' అని అంటున్నాయి. నల్లగొండలోని గీతా విజ్ఞానాంధ్ర కాలేజీని రద్దు చేసి విద్యార్థులను, అధ్యాపకులను 'పేలపిండి' వలె ఎక్కడెక్కడికో విసిరిగొట్టింది ప్రభుత్వం. వరంగల్లు, ధర్మపురి కాలేజీలున్నాయి. వేములవాడలోని కాలేజీని టి.టి.డికిచ్చినట్లు తెలుస్తున్నది. ఆనాడు చదివినవారు గొప్పస్థానాలు పొందినారు. కాలేజీలకు సంప్రాప్తించిన ప్రభుత్వ సంబంధ కరువు కాటకాల్లోనూ డిస్టెన్స్ విధానంలోను, ప్రాచ్య విద్యాభ్యాస విద్యార్థులు స్వల్పంగా వస్తున్నా అంతా 'కరువునిధి' వలె విద్యార్థులు విద్యానిధులగుతున్నారు.

ఇది 'తెలంగాణ' రాష్ట్రం. తెలుగు భాషను అభివృద్ధి పరుస్తామని గొప్పలు చెబుతారు. ప్రపంచ తెలుగు మహాసభలను (2017లో) ఎవరికోసం జరిపినారు. దాని ప్రభావం – ఫలితం ఏంది? 'తెలంగాణ సాహిత్య ఎకాడమీ' ఏర్పాటు చేసి జీవనమృత్యు సంస్థగా నిలిపినారు. అధికార భాషా సంఘమనేది 'అధికారం కోసమే భాషా సంఘం' అయింది కదా. (కొన్నాళ్ళక్రితం దీని అధ్యక్షు దస్తమించినాడు). పాఠశాలల్లోను – విశ్వ విద్యాలయాలు, కళాశాల ల్లోను ఈతరం పండితులు వెళ్లిపోతే తెలుగు చెప్పటానికి విదేశీయులే గతా?

ప్రాచ్య విద్యలను పటువుగా నేర్చి అధ్యాపకుడైన వ్యక్తికి మామూలు డిగ్రీ తర్వాత విధిలేక ఎం.ఏ విద్యార్థియై అధ్యాపకత్వం నెరిపే వ్యక్తికి మధ్య గల భాషా బోధన రీతి ఎట్లుంటది? మన ప్రభుత్వం ఎం.పిలకు, ఎం.ఎల్.ఏలకు ఎంతో ఘనమైన వేతన వ్యవస్థను (పెంచుతూ) ఏర్పాటు చేసింది. అలవెన్సులు వేరుగానే వుంటాయి. వారి సౌకర్యాలు కూడా చాలా విచిత్రం. వీరేగాక ఎందరో చైర్మన్లు – ఇట్లా ఎన్నికోట్ల ధనం ప్రతి మాసం వ్యయం కావటం లేదా? ఒక ఓరియంటల్ కాలేజీ నిర్వహణ ఈ ఖర్చులో ఎంత? భాషాభివృద్ధి ఇదేనా? తెలుగు యూనివర్సిటీ వంటి సంస్థలు ఈ ప్రభుతలో 'గాలి తీసిన బుడగ'లైనాయి.

మన ముఖ్యమంత్రి భాషా ప్రియుడు. అద్భుత ప్రాసంగికుడు. వారికి వచ్చిన కొన్ని పద్యాలను సందర్భోచితంగా వినిపించి ఆనందం కల్గించే ధీశాలి. వారికీ ఓరియంటల్ కాలేజీల పరిస్థితిని తెల్పగలిగే వారెవరు? అందరివి శుష్కప్రియాలు, శూన్యహస్తాలేనా? ఇప్పటికైనా ప్రాత జిల్లాకొక ఓరియంటల్ రెసిడెన్షియల్ కాలేజీ పెట్టి, పండిత శిక్షణా సంస్థను ఏర్పాటు చేసి అన్ని వసతులతో అభివృద్ధి పరచగలిగితే భవిష్యత్తు కొరకు సంస్కృతాంధ్ర భాషలను రక్షించి వ్యాప్తి చేసి పండిత మండలిని సిద్ధం చేసినవారౌతారు. ప్రభుత్వం మేలు కోవటం మన భవిష్యద్దర్శనం చేయటం కోసమే! లేకుంటే మనం 'సాంస్క్రిట్' 'టెల్గుల' మనుషులయ్యే ప్రమాదం త్వరలోనే సంభవిస్తుంది. ఇదంతా వ్రాయటం ఎందుకంటే సుప్తభుజంగ సదృశ ప్రభుత్వాన్ని కదలించటానికే గాక నేను చదివిన నల్లకుంట కళాశాల, నేను పనిచేసిన పాలెం కళాశాల ఈ రెండూ నేడు బ్రహ్మ పదార్థాలైనాయి. పైగా ఈ మధ్య ఒక ఓరియంటల్ కాలేజీకి ఇంచార్జిగా వ్యవహరించిన డిగ్రీ కాలేజి ప్రిన్సిపాలుగారు ఓరియంటల్ ఎంట్రన్స్ 10వ తరగతి సమానం. ప్రీ –డిగ్రీ మన ఇంటర్ సమానం. కాబట్టి వాటిని కళాశాల విద్యాసంబంధ రహితం చేస్తున్నానని, మూడు సంవత్సరాల బి.ఏ. మాత్రమే మాకవసరం అని చల్లగా చెప్పినాడట. ఐతే ఇది మొదటినుంచి నాల్గు సంవత్సరాలు, తర్వాత ఐదు సంవత్సరాల ఇంటిగ్రేటెడ్ కోర్సు గదా! 1950 నుండి ఉస్మానియా విశ్వ విద్యాలయం అన్ని కోర్సులకు పరీక్ష నిర్వహించి, సర్టిఫికెట్లిస్తున్నాయి. ఆనాడు సమైక్య రాష్ట్రంలో కూడా అన్ని యూనివర్సిటీలు పరీక్షలను నిర్వహించి పట్టాలిచ్చినాయి గదా! ఆ ప్రిన్సిపాల్‌కు ఈ నడుమంత్రం ఆలోచన ఎందుకు వచ్చిందో! 'కాలోహి బలవాన్' కదా!

మన భాషలను రక్షించి ఓరియంటల్ కాలేజీలను వృద్ధి చేయటం గొప్పనైన మన ప్రభుత్వ కర్తవ్యం. ఈ పని చేయండని ఉద్యమాలు లేవు. సమ్మెలు లేవు. కాబట్టి ఫలం ఎంత? 'కత్తులు లేవు, గాండివము శూలములున్ మొదలే హుళక్కి'.

---

## బోనాల పండుగ

కనురెప్ప వలెనెంతొ జనుల కాచుకొనగ
గ్రామ దేవతలుగ గ్రామములలో
వెలసిరి సత్యమై వివిధ నామాలతో
కొంగుబంగారమై కొలుచు వార్కి
కట్టమైసమ్మగా కట్టపైన వెలసె
పొలిమేరలందున పోలేరమ్మ
ఎల్లరకెల్లమ్మ యెల్లలన్ రక్షింప
పోచమ్మ వెలసెను పోషణకును
అండదండగ వెన్నంటి యాదుకొనుచు
అనుగు బిడ్డల గాపాడునమ్మవారు
బోనమర్పించి తల్లికి, బ్రోవుమనుచు
వేడుకొందము భక్తిగ వేడ్కతోడ.

డా. బి. నీలిమా కృష్ణమూర్తి
ఫోన్ : 9700080030





ISSN 2457-0796
UGC Care List Approved Journal
మూసీ మాసపత్రిక సంపుటి -25 : సంచిక - 9 14 హైదరాబాద్ జులై : 2022

# తైత్తిరీయోపనిషత్ - ఆనందవల్లి

భీషాస్మాద్వాతః పవతే । భీషోదేతి సూర్యః । భీషాఽస్మా దగ్నిశ్చేంద్రశ్చ । మృత్యుర్ధావతి పంచమ ఇతి । సైషాఽఽనందస్య మీమాగ్ంసా భవతి । యువాస్యాత్సాధు యువాధ్యాయకః । అశిష్ఠో ధృఢిష్ఠో బలిష్ఠః। తస్యేయం పృథివీ సర్వా విత్తస్య పూర్ణాస్యాత్ । స ఏకో మానుష ఆనందః । శ్రోత్రియస్య చా కామహతస్య । తేయే శతం మానుషా ఆనందాః । స ఏకో మనుష్య గంధర్వాణా మానందః। స ఏకో దేవగంధర్వాణా మానన్దాః । శ్రోత్రియస్య చా కామహతస్య। తే యే శతం దేవగంధర్వాణా మానందాః। స ఏకః పితృణాం చిర లోకలోకానా మానందః । శ్రోత్రియస్య చా కామహతస్య । తే యే శతం పితృణాం చిరలోక లోకానా మానందాః । స ఏక ఆజానజానాం దేవానామానందః । శ్రోత్రియస్య చా కామహతస్య । తే యే శతమాజానజానాం దేవానా మానన్దాః । స ఏకః కర్మ దేవానాం దేవానామానందః । యే కర్మణా దేవానపియన్తి । శ్రోత్రియస్య చా కామహతస్య । తే యే శతం కర్మదేవానాం దేవానామానందాః । స ఏకో దేవానామానందః । శ్రోత్రియస్య చా కామహతస్య । తే యే శతం దేవానామానందాః ॥ స ఏక ఇంద్రస్యానందః । శ్రోత్రియస్య చా కామహతస్య । తే యే శతమింద్ర స్యానందాః । స ఏకో బృహస్పతే రానందః । శ్రోత్రియస్య చా కామహతస్య । తే యే శతం బృహస్పతే రానందః । స ఏకః ప్రజాపతే రానందః । శ్రోత్రియస్య చా కామహతస్య । తే యే శతరం ప్రజాపతే రానందాః । స ఏకో బ్రహ్మణ ఆనందః । శ్రోత్రియస్య చా కామహతస్య । సయశ్చాయం పురుషే । యశ్చాసావాదిత్యే । స ఏకః । స య ఏవం విత్ । అస్మాల్లోకాత్ ప్రేత్య । ఏతమన్నమయ మాత్మాన ముపసంక్రామతి । ఏతం ప్రాణమయ మాత్మాన ముపసంక్రామతి ।ఏతం మనోమయ మాత్మాన ముపసంక్రామతి । ఏతం విజ్ఞానమయ మాత్మాన ముప సంక్రామతి। ఏత మానందమయ మాత్మాన ముపసంక్రామతి । తదప్యేషశ్లోకో భవతి॥

వాయువు పరబ్రహ్మము వలన భయము వీచుచున్నది. సూర్యుడు భయము చేత ఉదయించుచున్నాడు. పరబ్రహ్మము వలన భయము చేత అగ్నియుని, ఇంద్రుడును, అయిదవ వాడగు యముడును ప్రవర్తించుచున్నారు.

**బ్రహ్మానందమంటే :** యవ్వనం, సాధుత్వం, వేదాధ్యయనం, పరిజనం, శరీర దృఢత్వం, ధైర్యం, బలం, భూతలమంతా ఏలునట్టి శక్తి కలిగి, ఈ భూమినంతా ధనంతో నిండితే అది ఒక మనుష్యానందమని చెప్పబడుతుంది. (ఇటువంటి ఆనందం వేదార్థ మెరిగిన శ్రోత్రియుడు, కామ రహితుడు అయిన బ్రహ్మవేత్తకు కూడా ఉంటాయి.)

ఇటువంటి మనుష్యానందానికి నూరు రెట్లు ఉన్నది మనుష్య గంధర్వానందం. దానికి నూరు రెట్లు కలది దేవ గంధర్మ ఆనందం. దానికి నూరింతలు కలది పితృదేవతల ఆనందం. దానికి నూరు రెట్లు ఆజానజ దేవతల యొక్క ఆనందం. దానికి నూరింతలు కర్మ దేవతల ఆనందం (కర్మ దేవతలనగా కర్మచే దేవత్వాన్ని పొందినవారు.) దానికి నూరు రెట్లు కలది దేవానందం. దానికి నూరురెట్లు ఉన్నది ఇంద్రానందం. దానికి నూరింతలు కలది బృహస్పతి ఆనందం. దానికి నూరు రెట్లు కలది ప్రజాపతి ఆనందం. దానికి నూరు రెట్లు అధికమైతే బ్రహ్మానందం. ఆ బ్రహ్మం మనుజుని హృదయంలో ఉంది. ఈ ఆనందాలన్నీ వేదార్థమెరిగిన శ్రోత్రియునకు, కామ రహితునకు కూడా ఉన్నాయి. మనుష్యుని లోని ఈ ఆనంద రూప బ్రహ్మమేది ఉన్నదో, సూర్యుని యందు ఏ బ్రహ్మముందో, ఆ రెండును ఒకటియే. ఇట్లు తెలుసుకున్నవాడు విషయాలందు అపేక్ష లేనివాడై అన్నమయ కోశాన్ని దాటుచున్నాడు. (ఆత్మ కంటే అది వేరని తెలుసుకొనుచున్నాడు). అట్లే మనోమయ, విజ్ఞానమయ, ఆనందమయ కోశాలను కూడా ఆత్మ కాదని తెలుసుకొంటున్నాడు.

(ఉపనిషత్ కల్పతరువు నుండి)



ISSN 2457-0796 UGC Care List Approved Journal
మూసీ మాసపత్రిక సంపుటి -25 : సంచిక - 9 15 హైదరాబాద్ జులై : 2022

బందారం కథలు - 8

# బంగారు గురిగి

డా. నందిని సిధారెడ్డి, ఫోన్ : 9440 381148



అంబటి మల్లయ్య ఆదరాబదరాగా నడుస్తున్నాడు. చీకట్లో బాట సరిగా కనబడటం లేదు. తెలిసిన తొవ్వే గనుక తికమక పడకుండా తొందర తొందరగా అడుగులు వేస్తున్నాడు. చూస్తుండగానే చీకటి అల్లుకపోయింది. చిమ్మటల రొద చీకాకు పెడుతుంది. ఎన్నోసార్లు రాత్రివేళల్లో కూడా ముచ్చాల నుంచి వచ్చాడు గాని ఎప్పుడూ భయం కలుగలేదు. ఆరోజు నడుస్తుంటే భయం తోస్తున్నది. ఎన్ని ధక్కా మొక్కీలు తిన్నాడు మల్లయ్య. ఎన్ని ఆటుపోట్లు ఎదుర్కొన్నాడు. నలబయ్యేండ్ల జీవితంలో ఎన్నో చీకట్లు దాటినవాడికి ఈ చీకటి ఒక లెక్కా? ధైర్యం తెచ్చుకొని నడుస్తున్నాడు గాని ఎక్కడో మూలన భయం తాకుతూనే వుంది. తన చెప్పుల చప్పుడే తనను భయపెడతున్నదా...

మల్లయ్య ఎట్ల బేరం చేస్తాడు బందారంలో ఎవరు ఎడ్లు కొనాలన్నా అమ్మాలన్నా మల్లయ్యను సంప్రదిస్తారు. వ్యవసాయం పనుల్లో ఎవరికి వారు తలమునకలై ఉండటం వల్లా, పట్నం అంగడి పోకడలు సరిగా తెలియకపోవటం వల్లా ఎక్కువమంది రైతులు మల్లయ్య మీదే ఆధారపడతారు. ఆరోజు కూడా ఎల్లమామ దగ్గర బేరం చేసిన ఎద్దును చేర్యాల అంగడికి కొట్టుకపోయాడు. మల్లయ్య మాట ఎంత చతురత ప్రదర్శించినా ఎందుకో ఆరోజు అంగట్లో ఎద్దు తొందరగా అమ్ముడు కాలేదు. తాను కొన్న దానికంటే ఐదో పదో ఎక్కువకు అమ్మితే తప్ప తనకు పడుతల పడదు. అందువల్ల ఆలస్యం తప్పలేదు. పదిహేను రూపాయలు లాబం వచ్చినందుకు సంతోషంగా వుంది గానీ - చీకటి పడినందకు గుబులు అనిపించింది. దానికి తోడు తొందరగా లారీ దొరకలేదు. ముచ్చాలలో దిగి బాట పట్టే సరికి ఊరు నిద్రపోతున్నది. ఊరు దాటంగానే ధోతి ఎగజెక్కి గోచి పెట్టాడు. తొంబై రూపాయలు బట్టసంచిలో పెట్టి మరో బట్టలో మడత పెట్టి నడుముకు కట్టుకున్నాడు. అంగడికి పొయ్యేటప్పుడు అంగీ వసుకున్నా అంగీ జేబులో పైసలు పెట్టడు. అంగీలోపల బనీనుకు కీస ఉన్నా అందులో జెనెమక సంచీ ఉన్నది. ఆ దారిలో అప్పుడప్పుడు దొంగల భయం ఉంటుంది. అందువల్ల తీసుకోవలసిన జాగ్రత్తలన్నీ తీసుకొని సర్ర సర్ర నడుస్తున్నాడు మల్లయ్య.

తాసూరు దాటి బందారం పొలిమేరలకొచ్చేసరికి సెరిసగం రాత్రి అయినట్లుంది. మెల్ల మెల్లగ భయం పోయ ప్రాణం కుదుట పడుతున్నది. ఊపిరి పీల్చుకున్నాడు మల్లయ్య. కుంట కట్ట ఎక్కి దిగాడు. పాటిగడ్డ ఎత్తుగా కనబడుతున్నది. ప్రశాంతంగా నడుస్తున్న మల్లయ్యకు అకస్మాత్తుగా ఎత్తుగా ఏదో ఆకారం కదిలినట్లనిపించింది. అంతే - మళ్లా భయం చురుక్కుమన్నది. ఎవరుంటారు? ఎవరు లేరులే - తన భ్రమ అనుకున్నాడు. అంత చీకట్లోనూ ఒక ఆకారం లేచి నడిచినట్ల తోచింది. ఒళ్లు జల్లుమన్నది. ఎన్నడూ లేని భయం. ఇదేమిటి? ఇట్లా మెత్తబడుతున్నాడు? తనకు తెలియకుండానే అడుగులు మందగించాయి? ధైర్యం కూడ దీసుకున్నా అడుగు ముందుకు పడటం లేదు.

నల్లటి చీకట్లో మరింత నల్లగా మరికొంత తెల్లగా, ఏదో ఆకారం కదులుతుందా... కదులుతున్నట్లనిపించి అంతలోనే ఆగిపోయింది. మల్లయ్య నడక ఆపేసి అటే చూస్తున్నాడు. చెప్పుల చప్పుడు పూర్తిగా ఆగిపోయింది. నిశ్శబ్దం... అస్పష్టంగా ఏదో చప్పుడు. ఏదో తవ్వుతున్న చప్పుడు. ఇంత రాత్రి... అద్దరాత్రి. చప్పుడేంటి? తేరిపార చూశాడు. ఆకారం చీకట్లో కలిసిపోయింది. కట్ట... కట్ట.... చప్పుడు. ఏమీ లేదు. తన భయమే అనుకున్నాడు. ఏదో ఉందనుకున్నాడు. కదల్లేక మళ్ళీ విన్నాడు. గాజుల చప్పుడు వినిపించింది. పాటిమీద దయ్యాలున్నాయని విన్నాడు. సన్నగా గాజుల చప్పుడు. దయ్యమే. వామ్మో. ఎన్నిసార్లు చీకటి ప్రయాణాలు చేసినా ఇట్లాంటి అనుభవం లేదు. ఇట్లాంటి విచిత్రమైన ఆకారం లేదు. ఈ తీరు భయం కలగలేదు. చెవి ఒగ్గి విన్నాడు. కట్ట.... కట్ట... గల... గల.... చప్పుడుకు భయం పెరుగుతున్నది. లోపల ఆకలి వేస్తూ అయోమయంగా ఉన్నది. ఏడుపొస్తున్నది. దయ్యాల గురించి ఎన్నోసార్లు విన్నా దయ్యం కనిపించలేదు దయ్యమే అయి ఉంటుందా... అయి ఉండవచ్చు.. మల్లయ్య ఎటూ తేల్చుకోలేకపోయాడు. ఏం చేయాలో తోచలేదు.

బనీనుకీసలోంచి జెకమక సంచీ తీశాడు. రాయి కొట్టి వెలిగిచాడు. వీడి ముట్టించాడు. ధైర్యం కోసం దమ్ము పీల్చాడు. అప్పుడు తోచింది. మనిషే అయి ఉండవచ్చు గదా. అది పాటిగడ్డ. కామిరెడ్డి నర్సయ్య కొన్నాడు గదా.... ఆమె లచ్చువ్వేమో... బుర్ర చురుగ్గా పనిచేసింది. ధైర్యం తెచ్చుకొని ముందుకు అడుగులు వేశాడు. మరింత పరిశీలనగా చూస్తూ కదిలాడు. మరింత దగ్గరగా వొచ్చిన తర్వాత నిర్ధారించు కున్నాడు. ఆమె లచ్చువ్వే.

"ఏందవ్వా... గింత రాత్రి పని చేసుకుంటున్నవు".

"నిదుర పడుతలేదు. ఎప్పుడైనా నేను జేసే పనే గదా. చేస్కుంటున్నా"

"ఏందో... భయపడి సస్తి గదనవ్వా"

లచ్చువ్వ మాట్లాడలేదు. మల్లయ్య ముందుకు నడిచాడు.

\+ \+ \+

'కామిరెడ్డి లచ్చువ్వ కనబడుతలేదు' వార్త ఊరంతా తెలిసిపోయింది. ఇంటి దగ్గర లేదు. బాయి దగ్గర లేదు. పాటిమీద లేదు. ఎవరి ఇంటికి పోదు. చుట్టాల ఇండ్లళ్లకు, ఊర్లల్లకు పోదు. పోలేదు. లచ్చువ్వ కనబడుతలేదు. పనికి ప్రతిరూపం లచ్చువ్వ. కాయకష్టానికి పేరెల్లిన లచ్చువ్వ. సంసారం కోసం చాకిరీ చేసే లచ్చువ్వ. బాయే బతుకైన లచ్చువ్వ. ఎవుసకు ఎత అయిన లచ్చువ్వ. నలుగురిని కన్నా నాలుగు మెతుకులు తిన నోచుకోని లచ్చువ్వ. అలసట లేని, ఆకలి కాని లచ్చువ్వ. లచ్చువ్వ కనబడుతలేదనే ముచ్చట మూడు బాటల నుంచి మూడూర్లకు పాకింది. పిల్లలొక దిక్కు, నర్సయ్యొక దిక్కు వెదికి వెదికి వేసారిపోయారు. ఎటు పోయిందో తెలియదు. ఏమైందో తెలియదు. నిన్న పొద్దున ఇంత ఉడుకేసి గంప పట్టుకొని ఆకులకని వెళ్ళింది. జాడ లేదు. పత్త లేదు. నడిరాత్రి పాటి మీద కనబడిందని మల్లయ్య చెప్పాడు. చుట్టుపక్కల వెదికారు. జాడ జవాబు లేదు.

రత్నవ్వకు నిన్నటిరోజు గుర్తుకొచ్చింది. ఎండాకాలం వచ్చిదంటే మోదుకాకుల కోసం వెళ్లటం ఊరి ఆడవాళ్లకు అదో పని. ఆకులు తేవటం, వాటిని పచ్చిగా ఉన్నప్పుడే దబ్బడంతో కుచ్చి, సుతిలితో తోరణాలు కూర్చటం, తోరణాలు ఎండబెట్టటం, ఎండిన ఆకుల్ని నానబెట్టి విస్తర్లు కుట్టటం, నూరు నూరు చొప్పున విస్తర్లు కట్టలు కట్టి కోమట్లకు అమ్మటం, వొచ్చిన పైసలతో కాపురాలు వెళ్లదీయటం. అదొక బతుకు తెరువు. వ్యవసాయ కుటుంబాల్లోనే కాదు ఊర్లో పటేండ్లు, దొరలు తప్ప ఏ కుటుంబమైనా ఆడవాళ్లయినా, మగవాళ్లయినా, పిల్లయినా, ముసల్లయినా ఏదో ఒక పని సగబెట్టటం అలవాటు. రికాముండదు. పని లేకుండా ఉండనే ఉండరు. కాలానికి తగిన పని. పని చేస్తేనే బతికే కుటుంబాలు మరి. ఊరంటేనే ఉమ్మడి బతుకు తెరువు. నిన్నటిరోజు నలుగురు ఆడవాళ్లతో కలిసి జోరసంచులు పట్టుకొని రత్నవ్వ ఆకుల కోసం రాసమాకుల కంచెకు వెళ్లింది. ఎర్రటి ఎండ. మోతుకులు నిండుగా ఉన్నాయి. ఎర్రటి పూలు, పచ్చటి ఆకులు. కర్రలు కొట్టుకపోయినా ఆకులతో విప్పారిన మోతుకు గుబుర్లు, ఆడవాళ్లు ఒకరికొకరు పోటీపడి ముచ్చట్లు పెట్టుకుంటూ ఆకులు తెంపి సంచిలో వేస్తున్నారు. ఒకరిద్దరు పిల్లలు చిన్నతట్టలో వేస్తున్నారు. వసంతానికి గ్రీష్మానికి నడుమ ఆ కాలం కంచె శోభాయమానంగా ఉంటుంది.

రత్నవ్వ ఆకులు తెంపుకుంటూ తెంపుకుంటూ పాటివైపు వెళ్లింది. పాటి నుంచి తెంపుకుంటూ లచ్చువ్వ వచ్చింది. ఇద్దరూ ఆకులు తెంపుకుంటూనే ముచ్చట పెట్టారు. లచ్చువ్వ తినకుండానే ఆకుల కోసం వచ్చిందట. అప్పటికే రెండు సంచులు నింపింది. రెండు గుల్లలు నింపింది. రత్నవ్వ సంచి నిండింది. మేం వెళ్తున్నాం రమ్మన్నది రత్నవ్వ. ''పనుంది రాన''న్నది లచ్చువ్వ. మిగతా ఆడవాళ్ళను వెదుకుకొని, కలుపుకొని ఇంటికొచ్చింది రత్నవ్వ.

"మొండి... మొండి జన్మ. వొండింది సుత తినది. పనే పని. పని దయ్యం. రోగం నొప్పి ఏదీ అనది. తెల్లారిలేత్తె పని. దయ్యమోలె రాత్రి నుత ఒక్కతె పోతది. భయం బద్ది ఏదీ లేదు. ఒక్కతే జేత్తది. జల్మంటే జల్మ. లచ్చువ్వకు మొక్కాలె."

తన దోస్తుల మాటలు గుర్తుకొచ్చాయి రత్నవ్వకు. 'పాపం, ఏమయిందో.... పురుగూ బుష్టీ ఏదాయెనో... ఏ దిష్టి తలిగెనో... ఏం పాడో.... పాపం, లచ్చువ్వ' అనుకున్నది రత్నవ్వ.

మరుసటిరోజు ఉదయం దుద్దెడలో తేలింది లచ్చువ్వ. స్పృహ వచ్చేసరికి శంభుదేవుని గుడి అరుగు మీద పడుకొని ఉంది. గుడి తలుపులు తెరుస్తూ పూజారి పలకరించాడు. నోరు తెరిచింది. మాట రాలేదు. లేవబోతే శక్తి చాలలేదు. పూజారి గుడిలోపలికి వెళ్ళి వచ్చి మళ్లా అడిగాడు. తనెవరో, ఎట్లా అక్కడికి చేరుకున్నదో గుర్తుకు రాలేదు. చెప్పలేకపోయింది. గుడి ఊడ్చే ఆమె వచ్చి లచ్చువ్వకు నీళ్లు తాపింది. కొంచెం శక్తి వచ్చినట్లనిపించింది. చేదబావి దగ్గర బకెట్లో నీళ్లు దోసిలితో తీసుకొని ముఖం మీద చల్లుకున్నది. కొన్ని నీళ్ళు తాగింది. ఒక్కొక్కటే గుర్తు రాసాగినాయి. జామచెట్టు కొంద చిలక కొరికి వదిలేసిన జామపండు కనబడింది. మెల్లగా అటు నడిచి పండు తీసుకొని కొంచెం కొంచెం తిన్నది. అరుగు మీద కూర్చున్నది.

పూజారి పూజ పూర్తి చేసుకొని వచ్చి తులసి తీర్థం పెట్టాడు.

లచ్చువ్వ లోపలికి వెళ్లి శంభుదేవునికి మొక్కుకున్నది.

శంభుదేవుడు తను నమ్ముకున్న దేవుడు. ఆ దేవుని దయ వల్లే తను బతికి బయటపడ్డది. ముందు రాత్రి ఏం జరిగిందో గుర్తుకొస్తున్నది.

లచ్చువ్వ చిన్న గడ్డపార పట్టి తవ్వుతున్నది. చుట్టూ చీకటి గుబురుకున్నది. నిలబడి తవ్వుతుంది. కూచుని మట్టి తీస్తుంది.

తవ్వుతుంది. తీస్తుంది. అయినా గురుగులు కనిపించడం లేదు. కుండలు బయట పడలేదు. ఎన్నిరోజులు నుంచో రాత్రులు తవ్వుతుంది. ఏదీ రాదు. ఏదో ఉండాలి. ఏదో రావాలి. ఇంకా ఇంకా తవ్వాలి. ఎవరికి తెలువకుండా తవ్వాలి.

తవ్వటం కొత్తకాదు. పాటిగడ్డ కొన్న తర్వాత బావి తవ్వింది. బావి పడదని అంటున్నా తన పట్టుదలతోనే నర్సయ్య బావి తవ్వటానికి పూనుకున్నాడు. వాళ్ల దగ్గర అప్పు తీసుకున్న నమ్మకస్తులు నర్సింలు, మైసయ్య ఇద్దరు. లచ్చవ్వ ముగ్గురే బావి తవ్వారు. పుష్కలంగా నీళ్లు పడ్డాయి. అచ్చు కడదామని మట్టి గడ్డ తవ్వుతుంటే ఓరోజు మూడు మట్టిపాత్రలు బయటపడ్డాయి. రెండు గురుగులు ఒక కుండ. అవి పగులకొట్టి చూస్తే బంగారం వస్తువులు. చిత్రమైన ఆకారాలు, కొన్ని ఆభరణాల వంటివి. కొన్ని నాణాల వంటివి. లచ్చవ్వ ఆశ్చర్యపోయింది. నర్సయ్య మురిసిపోయాడు. పనివాళ్లిద్దరి అప్పులు రద్దుచేసి, చెరి రెండు నాణాలిచ్చాడు. ఒట్టు పెట్టించుకున్నారు. అయినా పుకారు పుట్టింది.

నర్సయ్య అప్పట్నుంచి సావుకారయిపోయాడు. మిత్తీలకివ్వటం మరింత పెరిగింది. అనుమానం వొస్తుందని అవతారం మార్చలేదు. అవే ముతక బట్టలు. అవే ముతక మాటలు. చుట్ట కూడా మార్చలేదు.

లచ్చవ్వ అయితే తలకు నూనె కూడా పెట్టడం మానేసింది. కొత్తచీర కొనటం మానేసింది. చిరుగుల చీరకే బొమిడికెలు పెట్టి కట్టుకుంటుంది. ఇల్లుకు పండుగకు సున్నం కూడా వేయించదు. రహస్యం కాపాడుమని శంభుదేవునికి మొక్కుకుంటుంది.

లచ్చవ్వ అక్కడితో తృప్తి పడకుండా ఇంకా దేవులాడుతూ ఉంటుంది. విసుగు పడకుండా, అలసిపోకుండా తవ్వుతూనే ఉంటుంది. ఆ రాత్రీ తవ్వుతూ ఉంది. ఆకులొక వంక, సంచులు కుప్ప పడేసింది. పార పట్టింది. తవ్వుతూ.... తవ్వుతూ....

పొద్దున తినలేదు. మధ్యాహ్నం, సాయంత్రమైనా తినలేదు. రాత్రి తవ్వుతుంటే ఆకలయింది. దాహమేసింది. బాయిబజార్లో నీళ్లు పశువులు తాగినట్టున్నాయి. ఎండకు ఎండిపోయి వుంది. చీకట్లో ఏమీ తెలియలేదు. ఏమీ దొరుకలేదు. లచ్చవ్వకు శరీరం ఆర్చుకపోయింది. నాలుక పిడచ కట్టింది. తవ్వబోతే చేతులు లేవలేదు. సొమ్మసిల్లింది. నిద్ర పట్టింది. మెలకువొచ్చింది. ఏదీ కాని ఏదో స్థితి. లేవబోయింది. లేవలేకపోయింది. ఏదో ఆకారం ఎదురు నిల్చింది. దయ్యమేమో... ఎప్పుడూ కనబడలేదు. తననే అందరు దయ్యమంటుంటారు. తనను చూస్తే దయ్యాలు పారిపోతాయంటుంటారు.

దయ్యమేనా? ఏదో... చేయిపట్టి లేపినట్టే లేచింది లచ్చవ్వ. తోసేసినట్టే పడిపోయింది. దయ్యం గుండెల మీద కూచున్నది. బంగారు కుండల కోసం తండ్లాడితే ఇదేమిటి. దయ్యం. మొండి దయ్యం. గాజుల చప్పుడు. నాణాల చప్పుడు రెండూ కలిసిన చప్పుడు... ఆడి దయ్యమే... మొదటిసారి లచ్చవ్వకు భయం సోకింది. ప్రాణం తీస్తుందేమోననిపించింది. గుండెల మీంచి లేవటం లేదు. భయం పెరిగింది. పిల్లలేం కావాలె? మొగుడేం కావాలి? అయ్యో.... అయ్యయ్యో... బంగారమేం కావాలె? దేవుడా దేవుడానా....

లచ్చవ్వ శంభుదేవుడికి మళ్లా గట్టిగా మొక్కుకున్నది. దేవుడొచ్చి తోసేసినట్టే గుండెల మీది దయ్యం పడిపోయింది. ఒకరినొకరు తోసుకుంటున్నారా? తను లేచి పారిపోతే బాగుండు. కత్తులు రాసుకుంటున్నట్లు ఖణ్ ఖణ్ చప్పుడు. గడ్డపారతో తవ్వుతున్నట్టు చప్పుడు.... ఖణ్ ఖణ్.... బంగారం నాణాలు కొట్టుకుంటున్నట్టు. ఖణ్ ఖణ్.... ఎవరో పిలగాడు సలాకల మీద రాయితో కొడుతున్నాడు.

శంభుదేవుని గుడి అరుగు మీదనుంచి లేచి మెల్లమెల్లగా అడుగులు వేసింది లచ్చవ్వ. మలుపు తిరిగి బందారం బాట పట్టింది. లచ్చవ్వ బందారం చేరుకునేసరికి పొద్దు నడినెత్తిమీది కొచ్చింది. పిల్లలు సంతోషించారు. నర్సయ్య ఊపిరి పీల్చుకున్నాడు. ఊరు కుదుట పడింది.

పక్కింటివాళ్లు లచ్చవ్వకు కొంచెం కొంచెం తినపించారు. తిని అట్లే అరుగు మీద ఒరిగింది. నిద్రా... కలా... తవ్వుతూ వుంది.

ఖణ్.... ఖణ్.... వినిపించింది. కనిపించిందేమో మరి, బంగారు గురిగి.

# ధ్యానం

భగవంతుని ధ్యానించడంలో రెండు పద్ధతులున్నాయి. ఒకటి భగవంతుడు "సర్వవ్యాపి" అని. రెండవది "ఆయన ఇక్కడే ఒక దగ్గరనే ఉన్నాడు" అని. మొదటి పద్ధతిలో భగవంతుడు సూర్యునిలో, చంద్రునిలో, నక్షత్రాలలో, సర్వత్రా, సర్వ వస్తు సముదాయంలో ఉన్నాడని భావిస్తూ ధ్యానించడం. మరొక ప్రక్క ప్రాథమిక దశలో భగవంతుడు విగ్రహ రూపంలో దేవాలయంలో ఉన్నాడని భావిస్తూ, పూజలు, భజనలు చేస్తూ దేవుని విగ్రహం ఎదుటనే కూర్చుని ఉండడం. ప్రాథమిక దశ పూర్తవుతే గాని మొదటగా మనం చెప్పుకున్న సర్వవ్యాపకత్వంలో ఆ దైవాన్ని చూడగలం.

ISSN 2457-0796
మూసీ మాసపత్రిక సంపుటి -25 : సంచిక - 9  UGC Care List Approved Journal
హైదరాబాద్ జూలై : 2022

## సాధన పంచకమ్

**వాక్యార్థశ్చ విచార్యతాం శృతిశిర: పక్షః సమాశ్రీయతాం**
**దుస్తర్కా త్సువిరమ్యతాం శృతిమతస్తర్కోకను సంధీయతామ్।**
**బ్రహ్మైవాస్మి విభావ్యతాం అహరహర్గర్వ: పరిత్యజ్యతాం**
**దేహేకహమ్మతి రుజ్ఝ్యుతాం బుధజనైర్వాద: పరిత్యజ్యతామ్॥**

**తాత్పర్యం :** 1. వేదాంత వాక్యములను చక్కగా విచారణ చేయవలెను. 2. వేదాంతము లేక ఉపనిషత్తులు నిర్ణయించిన సిద్ధాంతమునే ఆశ్రయింపవలెను. 3. చెడు తర్కమును విడనాడ వలెను. 4. వేద సమ్మతమైన తర్కమునే (యుక్తినే) అనుసరిపవలెను. 5. నేను బ్రహ్మమునే ఐ ఉన్నాను అని చక్కగా భావన చేయవలెను. 6. ఎప్పటికప్పుడు గర్వమును త్యజింపవలెను. 7. దేహమే నేను అనెడు భావమును విడిచిపెట్టవలెను. 8. బుధజనులతో వాదించుటను మానివేయవలెను.

### వివరణ

**4. శ్రుతిమతస్తర్కోకను సంధీయతామ్ –**

వేదసమ్మతమైన తర్కమునే (యుక్తినే) వినియోగించుకోవలెను. అయితే శాస్త్రమును ఎవరికి వారుగా చదివి అర్థం చేసుకోవడం సాధ్యపడేది కాదు. అది అవగాహనకు రాదు. కావున వేదం బోధించెడు మార్గమునకు అనుకూలమైన తర్కమును జోడించి సక్రమంగా శాస్త్రమును బోధించే విధానం గురువులకే తెలుసు. అందువలన వేదము ఆమోదించిన తర్కమునే ఉపయోగించు కుంటూ గురు సన్నిధిలో శాస్త్రమును అర్థం చేసికోవలెను.



## సత్సంగం



### జ్ఞాని – ప్రపంచం

శ్రీ రమణ మహర్షి కొన్నిమార్లు పారమార్థికానికీ, వ్యావహారికానికీ నడుమనున్న భేదాన్ని గురించి చెప్పారు. ఒక కోణం నుండి సత్యమైనది మరొక కోణం నుండి కాదు. తేలిక మాటల్లో ఈ కిందివిధంగా చెప్పవచ్చు. సూర్యుని పక్షం నుంచి చెప్తే – సూర్యుడు ఉదయించనూ ఉదయించడు, అస్తమించనూ అస్తమించడు; అంధకారమూ లేదు, కాంతి యొక్క భిన్నచ్ఛాయలను దాచిపెట్టడమూ లేదు. నిర్వచనం ప్రకారం, కాంతి ఉన్నచోట అంధకారం ఉండటానికి వీలు లేదు. కాని భూమి మీద ఉన్న వ్యక్తి కోణం నుంచి చూస్తే, సూర్యుడు ఉదయిస్తాడు, అస్తమిస్తాడు; వెలుతురూ ఉంది, చీకటీ ఉంది; రెంటికి నడుమన అనేక ఛాయలూ ఉన్నాయి. సూర్యుడు చీకటికి శత్రువని ముద్రవేయడమూ సమంజసమే. ఏ దృక్కోణం నుంచి చూస్తున్నామన్నదాన్ని సరిగ్గా అర్థం చేసికొంటే, పరస్పర విరుద్ధంగా అన్పిస్తున్న రెండు అభిప్రాయాలు కూడా, చెల్లుబాటు అయ్యేవే. ఐనా, ఒక కోణం నుంచి సరయినది మరో కోణం నుంచి సరికావడం లేదన్న విషయం గమనించాలి. సూర్యుని వైపు నుంచి అంతా ప్రకాశమే. చీకటివైపు నుంచి కొంతగా కాంతి ఉన్నది, కొంతగా చీకటీ ఉన్నది. రెంటి నడుమ ప్రతి ఒక్క ఛాయ కూడా ఉన్నది. సందర్భానుసారంగా శ్రీరమణులు రెండు నిర్వచనాలనూ వాడినారు. వ్యక్తి ముక్తి పొందేవరకూ సాపేక్షతా దృక్కోణం నిర్లక్ష్యం చేయబడవచ్చునా?



వ్యవహార స్థాయిలో వేరువేరుగా అగుపించేవీ, ప్రత్యేకంగా గ్రహింపబడేవీ, కర్త, కర్మ, – అన్న ఖండస్థితిని, బ్రహ్మము దృక్కోణం నుంచి పోగొట్టుకొంటాయన్న దానిని శ్రీరమణులు అంగీకరించారు. అంటే "సర్వం బ్రహ్మమయం" అన్నది శాశ్వత సత్యం కాగా, 'ఇదంతా దేనికదిగా వేరు వేరు, విలక్షణమైనది – అన్నది సాపేక్షికమైన సత్యం. ఒక కోణం నుంచి, వాస్తవం యొక్క ఒక స్థాయి నుంచి సత్యమైనది, మరొక వైపు నుంచి కాదు. ఐతే, దీనర్థం రెండు వాస్తవాలు, రెండు సత్యాలు ఉన్నవని కాదు. రెండు భిన్న కోణాల నుంచి ఒకే సత్యం, వాస్తవం చూడబడ్తున్నది.

రెండు దృక్కోణాల నడుమన భేదాన్ని అద్వైత సంప్రదాయం స్వరూప లక్షణంగా, తటస్థ లక్షణంగా నిర్వచించింది. తటస్థ లక్షణమునకు ఉదాహరణ – జగత్తు యొక్క సృష్టి స్థితి లయములకు బ్రహ్మము కారణం. ప్రపంచంలో వికారమునకు లోనయ్యే పదార్థాన్ని కాక, పదార్థానికి మూలంగా ఉంటూ వికారం లేని దానిని, కారణంగా అద్వైత వేదాంతంలో చెప్తారు. ప్రపంచం బ్రహ్మము యొక్క వికారము కాదు. అవాస్తవమూ, భ్రమాత్మకమూ అయిన దానిని ప్రపంచంగా పొరపడుతున్నారు. 'దానికి' కప్పి ఉంచిన దృశ్యాన్ని తొలగించి వేసినప్పుడే చూసే వానికి బ్రహ్మము తెలుస్తుంది.

ISSN 2457-0796
UGC Care List Approved Journal
మూసీ మాసపత్రిక సంపుటి -25 : సంచిక - 9 19 హైదరాబాద్ జులై : 2022

సాహిత్యం – వైజ్ఞానిక మూల్యాంకనం

# సూర్యకాంతి ప్రకాశమే 'సారస్వతం'

డా. సాగి కమలాకర శర్మ, ఫోన్ : 9704 227744



"యా కుందేందు తుషార హార ధవళా యా శుభ్ర వస్త్రాన్వితా
యా వీణా వరదండ మండిత కరా యా శ్వేత పద్మాసనా
యా బ్రహ్మాచ్యుత శంకర ప్రభృతిభిః దేవైః సదా వందితా
సా మాం పాతు సరస్వతీ భగవతీ నిశ్శేష జాడ్యాపహా"

"సరస్వతీ నమస్తుభ్యం వరదే కామ రూపిణీ
విద్యారంభం కరిష్యామి సిద్ధిర్భవతు మే సదా
పద్మ పత్ర విశాలాక్షీ పద్మకేసరి వర్ణినీ
నిత్య పద్మాలయాం దేవీం సా మాం పాతు సరస్వతీ"

ఇటువంటి శ్లోకాలతో నిత్యం సరస్వతీ ప్రార్థన అందరూ చేస్తారు. ముఖ్యంగా విద్యార్థులు తప్పనిసరిగా చేస్తుంటారు. ఏ కావ్యాన్ని ఎవరు ప్రారంభించాలని ప్రయత్నించినా ప్రారంభ శ్లోకాల్లో తప్పనిసరిగా సరస్వతీ మూర్తి ప్రార్థన ఉంటుంది.

విద్యారంభ సమయాల్లో తప్పనిసరిగా సరస్వతీ దేవి ప్రార్థన చేయించడం పరిపాటి. మన చుట్టూ ఉండే జ్ఞాన సంబంధమైన వస్తువులపై పొరపాటున కూడా కాళ్ళు పెట్టకూడదనీ, అవన్నీ సరస్వతీ స్వరూపాలే అని భావించే సంప్రదాయం భారతీయులది. పలక, బలపం, కాగితం, కలం, పుస్తకాదులు, సంగీత సాహిత్య సాధనాలు, ఆధ్యాత్మిక సాధనాలైన వరమాలాదులు .... మొదలైనవన్నీ అధ్యయనానికి, జ్ఞాన వృద్ధికి, ఆధ్యాత్మిక సాధనలకు అవసరం అయ్యేవి. వాటిపై కాళ్ళు పొరపాటున తాకినా నమస్కారం చేసి జాగ్రత్తలు తీసుకుంటూ ఉంటాము.

తెల్లని తెలుపుతో ఉన్న మూర్తిగా చతుర్భుజాలతో, పద్మంలో గాని హంసపైన గాని కూర్చుని, వీణ, వరమాల, పుస్తకాదులను ధరించి, ప్రసన్న వదనంతో ఉన్నటువంటి మూర్తిని జ్ఞానానికి, విద్యలకు అధిదైవంగా మనం పూజ, స్తోత్రం, జప, ధ్యానాదులు చేస్తుంటాం. ఈ మూర్తి స్వరూపం వెనుక ఉన్న భారతీయ వైజ్ఞానిక భావాన్ని అర్థం చేసుకునే ప్రయత్నం చేద్దాం.

సరతి అంటే కదిలేది అని అర్థం. మనిషిలోని భావాలను సరియైన విధంగా కదిలించేది సరస్వతి. సర్ప శబ్దంలోనూ, సరస్ శబ్దంలోనూ సరతి అంతర్భాగంగా మనకు కనిపిస్తుంది. కదలికలకు మూలమైంది సరస్వతి. మనిషికి ఒక నూతన విషయం తెలిసినప్పుడు తనలో కొన్ని మార్పులు కలుగుతుంటాయి. ఆ విషయం పట్ల అవగాహన కలుగుతుంది. అవగాహన వల్ల ధైర్యం, ఆనందం రెండూ పెరుగుతూ ఉంటాయి. బుద్ధి వికాసం పొందుతుంది. అందువల్ల జ్ఞానం మనిషిలో చాలా అంశాలను కదిలించడానికి వినియోగ పడుతుందని అర్థం అవుతుంది. కాబట్టి జ్ఞాన స్వరూపమే సరస్వతి.

ఒక వస్తు జ్ఞానం మనిషికి కావాలంటే ఆ వస్తువుపై వెలుగు పడాల్సి ఉంటుంది. వస్తువు నుండి కాంతి వెళ్ళిపోకుండా ఉన్నప్పుడు అది ప్రతిఫలిస్తుంది. ప్రతిఫలనం ద్వారా ఆ వస్తువు యొక్క ఏదో ఒక రంగు, విధానం, ప్రభావాలు మనకు అర్థం అవుతూ ఉంటాయి. వెలుగు పడటం ద్వారా ప్రకాశించిన వస్తు సముదాయ పరిజ్ఞానం వల్లనే మనిషి బుద్ధి శక్తిని పెంచుకుని ధీమంతుడవుతున్నాడు.

అదే విధంగా ఏదో వెలుగు మనలోని భావాలపై ప్రసరించడం వల్లనే మనిషికి నూతనాంశ ఊహ లేదా స్ఫురణ కలుగుతుంది. దానిని విశ్లేషిస్తూ ఉండడం వల్ల కాలక్రమంలో ఆ యా అంశాలపై సాధికారిత ఏర్పడుతుంది. ఈ తత్త్వమే సరస్వతీ తత్త్వంగా మన పూర్వీకులు మనకు సూచనలు చేసినారు. ఈ సరస్వతీ సంబంధమైనది అంతా సారస్వతం.

ఒక గదిలో ఒక లైట్ వేసుకున్నప్పుడు ఆ గదిలోని వస్తువులు ప్రకాశిస్తూ మనకు కనిపిస్తుంటాయో అదేవిధంగా విద్య, బుద్ధి, విశ్లేషణ అనే వానిలోనూ ఈ ప్రకాశమే కనిపిస్తుంది. సూర్యుని కాంతి

ISSN 2457-0796
UGC Care List Approved Journal
మూసీ మాసపత్రిక సంపుటి -25 : సంచిక - 9  హైదరాబాద్ జులై : 2022



ఈ భూమండలం పైన విస్తరించినప్పుడు ఆ యా ప్రదేశాలన్నింటి యొక్క విధానం, ప్రభావాలు మనకు తెలుస్తున్నాయి. సూర్యుడు ప్రసరించని ప్రదేశాలలో చీకటి ఉంటుంది. వెలుగు వల్ల జ్ఞానం, చీకటి వల్ల అజ్ఞానం కలుగుతూనే ఉంటుంది.

సరస్వతీ దేవి మూర్తిని జ్ఞానానికి అధిదేవతగా నిర్ణయించింది భారతీయ విజ్ఞానం. సూర్యుని కాంతి పెద్ద దీపం వంటిది. దాని ముందు ఇతరమైన చిన్న చిన్న దీపాలు ఉపయోగపడవు. అదేవిధంగా అత్యద్భుతమైన జ్ఞానాన్ని సాధించిన వాడి తేజస్సు ముందు సాధారణ మైన విజ్ఞానం పనికి రాదు. ఆత్మజ్ఞానం సాధించిన వాని ముందర ప్రకృతి జ్ఞానం మరియు లోక జ్ఞానం అనవసరాలు అవుతాయి. ప్రకృతి జ్ఞానం అవగతమైన వానికి లోకజ్ఞానం అనవసరమే. అంతకన్నా ఎక్కువ ఎదగడానికి కావలసిన జ్ఞానం మాత్రం సూర్య తేజం లేదా వెలుగు, ప్రకాశాదుల ద్వారా మనకు లభిస్తూంటుంది.

సూర్యుని కాంతి కిరణాలే లేకపోతే ఈ లోకమే వ్యక్తమయ్యేది కాదు. వ్యక్తమైన లోకంలో జీవజాతి వ్యుత్పన్నమయ్యేది కానేకాదు. సూర్య కాంతి ప్రతిఫలనం వల్లనే ఎన్నో మార్పులు కనిపిస్తున్నాయి. ఆ సూర్యతేజస్సుకు, ప్రకాశానికే మన పూర్వీకులు 'సరస్వతీ దేవి' అనే నామకరణం చేసినారు. అపారమైన, అద్భుతమైన, అనంతమైన, అగణితమైన ఈ సూర్య కాంతి శక్తిని మనం ఊహించడం కష్టం. కాని దానికి కృతజ్ఞతలు చెప్పడం భారతీయ సంప్రదాయం. మరి ఎలా చెప్పాలి. పిల్లవాని స్థాయిలో ఈ కాంతి ప్రకాశ శక్తికే రూపం ఏర్పడవలసిన అవసరం కలిగింది. ఆ రూపమే సరస్వతీ దేవి మూర్తి.

నూతనాంశాలను బాహ్యమైన కండ్లతో చూసి తెలుసుకోవడంతో జ్ఞాన భావన మొదలవుతుంది. పంచేంద్రియాల ద్వారా వాని స్వభావాలను గమనిస్తే ఇంకా లోతైన జ్ఞానం కలుగుతుంది. అయితే బాహ్యమైన జ్ఞానం కలగడానికి దానిపై నిరంతరం కాంతి ప్రసారం జరుగుతూ ఉండాలి. అంతరమైన స్ఫురణ ఏర్పడడానికి తగినంతగా ఆ అంశంపై అవగాహన కలిగి ఉండాలి. ఇదంతా జ్ఞానం, విద్య మొదలైన వానిని సాధించే మార్గాలు. వీనికి అధిదైవమే సరస్వతి. ఒకరకంగా మనిషికి ఆలోచనను, ప్రేరణను, స్ఫురణను ఇచ్చేది సరస్వతి. సూర్యకాంతి వల్లనే ఇటువంటి క్రియ బాహ్యంగానూ, అంతరంగానూ జరుతుతూ ఉంటుంది. ఈ మూర్తిని గూర్చిన అధ్యయనం అందుకే వైదిక కాలం నుండీ ఉంది. అపరిమితమైన వెలుగుతో కూడుకున్న సూర్యకాంతిలోని 'వెలుగు' లేదా 'కాంతి' భాగాన్ని సరస్వతీ రూపంగా అధ్యయనం చేసి, దానికి నమస్కరించే విధానాన్ని అలవాటు చేసింది భారతీయం.

ప్రకాశించే ప్రతి వస్తువు తన ఉనికిని తెలియజేస్తుంది. ప్రకాశించ లేనిది ఉనికికి దూరం అవుతుంది. ప్రకాశంతో ఉన్నవానినే మనం గమనిస్తాం. వస్తువునైనా, జ్ఞానినైనా. ప్రకాశరహితమైతే వదిలిపెట్టి వెళ్ళిపోతాం. ఒక రకంగా దేహంలోని చైతన్యమే ప్రకాశానికి హేతువు. చైతన్య రహితమైన దేహాన్ని అందరూ వదిలిపెడతారు. అదేవిధంగా భాసించేదానిని మాత్రమే పట్టించుకోవడం జరుగుతుంది. కాంతి వల్లనే సమస్త విజ్ఞానాదులు కలుగుతున్నాయి. ఆ కాంతికి రూపమే సరస్వతీ దేవి.

కాంతికి రూపం సరస్వతీ మూర్తి కావడం వల్లనే, ఆ అమ్మకు పూర్తిగా తెలుపు వర్ణంతో కూడుకున్న ఆహార్యాన్ని సమకూరుస్తారు. జ్ఞానం ద్వారా మనని మనం శుద్ధి చేసుకోవడమే శుభ్ర వస్త్ర భావనకు రూపం. అన్నీ తెలుపు వస్తువులు, ఆహార్యం, హంస, శ్వేత పద్మం మొదలైనవన్నీ సూర్యకాంతిని పరోక్షంగా సూచిస్తున్నవే. వీనిలో పద్మం వికాసానికి సంకేతం. సూర్య కాంతి పడినప్పుడు కమలం వికసిస్తుంది. జ్ఞానం కలిగినప్పుడు వ్యక్తి వికసిస్తాడు. ఇదే సంకేతార్థం. హంస అనేది భారతీయ పురాణాల ప్రకారం స్వచ్ఛతకు సంకేతం. పాలు నీళ్ళను వేరు చేస్తుందని కథనాలు హంస విషయంలో మనకు కనిపిస్తుంటాయి. జ్ఞాని మాత్రమే ఇటువంటి పనులు చేసి, మంచి చెడులను తన బుద్ధితో సరియైన విధంగా విశ్లేషించుకోగలడు. అక్షమాల ఆధ్యాత్మిక విద్యలకు సంకేతంగా, ఏకాగ్రతకు సూచికగా సంకేతించబడింది. అదేవిధంగా వీణ కూడా భారతీయమైన కళలకు, శబ్ద మూలానికి సంకేతంగా అమర్చబడింది. ఇవన్నీ సంకేతాలే. ఇక పుస్తకమనేది లోక, ప్రకృతి, ఆత్మ జ్ఞానాలను సంకేతించినదే. అందుకే సరస్వతీ రూపం అన్ని రకాలుగా సూర్య కాంతి యొక్క సమాహార రూపం అని చెప్పక తప్పదు.

ఆకాశంలోనూ నక్షత్ర మండలంలో శ్రవణా నక్షత్రానికి ముందుగా అభిజిత్ మండలం అని ఉంటుంది. ఈ నక్షత్రం ఒకటి కాదు. రెండు నక్షత్రాల చుట్టూ రెండు నక్షత్రాలు తిరుగుతూ నాలుగు ముఖాల భావన కలుగుతుంది. ఈ నక్షత్ర మండలానికే అధిపతిగా మనవారు బ్రహ్మను నిర్ణయించి, నాలుగు ముఖాలుగా తీర్చిదిద్దడం జరిగింది. ఈ మండలం ప్రక్కనే మనకు వీణా మండలం ఉంటుంది. దీనికే

'లైరా' అని పేరు. ఈ వీణా మండలానికే వీణాపాణియైన సరస్వతి అని అర్థంలో నక్షత్ర సంకేతాలు తెలుపుతున్నాయి. దీనికి కొంత కిందుగా హంస (హగ్ంస) మండలం మరొకటి ఉంది. దీని ఆంగ్ల రూపం 'సిగ్నస్'. ఈ హంస మండలం దగ్గర పాలపుంత యొక్క గాఢత క్రమంగా తగ్గి పోతుంది. అందుకే హంస పాలనూ, నీళ్ళనూ వేరు చేస్తుందనే ఆకాశ నాక్షత్రిక సంకేతాలన ఆధారం చేసుకుని పురాణీకరించడం జరిగింది.

హం బీజం మంత్రశాస్త్రం ప్రకారం ఆకాశ తత్వానికి, సం బీజం సర్వ తత్వాలకు సంకేతించబడినాయి. హంస శబ్దం వల్ల ఆకాశమంత విస్తరించిన భావాన్ని సంకేతించే అవకాశం కలుగుతుంది. ప్రాణము, చైతన్యము అనే భావాలకు కూడా 'హంస' శబ్దాన్ని వినియోగిస్తుంటాం. యోగులను పరమహంసలుగా భావించే సంప్రదాయం కూడా భారతీయులదే.

ఒక మూర్తి స్వరూపాన్ని తయారు చేయడం వెనుక ఒక విజ్ఞానం, ఒక తపస్సు, ఒక ధ్యానం అన్నీ ఉంటాయి. ఆ యా భావనలకు కాలక్రమంలో ఒక గొప్ప రూపం దిద్దుకుంటుంది. ఆ రూపం ద్వారా మూలశక్తికి మనం చేరాలనేది భారతీయ భావన.

భాః అంటే కాంతి, ప్రకాశం. దాని మీద ఇష్టం (రతము) కలిగిన వారే భారతీయులు. సూర్యునికి భాస్కరుడు (భాః కరోతీతి భాస్కరః) అని పేరు. అది భాను మండలం. భాసించడం మొదలైన పదాలు కూడా అక్కడ నుండే వచ్చినాయి. భారతి, సరస్వతి, శారద, హంస వాహిని, జగద్విఖ్యాతి, వాగీశ్వరి, కౌమారి, బ్రహ్మచారిణి, బుద్ధిధాత్రి, వరదాయిని, క్షుద్రఘంటా, భువనేశ్వరి మొదలైన నామాలన్నీ .... భౌతికంగా మన చుట్టూ ఉన్న లోకాన్ని సూర్య ప్రకాశం వల్ల తెలియజేసేవిగా కనిపిస్తూనే, ఆంతరంగా లోపలి చైతన్యాన్ని ప్రేరేపించేవిగా ఉన్నాయి.

కవులు, రచయితలు ఎందరో తమ కావ్యాల ప్రారంభంలో తప్పనిసరిగా సరస్వతీ ధ్యానం చేస్తూనే వచ్చారు. అన్ని రకాల చదువులలోనూ సరస్వతీ అర్చన జరుగుతూనే ఉంటుంది. ఆ రూపాన్ని బాగా చూసి చూసి దాని నుండి మూలమైన సూర్య ప్రకాశానికి మనం చేరగలిగి, దానితో మనం అనుసంధానం చేసుకోవడం అవసరం. దాని ద్వారా మనిషి పూర్తిస్థాయిలో వికాసాన్ని పొందుతాడు. మూలమైన సూర్య ప్రకాశంతో నిరంతరం అనుసంధానం అవుతూ ఉండేవాడే జ్ఞాని. భౌతికమైన చక్షువులు పనిచేయాలన్నా, జ్ఞాన చక్షువులు వికసించాలన్నా కాంతి అవసరమే.

బ్రహ్మము అంటే విస్తరించినది అని అర్థం. బృహత్ శబ్దం మనం తరచుగా వింటూనే ఉంటాం. కాలానికి, ప్రకృతికి బ్రహ్మ శబ్దంతో ముడిపెట్టడం మన సంప్రదాయం. అటువంటి బ్రహ్మకు భార్యగా సరస్వతిని సంకేతించడం వెనుక కూడా ఇంతటి విస్తరణకు కారణమైనది జ్ఞానమే అని సూచన చేయడం.



వాగ్దేవత గా కూడా సరస్వతీ దేవి మనకు ప్రత్యేకంగా కనిపిస్తుంది. జ్ఞాని యొక్క వాక్కులు ప్రకాశవంతంగా ఉంటాయి. వారి మాటలు ఎదుటివానిని జ్ఞానిగా మారుస్తాయి. సూర్యతేజస్సు లాగా. తాను వెలుగుతూ మరోదాన్ని వెలిగించే దీపం లాగా, జ్ఞాని వాక్కులు లోకానికి ప్రేరణను ఇస్తాయి. అందుకే సరస్వతీ దేవికి వాణి అనీ, వాగీశ్వరి అని, వాగ్దేవత అని ప్రత్యేకంగా పేర్లు కనిపిస్తున్నాయి.

సూర్యకాంతి వ్యక్తిలోని జడత్వాన్ని తీసివేసి చైతన్యాన్ని కలిగిస్తుంది. అదేవిధంగా జ్ఞానం అనేది మనిషి బుద్ధిలోని జడత్వాన్ని తీసివేస్తుంది. అందుకే సరస్వతి 'జాడ్యాపహారిణి' అవుతుంది. ఇటువంటి సంకేతాలు భారతీయమైన దేవతా విగ్రహాల వెనుక ఉంటాయి.

పురాణాల ప్రకారం సరస్వతి యుద్ధం చేసినట్లుగా కూడా కథనాలు ఉన్నాయి. సరస్వతీ దేవి యుద్ధమంతా ఈ లోకంలోకి సూర్యకాంతి రానీయకుండా ఆపినవారిపై చేసే యుద్ధమే. రెండవది జ్ఞాన ప్రవాహానికి అడ్డుపడే వారిపై చేసే యుద్ధమే అవుతుంది. పౌరాణిక గాథల వెనుక ఉన్న అంశాలను క్రమంగా విశ్లేషించుకుంటే ఈ అంశాలపై సరియైన అవగాహన వస్తుంది.

రూపాన్ని ఏర్పరచడం, పూజాదికాలు నిర్వహించడం ద్వారా క్రమంగా రూపం యొక్క తత్వాన్ని భావిస్తూ ప్రార్థన చేసి జ్ఞానాన్ని, మోక్షాన్ని పొందాలనే భావన భారతీయ జీవనంలో భాగమైంది.

చిన్న వయస్సులో మూర్తి రూపానికి పూజ చేసేవారు క్రమంగా స్తుతి చేయడం, తర్వాత ఒక భావానికి సంబంధించిన మంత్రాన్ని జపించడం, అదే వెలుగును నిరంతరం లోపలా, బయటా ధ్యానించడం ద్వారా ఆ వెలుగుగా తాను మారిపోవడం జరగాలి. దీనికి నాందిగా రూపం ఏర్పడాలి. దాని అనుబంధ వస్తువులన్నీ ఆ మూర్తి స్వరూపానుబంధాలే కావాలి. అవన్నీ పూజనీయ వస్తువులుగా ఉండాలి. ఇదే భారతీయమైన వైజ్ఞానిక వ్యవహారం. ఈ రూపంలో ఈ సంకేతాలను అధ్యయనం చేస్తే కలిగేది సంతృప్తి. పరమావధి ఆనందం.

# పద్యమనోహరం - 32

**గన్నమరాజు గిరిజామనోహర్ బాబు**

వరంగల్, ఫోన్ : 994 901 3448

**"అగసుత భావనాబల సమంచితమై, మృదు వాగ్విలాసమై,**
**నిగమ పికాంగనారావ వినిర్గత తాళ లయావధానమై,**
**సుగమముదాత్త భావనల శోభితమై, రసమండితమ్ముగన్**
**సొగసుల పద్యమై త్రిపురసుందరి మాకు ప్రసన్నమయ్యెడిన్"**

డా. రాళ్ళబండి కవితాప్రసాద్‌గారు తెలుగువారికి చిరపరిచితులైన అవధాన కవి. ఉత్తమ విద్యావేత్త. సామాజిక దృక్పథంతో కవితా వ్యవసాయం చేసి అపురూపమైన అక్షరాల పంట పండించిన అక్షర చైతన్యమూర్తి. అమ్మవారి కటాక్షాన్ని కాంక్షిస్తూ చెప్పిన 'కాదంబిని'లోని ఈ పద్యం తెలుగు పద్యపు తీపిదనాన్ని, తీరుతెన్నులను చాటిచెప్పిన విధానం కవులకు ఆచరణీయం, అభిలషణీయం.

'పద్యం' అమ్మవారి స్వరూపం. మూర్తీభవించిన అక్షరమ అమమ్మవారు. అందుకే ఆమెను పద్యమై ప్రసన్నం కావలెనని కోరడం ఈ పద్యంలో దర్శనమిస్తుంది. అమ్మవారి స్వరూపమైన పద్యంలో పార్వతీ మాత భావనాబలంతో ఒప్పుతూ మృదువైన వాగ్విలాస వైభవోపేతమై వేదకోకిల స్వరం వలెనే తాళ లయాన్వితమై, సరళమైన ఉదాత్తభావనలతో నిండి ప్రకాశించినదై, రసభరితమైన సొగసులతో కూడిన పద్యం వలె ఆ త్రిపురసుందరీ మాత మాకు ప్రసన్నం కావాలని కవి వాంఛించడం ఆయనలో పద్యంపట్ల ఉన్న పరమ పవిత్ర భావన ద్యోతకమవుతున్నది.

వరంగల్లులో పాతికేళ్ళక్రితం ప్రారంభమయిన సహృదయ సాహిత్య సాంస్కృతిక సంస్థ తొలిసారిగా ప్రచురించిన ప్రచురణల పరంపరలో భాగంగా మొదటిసారి వెలుగు చూసిన రచన 'కాదంబిని'.



ఒంగోలులో జరిగిన ఒక అవధాన సందర్భంగా డా. కవితాప్రసాద్ గారు ఆశువుగా చెప్పిన మూడు పద్యాలలో మకుటంగా భాసించిన వాక్యం 'త్రిపురసుందరి మాకు ప్రసన్నమయ్యెడిన్' అనేదాన్ని ఒక ప్రత్యేక రచనగానే వెలువరించాలన్న సంకల్పం 1990లో గ్రంథరూపంగా సాకారం పొందింది. అదే ఈ కాదంబిని కావ్యం.

ఈ కావ్యంలోని 108 పద్యాల్లో కవి త్రిపురసుందరీ మాతను 'పద్యమై', 'ధారయై', 'భావమై', 'విద్య'యై అంటూ ఈ విధంగా 108 భావాలలో ప్రార్థించాడు. అంటే ఈ సర్వసృష్టిలోని అన్నిభావాలు అమ్మవారి భావాలేనన్న ఒక విశాల దృక్పథం కనిపిస్తుంది. ఏ విషయాన్నైనా దైవీభావంతో చూసినప్పుడే ఒకానొక పవిత్రత ప్రకటితమవుతుంది. దానివల్ల మనకు సృష్టిపై గౌరవభావం అనుమడించి అన్నింటినీ సమదృష్టితో చూడగలం. దేనియందూ తూష్ణీభావమో, అల్పభావమో ఏర్పడే అవకాశం ఉండదు. సర్వసమదృష్టిని సాధించుకోగలిగే శక్తి సమకూరుతుంది. ఇదే సౌభ్రాతృత్వ భావనకు పునాదిగా నిలుస్తుంది. ఇంత విస్తృత భావ పరిధి ఈ పద్యాల కారణంగా ఏర్పడుతుంది. తద్వారా బుద్ధి వికసనం జరుగుతుంది. ఇదొక మహాభావన. మహా దేవీతత్త్వం.

ఈ పద్యం మరొక విశేషాన్ని అందిస్తుంది. కవిత్వరచన చేసే కవులు ముఖ్యంగా పద్యరచన చేసే కవులు పద్యరచనావైఖరిని గురించి తెలుసుకోవలసిన అంశాలు చాలానే ఉన్నాయి. ఏ పద్యమైనా అది దైవభావ సమన్వితమై ఉండాలి. అంటే పద్యం తప్పనిసరిగా పవిత్రమైన భావాలనే పాఠకునిలో కలిగించాలి. పద్యం చదవగానే పాఠకుని మనస్సు దుష్టభావ పరివృతం కారాదు. పద్యంలోని పదప్రయోగం సమర్థంగా ఉండాలి. అప్పుడే అది మృదుత్వాన్ని ఆపాదించుకుంటుంది. అంటే కవికి శబ్ద ప్రయోగ నైపుణ్యం ఉంటేనే అది సాధ్యమవుతుంది. అటువంటి పద్యాలే కలకాలం ప్రజల నాలుకల మీద నిలుస్తాయి. అప్పుడే ఆ రచనకు మృదు వాగ్విలాసం సాధ్యమవుతుంది. మరోమాట, కవి చెప్పే ఏ విషయమైనా వేద సంబంధమై ఉండాలి. అంటే జ్ఞాన సంబంధమై ఉండాలని సూచన. అప్పుడే అది కోకిలస్వరంలాగా ఆకర్షిస్తుంది. చదివిన వారి హృదయాన్ని స్పృశిస్తుంది. చెప్పిన ఏ విషయమైన రసభరితంగా ఉండే పద్ధతిలో చెప్పాలి. అటువంటి పద్యమే మాతృ స్వరూపమన్న ధ్వనిని ఈ పద్యంలో గమనించవచ్చు.

డా. కవితాప్రసాద్‌గారి కవితా వ్యవసాయమంతా యీ మార్గంలోనే సాగింది. అద్భుతమైన రీతిలో వారు సాగించిన అన్ని అవధానాల్లోనూ మనం ఈ దృక్పథాన్ని దర్శించవచ్చు. అందుకే ఆయన కవిత్వం చిరంజీవిగా స్థిరమై నిలుస్తుంది. తెలుగువారిని పులకింపజేస్తుంది.

# భారతీయాకరణ – 2

## ఆంగ్ల మూలం : బలరాజ్ మధోక్, అనువాదం : కోవెల సంపత్కుమార

బలరాజ్ మధోక్ దేశశాంతి సమైక్యతలను పరిరక్షించడానికి భారతీయ ప్రజల ఆలోచనలను భారతీయాకరించవలసిన అవసరాన్ని చెబుతూ ఇంగ్లీష్ లో వ్రాసిన Indianness కు అనువాదం ఈ భారతీయాకరణ. భారతీయాకరణ అంటే అన్ని రకాల దీపాసనా మార్గాలను స్థలాలను సమానంగా గౌరవించడం. ఒక వ్యక్తి తాను ఏ కుల, మత, భాషావర్గాలకు చెందినవాడైన వాటి ప్రయోజనాలన్నిటి కన్నా దేశ ప్రయోజనానికి అధిక ప్రాధాన్యం ఇవ్వడం ప్రధానమన్న అభిప్రాయాలు బలరాజ్ మధోక్ ఆలోచనల్లో కనిపిస్తాయి.

రాజకీయ వ్యవస్థలో జాతీయ భావన స్వరూపాన్ని, భారతీయాకరణ విషయంలో జరుగుతున్న చర్చలు, వ్రాసిన వ్యాసాలు, లేఖలు వాదోపవాదాలు ఈ గ్రంథ రచనకు బలరాజ్ మధోక్‌ను ప్రేరేపించాయి. భారతీయాకరణను గురించి ఒక జాతీయ భావన గల మేధావి ఆలోచనల ప్రతిబింబం భారతీయాకరణ. 1970లో వచ్చిన ఈ రచనను సంపత్కుమార తర్వాత కాలంలో సుమారు 80లకు ముందే అనువదించిందంటారు.

భారతదేశం భౌగోళిక స్వరూపం, జాతీయత – భారతీయత మధ్య గల తేడా, భారతీయాకరణ అంటే ఏమిటి? ఎందుకు? దానివల్ల ప్రయోజనమేమిటి? అది జరగవలసిన తీరు ఏమిటి? అన్న విషయాలను యథామూలంగా సంపత్కుమార అందించారు. అనువాదకుడిగానూ జాతీయభావనా చైతన్యం, దేశీయ ఆలోచనా విధానం వ్యక్తమయ్యే రచనను ఎన్నుకోవడం ఆయన దేశీయ నిబద్ధతను చెబుతుంది.





క్రమంగా భారతదేశంలోని మిగిలిన ప్రాంతాల్లో ఆర్యుల వ్యాప్తితోబాటు వారి సాంఘిక సంస్కృతీ రీతి దేశం మొత్తాన్ని గాఢంగా ప్రభావితం చేసింది. ఇంతేకాదు, దేశంలోని వివిధ ప్రాంతాల సాంఘిక సంస్కృతీ రీతులను సంలీనం చేసుకొనడం ద్వారా తాను గూడా సుసంపన్నమయింది. ఈ అభివ్యాప్తి సంలీనీకరణ ప్రక్రియ శతాబ్దాల తరబడి సాగిందని శ్రీమద్రామాయణం వల్ల సుస్పష్టమవుతున్నది. శ్రీరామచంద్రుడు తన 14 సంవత్సరాల వనవాస కాలంలో మహారాష్ట్రలోని పంచవటికి, ఇంకా ముందుకు– దక్షిణం కొస దాకా ప్రయాణించి నాడు. సుగ్రీవునితో శ్రీరామచంద్రుడు కుదుర్చుకున్న సంబంధం, శ్రీరామచంద్రుని విషయంలో ఆంజనేయుని ఆత్మార్పణ మొదలయిన అంశాలు, సుదూర దక్షిణం దాకా ఆర్యసంస్కృతీ వ్యాప్తి ప్రభావాన్నీ, మొత్తం దేశానికి ఏకసంస్కృతి రీతి రూపొందడాన్నీ సూచిస్తాయి. సప్త పవిత్ర నగర, సప్త పవిత్రనదీ, సప్త పవిత్ర గిరుల విషయంలో దేశమంతటా సమానంగా నెలకొన్న గౌరవ భావన ఈ సంస్కృతీ వ్యాప్తి – సంలీనీకరణకూ, సంస్కృతీ–సాంఘిక రంగాలలోని సమగ్ర భారత దృక్పథానికి చక్కని ఉదాహరణ. ఈ నగర, నదీ, గిరులు దేశంలో ఈ చివర నుంచి ఆ చివర దాకా నెలకొని ఉండటం, భారతీయ మనోవికాస ప్రారంభకాలం నుంచీ ఈ దేశపు భౌగోళిక– సాంస్కృతిక ఏకత్వానికి స్పష్టమయిన గుర్తింపు ఉన్నదన్న సత్యాన్ని స్పష్టీకరిస్తుంది. మొత్తం సంస్కృత సాహిత్యంలో ఎక్కడ చూసినా గూడా "ఆర్య" పదం శ్రేష్టార్థంలోనే ఉపయోగపడింది తప్ప, ఏదో ఒక జాతికి సంబంధించినట్లుగా ఉపయోగపడలేదు. సమాజంలోని వేర్వేరు తెగలలో లేదా వర్గాలలో పరస్పరం ఏ విధమయిన అపోహలు కలుగకుండా, అందరూ ఒక్కటే అనే అభిన్న భావననూ, ఏకత్వాన్నీ కలిగించడానికి బుద్ధిపూర్వకంగానే ఇట్లా ప్రయోగించబడి ఉంటుంది.

కాలక్రమంగా భారతదేశానికి విదేశాలతో, వాటి సంస్కృతీ సంప్రదాయాలతో సంపర్కం మొదలయింది. పర్షియన్లు, గ్రీకులు, స్కిథియన్లు, కుషాణులు, హూణులు మొదలయినవారు ఈ దేశానికి క్రీ.పూ. 5వ శతాబ్దం నుంచి, క్రీ.శ. 5వ శతాబ్దం దాక ఆక్రమణ దారులుగా వచ్చినారు. వారి ప్రభావం ఎంతోకొంత భారతీయ జీవనం మీదా, సంస్కృతి మీదా పడకపోలేదు. విజ్ఞానం అనేది ఎక్కడున్నాసరే, స్వీకరించే ఉదార స్వభావం గలది భారతీయబుద్ధి. దేశాన్ని ఆక్రమించడానికి వచ్చిన గ్రీకులను తత్కాలీన భారతీయ పండిత సమాజం అనాగరికులుగా చిత్రించి కూడా, ఖగోళశాస్త్రంలో గ్రీకులు సాధించిన విజయాలకు ముగ్ధమై వారిని పొగిడింది. కొన్ని గ్రీకుల ఖగోళ సిద్ధాంతాలను సగౌరవంగా స్వీకరించి కృతజ్ఞతా పూర్వకంగా భారతీయ ఖగోళశాస్త్రం గ్రంథాలలో ఉదాహరించింది.

ఈ విదేశీ శక్తులు యుద్ధరంగాలలో కొన్ని విజయాలు సాధించడం వాస్తవమే. కానీ విదేశసేనల ఆర్భాటాలను సాగనిస్తూనే, భారతదేశం తన ఊహల్లో తానే మునిగిపోయింది అనడం తప్పు. పండిత జవహర్ లాల్ నెహ్రూ తన గ్రంథం "డిస్కవరీ ఆఫ్ ఇండియా"లో చెప్పినట్లు భారతదేశం విదేశీయ శక్తులను ఎదుర్కొన్నది.

కొన్ని సందర్భాలలో సఫలమయింది, మరికొన్ని సందర్భాలలో కాలేదు. సఫలం కానప్పటికీ మళ్లీ రాబోయే దాడులను ఎదుర్కొన దానికి సిద్ధంగానే నిలబడింది. ఈ విషయంలో భారతీయ విధానం ద్వివిధంగా ఉన్నది. ఎదిరించి, యుద్ధంచేసి విదేశీయులను తరిమికొట్టడం ఒక విధానం కాగా, పారద్రోలడానికి వీలు లేని వారిని తనలో విలీనం చేసుకోవడం రెండవ విధానం.

ఒకరి తరువాత ఒకరుగా 8వ శతాబ్దం నుంచి 16వ శతాబ్దందాకా ఈ దేశానికి ఆక్రమణదారులుగా వచ్చిన అరబ్బులు, తురుష్కులు, మొగలుల విషయంలోనూ భారతదేశం ఈ వైఖరినే ప్రదర్శించింది. పండిత నెహ్రూ మాటలలోనే చెప్పవలెనంటే- "ఇది ఎడతెగకుండా సాగి వచ్చిన సంఘర్షణ. ఒకవైపు పోరాటాలు సాగుతూనే ఉన్నాయి. మరోవైపు అంతర్లీనీకరణ, భారతీయీకరణ ప్రక్రియలు గూడా సాగుతున్నాయి. ఈ కారణంగా ఆక్రమణదారులు క్రమంగా మిగిలిన వారితో సమంగా భారతీయులు కాసాగినారు. విభిన్న తత్త్వాలను సమన్వయించి, వాటిని ఉమ్మడి జాతీయ భావనలో కరిగించి ఏకం చేయడమనే ప్రాచీన భారతీయధర్మానికి మహాప్రతినిధిగా అక్బర్ నిలిచినాడు. ఎందుకంటే, అక్బర్ తనను భారతదేశంతో ఏకీకరించుకొన్నాడు. ఆయన విదేశీయుడే అయినా గూడా, భారతదేశం అతనిని తనవాడుగానే భావించింది. ఆయన అనుసరించిన ఈ విధానాన్నీ, జాతీయాలోచనా రీతినీ పాటించినంత వరకే ఆయన వారసులు సామ్రాజ్యాన్ని నిలబెట్టుకోగలిగినారు. ఈ రీతిని విచ్ఛిన్నం చేసి, జాతీయాభ్యుదయ వేగాన్ని వ్యతిరేకించిన వారి చేతులలో ఆ సామ్రాజ్యం తునాతునుకలయిపోయింది. నూతనోద్యమాలు ఉదయించినయి. కొంత సంచిత దృష్టి ఉన్నా గూడా ఈ ఉద్యమాలు జాతీయభావ పునరుత్థానానికి ప్రాతినిధ్యం వహించినాయి. కాని స్థిరంగా ఆ జాతీయతా భావాన్ని నిలుపగలిగినంతగా శక్తిమంతం కాకున్నప్పటికీ, ఆ ఉద్యమాలు మొగలు సామ్రాజ్యాన్ని నాశనం చేయడంలో మాత్రం సమర్థమయినాయి.

ఈ ఆక్రమణదారులు భారతీయ సంస్కృతికి కొత్తగా ఏమీ ప్రదానం చేయలేకపోయినారు. కానీ నిజానికి భారతదేశ సంపర్కంవల్ల అరబ్బులు లాభపడినారు. అనేక సంస్కృత గ్రంథాలను అరబ్బీ భాషలోకి అనువదించుకుని పశ్చిమాసియా - యూరోపు ప్రాంతాలకు భారతీయ విజ్ఞానం వ్యాపించడానికి వాహకులయినారు. తురుష్కులకు గానీ, మొగలుల గానీ స్వయం సంస్కృతి అంటూ ఏమీ లేదు. వారు స్థిరనివాసం లేనివారు. కుషాణుల కాలంలో బౌద్ధమత ప్రభావితులయి, ఆ తరువాత ఇస్లాం మతానికి లొంగిపోయినారు. వారి సంస్కృతీ సంప్రదాయం అనేది ఏదైనా ఉన్నదంటే, అది భారతీయ బౌద్ధులు, అరబ్బులు, పర్షియన్ల మూలంగా కలిగింది మాత్రమే. వారు ఉపయోగించినది పర్షియన్ లిపి. .......లిపి కుటుంబం నుంచి విడివడిన ఈ లిపిని క్రీస్తు శకం 5వ శతాబ్దంలో భారతదేశ వాయువ్య ప్రాంతాన మొట్టమొదట పర్షియన్లు ప్రవేశ పెట్టినారు.

భారతదేశానికి ఇస్లాం మతాన్ని తెచ్చిన అరబ్బులు, తురుష్కులు, మొగలులు ఈ దేశంలో వ్యాపించి ఉన్న బహుదేవి, దేవోపాసనకు, విగ్రహారాధనకు బదులుగా ఏక దేవోపాసనా భావనను ప్రవేశపెట్టినారని తరచుగా చెప్పబడుతున్నది. కానీ, ఇట్లా అనడం భారతీయ ఈ ఆలోచనారీతి, సంస్కృతీ సాహిత్యాల విషయంలో వారి అజ్ఞానానికి స్పష్టమైన చిహ్నం. భారతదేశం ప్రపంచానికి ప్రసాదించిన కాన్కలలో ఏకదేవ భావన ఒకటి. ఈ భావన వైదికార్యులకు సమగ్రంగా ఉన్నదనే అంశం ఋగ్వేదంలోని "సఏకీ సద్విప్రా: బహు నామ వదన్తి" -భగవంతుడొక్కడే, విజ్ఞులు అతన్ని పలు పేర్లతో పిలుస్తూ ఉంటారు, అన్న మంత్రవాక్యం ద్వారా సుస్పష్టమవుతుంది.

అయితే వైదికమయిన ఈ ఏకదేవ భావనకూ, ఇస్లాంలోని దేవైక్య భావనకూ బోలెడంత భేదం ఉన్నది. భగవంతుడు ఒక్కడే అని ఇస్లాం అంటుంది. కానీ, అదే క్షణంలో మహమ్మదు అతని ప్రవక్త అనీ, ఖురాన్ అతని పవిత్ర గ్రంథమనీ, ఈ మహమ్మదు, ఖురానుల మీద విశ్వాసం కూడా అత్యవసరమనీ ప్రవచిస్తుంది. నిజానికి, కాలం గడిచినా కొద్దీ, భగవంతుని మీది విశ్వాసంకన్నా, మహమ్మదు-ఖురాన్‌ల మీది విశ్వాసానికే అత్యంత ప్రాధాన్యం వచ్చింది. ఇది భారతీయమయిన ఏక దేవభావనకు పూర్తిగా విరుద్ధం. ఎందుకంటే, ఈ భారతీయ భావన భగవంతుడిని ఏ ప్రత్యేక ప్రవక్తతోగానీ, కుమారునితోగానీ ముడివేయదు. భగవంతుడొక్కడే అతనిని ఏ రూపంలోనైనా స్మరించవచ్చు, ఆరాధించవచ్చు, ఏ పేరుతో నయినా పిలవవచ్చు, ఏ మార్గాన్ని అనుసరించయినా అతనిని చేరుకోవచ్చు. భగవంతుడే అందరికీ తల్లీ, తండ్రి. ఆ పరమాత్ముని అంశమే స్త్రీ,పుం భేదం లేకుండా జీవులందరిలోనూ ఉన్నది. ఈ భావన ప్రపంచం యొక్క ఆలోచన రీతికీ, తత్త్వశాస్త్రానికీ భారతదేశం ప్రధానం చేసిన మహోన్నత విషయం. అంతేకాదు "సర్వధర్మ సమభావ"మన్న భారతీయ ధర్మానికి మూలం. అన్ని ఉపాసనా మార్గాల మీద గౌరవమూ, సర్వమత భావ సహనమే "సర్వ ధర్మ సమభావం".

అందరికీ చెందిన భగవంతుడొక్కడే అన్నభావన సత్య- శివ- సుందర స్వరూపమయినది. భగవంతుడనేవాడు ఏదో ఒక వర్గానికో, ఎవరో ఒక ప్రవక్తకో, కుమారుడికో, ఏదో ఒక వాదాసహ సిద్ధాంతానికో కట్టుబడి ఉంటాడనుకొనడం, ఈ భారతీయ భావనకు

విరుద్ధం. భారతీయమయిన ఈ భావన వల్ల కలిగిన ఒక విలక్షణ దృక్పథం భారతీయమేధను విస్తృత పరచడానికీ, మానవీయ సమస్యలనన్నింటినీ సరిగా అవగాహన చేసుకోవడానికీ, ఇంతేకాకుండా, భారతీయ సంస్కృతి సుదీర్ఘకాలం నిలుకడగా సాగిరావడానికీ కారణమయింది. ఈ కారణంగానే, ఎవరో ఒక ప్రవక్త మీదనో, ఏదో ఒక గ్రంథం మీదనో, వాదాసహ సిద్ధాంతం మీదనో అనన్యతమ విశ్వాసం వ్యక్తికి ఉండటమే మతం అన్న అర్థంలో భారతీయ సాహిత్యం మొత్తంమీద ఎక్కడా కూడా, "మత" పదం ఉపయోగింపబడలేదు. ధర్మమన్న సంస్కృత పదానికి – పాశ్చాత్యులు అర్థం చేసుకొనడంలో పొరబడినట్లుగా – మతంతో ఏ విధమయిన సంబంధమూలేదు. ''ధర్మ'' పదం ''ధృ'' ధాతువు నుంచి నిష్పన్నమయింది. అవలంబం, లేక ధారణ అని దీని అర్థం. "ధారయతే ఇతి ధర్మః" – ధరింపబడేది ధర్మం – ధర్మమంటే మనుష్యుని సత్ప్రవర్తన, దానికి సంబంధించిన విధి నియమాలు, ఆ కారణంగా తన విధులను సరిగా నిర్వహించడం వల్ల కలిగిన హక్కులను ప్రతివాడూ సమంగా అనుభవించే విధంగా సమాజాన్ని ధర్మం ఏకీకరిస్తున్నది. అందువల్ల భారతీయ, లేక హైందవ దృష్టి ననుసరించి, ప్రతి మనుష్య వర్గానికీ నియతమయిన ధర్మం ఉన్నది. ధర్మం సత్యానుబద్ధమయినది. అధర్మం తద్విరుద్ధమయినది.

మనువు ధర్మ – సత్ప్రవర్తనా లక్షణాలు పది చెప్పినాడు.

| | | |
|---|---|---|
| 1. ధృతి | – | సృష్టి |
| 2. క్షమ | – | ఓర్పు |
| 3. దమము | – | క్రమశిక్షణ |
| 4. ఆస్తేయము | – | దొంగలించకుండుట |
| 5. శౌచము | – | త్రికరణశుద్ధి |
| 6. ఇంద్రియనిగ్రహము | – | వాంఛలను నియమించుట |
| 7. ధీ | – | బుద్ధి |
| 8. విద్య | – | జ్ఞానము |
| 9. తపస్సు | – | నిరాడంబర జీవనము |
| 10. సత్యము | – | యథార్థము |

ఇట్లా విపులంగా నిర్వచించబడిన ధర్మం సంకుచితంగానీ, ఏదో ఒక వర్గానికి మాత్రమే సంబంధించినది గానీ కాదు. భారతీయ భగవద్భావన వలె ఇది గూడా విశ్వజనీనమైనది. నూటికి నూరుపాళు లౌకికమయినది. ఇందులో మత విశ్వాసాలను గూర్చి ఒక్క మాట గూడా లేదు. ఈ ధర్మభావన మీదనే భారతీయ జీవన విధానం ఆధారపడి ఉన్నదని స్పష్టం. ఈ విధమయిన ధర్మాన్ని అనుసరిస్తూ, ఎవరికి వారు తమకిష్టమయిన ఉపాసన విధానాన్ని, భగవత్ప్రాప్తికి వివిధ మార్గాలనూ,మోక్షసిద్ధికి అభిమత రీతినీ అవలంబించవచ్చు. ఇవన్నీ వివిధ 'మార్గాలు'గా భావించబడినయి. ఈ విధంగా ధర్మం, మతం, మార్గం మొదలయిన వాటిలోని భేదాన్ని గూర్చి భారతీయ మహాపురుషులకూ, జ్ఞానులకూ స్పష్టమయిన పరిజ్ఞానం ఉన్నదనడానికి చరిత్ర అంతా సాక్ష్యమే. ఈ పరిజ్ఞానం సిక్కు మార్గ ప్రారంభకుడయిన గురు గోవింద సింహుని ఈ క్రింది మాటలలో స్పష్టమవుతుంది–

**"సకల జగత్ మే ఖాసలా పంథ్ జాగే,**
**జాగే ధర్మ హిందూ సకల భండ్ భాజే "**

సిక్కు ఉపాసనా మార్గం ప్రపంచంలో విజయవంతమగు గాక, హిందూధర్మం వ్యాపించు గాక– మన మాజీ రాష్ట్రపతి, రాజనీతిజ్ఞుడు, వేదాంతి అయిన డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ పండితుడు గూడా ఇదే అంశాన్ని తమ "హిందూ వ్యూ ఆఫ్ లైఫ్" హిందూ జీవన దృష్టి– అన్న గ్రంథంలో ఇంకా వివరంగా స్పష్టీకరించినారు. ఆయన దృష్ట్యా "హిందుత్వం" ఒక మతం కాదు, కాగా అన్ని మతాల ఉమ్మడి సొత్తు. ఇది ఒక ఆలోచనా రీతికన్నా మించి, ఒక జీవన విధానం. ఆస్తికుడయినా సరే, నాస్తికుడయినాసరే, అవిశ్వాసి అయినాసరే, హైందవ సంస్కృతినీ జీవన విధానాన్నీ, అనుసరించే ప్రతివాడూ హిందువే. మతానుబద్ధతకు హిందుత్వం ప్రాధాన్యమీయదు. జీవితంలో ఆధ్యాత్మిక, నైతిక దృక్పథానికి మాత్రమే ప్రాధాన్యమిస్తుంది. హిందుత్వం అనేది ఒక తెగ కాదు. సత్ వృత్తి సూత్రాలను నమ్మేవారి, సత్యాన్వేషణ చేసేవారి సహప్రవృత్తి.

ఈ విధమయిన హిందుత్వ స్వరూపాన్ని గమనిస్తే, ఈ దేశంలో వివిధ మార్గాలూ, తెగలూ మొదలయినవి నెలకొని ఉండడానికి కారణం అర్థమవుతుంది. బౌద్ధం, జైనం, శైవం, వైష్ణవం మొదలయిన మార్గాలు ప్రాచీన కాలం నుంచీ ఈ దేశంలో ప్రసిద్ధంగా ఉన్నాయి. ఇటీవల సిక్కు, బ్రహ్మ (సమాజ), రాధాస్వామి మార్గాలు ఏర్పడి వృద్ధి పొందినయి. పారసీల జోరాష్ట్రియనిజం, క్రైస్తవం, ఇస్లాం అనేవి కూడా ఈ అసంఖ్యాక మార్గాల్లో చేరి సహజీవనం చేస్తున్నాయి. సత్ప్రవర్తనకు దోహదం చేసే పక్షంలో వీటిలో దేనిని గూడా వ్యతిరేకించవలసిన అవసరం ఏమీ లేదు. ఇవ్వన్నా హైందవ లేక భారతీయ ధర్మంలో అంతర్లీనమై ఉండవచ్చు. ఈ ధర్మభావన భారతీయ ఆలోచనా సంస్కృతులకు మూలమూ, విశిష్టమూ అయిన లక్షణం.

భారతీయ సంస్కృతిలోని మరొక ప్రత్యేక లక్షణం జీవితాన్ని గూర్చి సమగ్ర భావన, భారతీయ తత్త్వవేత్తలూ, ఆచార్యులూ, మానవ జీవితానికి ప్రేరకోద్దేశ్యాలుగా ధర్మ (సత్ ప్రవర్తన), అర్థ (ఆర్థికాభ్యున్నతి), కామ (ఐహిక సుఖం), మోక్ష (ముక్తి)ములనే చతుర్విధ పురుషార్థాలను నిర్దేశించినారు. మానవుని శారీరక, మానసిక సమగ్ర వికాసానికి ఇవి చాలా అవసరమయినవి. అది ఈ ప్రపంచాన్ని ఒక మాయ అని త్రోసి వేయనూలేదు. అట్లాగే భౌతిక సుఖమే జీవిత పరమార్థంగా భావించనూ లేదు.

రాజకీయ రంగంలో భారతీయ సంస్కృతి రామరాజ్య భావనలో ప్రతిఫలించింది. రాజు లేదా పాలకుడు తన ఇష్టానిష్టాలనూ, అభిరుచులనూ అధిగమించి ప్రజాప్రయోజనాలకు అధిక ప్రాధాన్యమీయడమే "రామరాజ్య" భావన. భారతీయమయిన ఈ "రాజ" అన్న పదం "రంజ్" ధాతువు నుంచి నిష్పన్నమయింది. "రంజతే ఇతి రాజా" ప్రజారంజకంగా, ప్రజాహితాన్ని కాపాడేవాడు రాజు. ఈ రాజుత్వంలో "సాంఘిక సమయ సిద్ధాంతం" The social contract theory of the state కూడా ఇమిడి ఉన్నది. పరిపాలన విషయంలో రాజుకు నిరంకుశాధికారాన్ని ఏ భారతీయ ధర్మశాస్త్రమూ అంగీకరించదు. రాజు తన విధులను సరిగా నిర్వహించినంతవరకే అతనికి అధికారం ఉంటుంది. లేకుంటే పోతుంది. ప్రజలను సంరక్షిస్తానని పూచీపడి అట్లా చేయని రాజును ఒక పిచ్చికుక్కగా చూడవలసింది అంటూ మహాభారతం ఈ అంశాన్ని స్పష్టం చేసింది. "సంక్షేమ రాజ్య"– welfare state – భావన గూడా ఈ రాజత్వంలో ఇమిడి ఉన్నది. ఏ అనాథుడు కూడా ఆకలితో అలమటించకుండా, ఏ కొరత లేకుండా రాజు చూడవలసి ఉంటుంది. వృద్ధుల్ని కాపాడుతూ, రోగులకు ఉచిత చికిత్సను సదుపాయాలనూ కలిగించవలసి ఉంటుంది అని మహాభారతం స్పష్టీకరిస్తుంది.

ధర్మ రాజ్యభావన గూడా భారతీయ సంస్కృతీ సంప్రదాయంలో ఒక అంతర్భాగమే. ధర్మపాలనపై గల గౌరవాన్ని స్పష్టంచేసే ఘట్టాలు భారతీయ గ్రంథాలలో అసంఖ్యాకంగా ఉన్నాయి. మహాభారతంలోని భీష్మ ప్రతిజ్ఞకు మించిన ఉదాత్తోదాహరణ ఈ అంశంలో మరొకటి ఉండదేమో! భీష్ముని తండ్రి బెస్తరాజు కూతురును వివాహమాడ దలచుకున్నాడు. అయితే తన కూతురు సంతానానికే సింహాసనం దక్కవలెననీ అప్పుడే తానీ పెండ్లికి ఒప్పుకోగలననీ బెస్తరాజు అన్నాడు. దానికి రాజు అంగీకరించలేదు. ఎందుకంటే సింహాసనం మీద హక్కు రాజు పెద్ద కుమారుడిదే అన్న ఈ దేశపు ధర్మాన్ని అతడు అతిక్రమించలేదు. ఈ సందర్భంలో తండ్రి మనోమథనను గుర్తించిన భీష్ముడు స్వచ్ఛందంగా తన హక్కును వదులుకొంటానని ముందుకు వచ్చినాడు. కానీ భీష్ముడు ఈ హక్కును వదులుకున్న గూడా, ధర్మం ప్రకారం ఆయన సంతానానికి ఆ హక్కు సంక్రమిస్తుంది. అందుకని భీష్ముని ఈ నిర్ణయం బెస్తరాజుకు తృప్తి కలిగించలేదు. అప్పుడు ఈ అభ్యంతరాన్ని అధిగమించడానికి తాను వివాహమే చేసుకోనని భీష్ముడు ప్రతిజ్ఞ చేసినాడు. దీనివల్ల రాజు కూతురు సంతానానికి సింహాసనం మీద స్థిరమైన హక్కును కాదనేందుకు భీష్ముని సంతానమే ఉండదు. ఇంత ఇదిగా ధర్మపాలన యెడ గౌరవాన్ని ప్రదర్శించే అద్వితీయ ఘట్టం ప్రపంచ చరిత్రలోనే మరెక్కడా కనిపించదు.

కవిత్వ, నాటక, సంగీత, నృత్య, చిత్రలేఖన శిల్పాది లలితకళల లోనూ, గణిత, రసాయనిక, భౌతిక, ఖగోళ, వైద్య, ధర్మాది శాస్త్రాల లోనూ భారతీయ మేధ ఎంతటి అభివృద్ధినీ, విజయాలనూ సాధించిందో, అదంతా జగత్ ప్రసిద్ధమే. ఈ విధంగా అనేక రంగాల్లో విజయకేతనాలయిన రామ, కృష్ణ, బుద్ధ, మహావీర, వ్యాస, వాల్మీకి, ఆర్యభట్టు, కాళిదాసాది మహానుభావులందరూ భారతీయ సంస్కృతి సంప్రదాయాలలో అవిభాజ్యాంశాలయిపోయినారు.

భారతీయ కళాత్మక బౌద్ధిక విజయాలతో బాటు ఇక్ష్వాకు భరత భీమ, అర్జున, చంద్రగుప్తమౌర్య, సముద్ర గుప్తాది మహారాజులూ, వీరులూ, మను, చాణక్యాది ధర్మశాస్త్ర ప్రణేతలూ, పాలనా ధుర్వహులూ ఇంకా అసంఖ్యాకులు భారతీయ సమగ్ర జీవిత వ్యాప్తమయిన వివిధ రంగాలను తాము సాధించిన విజయాలతో మహోజ్జ్వలంగా, వైభవోపేతంగా ప్రకాశింపజేసినారు. ఆలోచనా విధానంలో, తాత్త్విక దృక్పథంలో, కళా సాహిత్య రంగాలలో, జీవన మూల్యాల విషయంలో సాధింపబడిన ఈ మహోన్నత సాఫల్యాలన్నీ కలిసి భారతదేశాన్ని యుగాల తరబడి నిలబెట్టినయి. ఇవే భారతదేశానికీ దాని ప్రజలకూ ప్రపంచంలో స్పష్టమైన ఒక విలక్షణ తను ఆపాదించినయి. ఇవే ఈ దేశ సంస్కృతికి ఆత్మభూతమయినయి.

(సశేషం)

---

## సుభాషితమ్

**విశ్వా మాత్రా హి పశుషు కర్దమేషు జలేషుచ**
**అంధే తమసి వార్ధక్యే దండం దశగుణం భవేత్**

పక్షులు, కుక్కలు, శత్రువులు, పాములు, పశువులు... వీటిని అదుపు చేయడానికి వరుసగా, బురదలో, నీటిలో, చీకటిలో, గ్రుడ్డితనంలో, ముసలితనంలో సాయంగే ఉండేది చేతి కర్ర. అందువల్ల దండానికి (కర్రకి) దశగుణాలు ఉన్నాయి.

## సుభాషితమ్

**నాస్తి వేదాత్ పరం శాస్త్రం నాస్తి మాతుః పరో గురుః**
**నాస్తి దానాత్ పరం మిత్రం ఇహలోకే పరత్ర చ**

ఈ లోకమునందైనా, పరలోకమునందైనా వేదము కంటే మించిన శాస్త్రము మరొకటి లేదు.. తల్లికంటే మించిన గురువు మరొకడు లేదు. దానమును మించిన మిత్రుడు మరొకడు లేదు..

ISSN 2457-0796
UGC Care List Approved Journal
మూసీ మాసపత్రిక సంపుటి -25 : సంచిక - 9  హైదరాబాద్ జూలై : 2022

అవగాహన
2

# తిరుమలలో దైవం వేంకటేశ్వరుడు కాదా!

రోచిష్మాన్, ఫోన్ : 9444012279

తిరుమల గురించి కొన్ని విషయాలు ప్రచారంలోకి వచ్చాయి. అక్కడ దైవం వేంకటేశ్వరుడు కాదు. అక్కడ ఉన్నది అమ్మవారు. అక్కడ ఉన్నది సుబ్రహ్మణ్యస్వామి. 9వ శతాబ్ది వరకూ అది బౌద్ధాలయం. తరువాతి కాలంలో దాన్ని వేంకటేశ్వరుడి ఆలయంగా మర్చేశారు. ఇలాంటివి వింటూ ఉంటాం. తిరుమల బౌద్ధక్షేత్రం అని పెద్ద ఎత్తున ప్రచారం చేసేందుకు పుస్తకాలు కూడా వచ్చాయి. ఒక విషయంపై ఏదో అనుకోవడమూ, అసత్యాల్ని ప్రచారం చెయ్యడం పెనుదోషం. తిరుమల విషమై తెలివిడిలోకి వెళదాం రండి.

బ్రహ్మాండ, వరాహ పురాణాల్లో వేంకట అనే శబ్దంపై కొన్ని వివరణలున్నాయి. వామన, గరుడ పురానాల్లో వేంకటాచల క్షేత్ర ప్రస్తావన ఉంది. వేంకట శబ్దానికి కూడా వివిధార్థాలు చెప్పబడ్డాయి. 'వికటే' అనేదే 'వేంకట' పదానికి పూర్వ రూపమనీ, 'వేం' అంటే పాపం 'కటతి' అంటే కాల్చేది అని చెప్పబడింది. వీటిని ప్రక్షిప్తాలుగా పరిగణించినా పురాతనమైన తమిళ కావ్యాల్లో వేంకటాద్రి ప్రస్తావన ఉంది. 2వ శతాబ్దికి చెందిన 'సంగ కాల' కవి కల్లాడనర్ రాసిన అగనానూర్ కావ్యంలో 83వ పద్యంలో 'తిరువేంగడమలై కళియినుమ్ కల్లా ఇళయర్ పెరుమగన్ పుల్లి వియందలై నన్ నాట్టు వేంగడం (శ్రీ వేంకటగిరిపైన ఆటవిక తెగ యువరాజు విహరించిన విశాలమైన మంచి ప్రదేశంలోని వేంకటం) అని ఉంది. ఇక్కడ శ్రీ వేంకటగిరి ప్రసక్తి, వేంకటం ప్రసక్తి కనిపిస్తున్నాయి. ఆ కావ్యంలో మరికొన్ని చోట్ల కూడా వేంకట శబ్దం చెప్పబడ్డది. అంతేకాదు ఆ రచనలో "ఏళీర్‌కున్టం" అంటే ఏడుకొండలు అన్న ప్రస్తావన కూడా ఉంది. ఈ సంగకాల సాహిత్యం అన్నది కొందరు రచయిత రచనల సంకలనం. సంగకాల సాహిత్యం 2వ శతాబ్ది కన్నా పాతది అంటున్న పరిశీలనలు కూడా ఉన్నాయి. ఈ తమిళ సంగ సాహిత్యంలో మరికొందరు కవులు కూడా వేంగడం (వేంకటం) గురించి ప్రస్తావించారు. "ఉత్తర వేంకటం నుంచి దక్షిణ కన్యాకుమారి మధ్యనున్నది తమిల్ పలికే మంచి లోకం (వడ వేంగడం తెన్ కుమరి/ ఆయిడై తమిళ్ కూఱునల్ ఉలగం) అనే లోకోక్తి చాలా పాతనాళ్లలోనే తమిళంలో ఉన్నది.

3వ శతాబ్దిలో ఇళంగో కవి రాసిన తమిళ కావ్యం 'సిలప్పదిగారం'లో వేంకటేశ్వరుని వర్ణన ఉంది. ఈ రచనలో "తిరువరంగత్తిల్ కిడంద తిరుక్కోలముమ్, వేంగడత్తిల్ నిన్ర తిరుక్కోలముమ్" అని ఉంది. అంటే శ్రీరంగంలో (తిరువరంగత్తిల్) పడుకుని ఉన్న పవిత్ర రూపమూ, వేంకటంలో (వేంగడత్తిల్) నుంచి ఉన్న పవిత్ర రూపమూ అని అర్థం. ఈ రచనలో నుంచి ఉన్న ఈ



రూపంపై వర్ణన పునరావృతం అయింది. పురాణాల్ని మినహాయిస్తే వేంకటమూ, వేంకటేశు గురించి 2,3 శతాబ్దులకు లేదా అంతకు పూర్వకాలానికి చెందిన తమిళ కావ్యాలలో ప్రస్తావన ఉంది. అటు తరువాత 3-8 శతాబ్దులకు చెందిన ఆళ్వారుల కాలానికి వేంకటేశుడు వేంకటాద్రితో సహా ప్రసిద్ధమైనాడు. ఆళ్వారులు వందల పాశురాల్లో వేంకటేశుని కీర్తించారు. ఈ ఆళ్వారుల్లో తొలి తరానికి చెందిన పేయ్ ఆళ్వార్ తిరుమలై అనే పదాన్ని వాడారు. తిరుమలై లేదా తిరుమల, తిరుపతి అన్నవి తమిళ పదాలు. తిరు అంటే ఉన్నతమైన, మేలిమి, పవిత్రమైన, శ్రీ అనే అర్థాలు. తిరుమలై అంటే శ్రీపర్వతం లేదా పవిత్రమైన పర్వతం. ఉన్నతమైన పర్వతం లేదా మేలికొండ అనీ, తిరుపతి అంటే శ్రీపతి లేదా పవిత్రమైన, ఉన్నతమైన నాథుడు అనీ అర్థాలు.

ఇక్కడ ఉటంకించిన వాటి ద్వారా కొందరు ప్రచారం చేస్తున్నట్లుగా 9వ శతాబ్ది వరకూ బౌద్ధ క్షేత్రంగా ఉండి ఆ తరువాత అది వేంకటేశం అవలేదని తెలియవస్తోంది. అది అమ్మవారి ఆలయమో, సుబ్రహ్మణ్య ఆలయమో కాదు అని కూడా తెలుస్తోంది. అన్నమయ్య "తిరు వేంకటేశుడు" అనే పాడారు కదా? అది అమ్మవారో లేదా సుబ్రహ్మణ్య స్వామో అయితే అన్నమయ్యవంటి కవికి, భక్తునికి, జ్ఞానికి ఆ విషయం తెలియకుండా ఉంటుందా? అన్నమయ్య కాలానికి తిరుమల దైవం వేంకటేశుడే అని ప్రజలకు బాగా తెలుసు అని మనం గ్రహించాలి. నిజం కానిది, ప్రజల్లో లేనిది అయిన తిరుమల బౌద్ధక్షేత్రం అనే వక్రతను ఇటీవల కొందరు తీసుకువచ్చారని స్పష్టంగా అర్థమౌతోంది.

ISSN 2457-0796
UGC Care List Approved Journal
మూసీ మాసపత్రిక సంపుటి -25 : సంచిక - 9 (28) హైదరాబాద్ జులై : 2022



వెంకట్ అనీ, వెంకటేశ్ అనీ మనకు అలవాటయింది. అది అప్పు. అది వేంకటం. వెంకటం కాదు. వేంకట్ అనో, వేంకటేశ్ అనో అనడమే సరైనది. ఈ వేంకటేశ అనే పేరు వేదాంత దేశికుల పేరు. వారే ఈ పేరుకు తొలి వ్యక్తి కావచ్చు. 7-5-1820 నుండి 10-5-1820 వరకు తిరుమల ఆలయం మూసి వెయ్యబడింది. అంతకుముందు ఆలయం పూర్తిగా వడగలై లేదా దేశిక సంప్రదాయంలో ఉండేది. ఆ మూడునాళ్ల తరువాత వడగలై, తన్గలై సంప్రదాయాల వాళ్లకు ఆమోదయోగ్యంగా ఉండే విధానాల్లోకి మారింది. ఆ సమయంలోనే వేంకటేశ్వరుడి నామం వడగలై, తన్గలై పద్ధతుల్లో కాకుండా ψ గా మారింది. కానీ ధ్వజస్తంభం, రథం, ఏనుగు, గరుడవాహనం వంటి వాటిపై నామాలు మారకుండా నేటికీ వడగలై పద్ధతిలోనే ఉన్నాయి. మొదట్లో తిరుమల ఆయలం పాంచరాత్ర ఆగమ విధానంలో ఉండేది. పాంచరాత్ర ఆలయాల్లో ముందు ధ్వజస్తంభం, తరువాత బలిపీఠం ఉంటాయి. తిరుమలలో మనకు ఈ విధానమే కనిపిస్తుంది. పాంచరాత్ర ఆలయాలు కొండలపైనా, నదీతీరాల్లోను ఉంటాయి. వైఖానస ఆగమ ఆలయాలు ఊరిలోపల ఉంటాయి. విజయనగర రాజు అచ్యుత దేవరాయల కాలంలో తిరుమల ఆలయం పాంచరాత్ర ఆగమం నుండి వైఖానస ఆగమంలోకి మారింది. అచ్యుతరాయలు వ్యక్తిగత కారణాలతో ఈ మార్పుకు కారణమయ్యాడు. మధ్యలో కొంతకాలం తిరుమల ఆలయం వ్యాసరాయర్ పర్యవేక్షణలో మాధ్వ సంప్రదాయంలోనూ ఉండేది. ఇవాళ ప్రధాన గోపురంలో మనం చూస్తున్న విమాన గోపురంలో మనం చూస్తున్న విమాన వేంకటేశ్వరుడు ఈ వ్యాసరాయర్ ఏర్పరిచినదే.

తిరుమలకు ఇంతటి ప్రశస్తి రావడానికి తొలి కారణం రామానుజులు. రామానుజులు జన్మత: వైష్ణవులు కాదు! వారు స్మార్తులు లేదా వైదికులు. జన్మత: స్మార్తులైన రామానుజులు వైష్ణవ సంప్రదాయ పంచ సంస్కార దీక్షను తీసుకుని వైష్ణవులయ్యారు. ఆళ్వారుల కాలం నుండే ఈ వైష్ణవం ఉన్నట్టుగా మనం తీసుకోవచ్చు. రామానుజుల గురువు పెరియనంబి, వైష్ణవ గురు పరంపర ముక్కాల్ నంబి, ఆళవందార్ వంటి వారి మీదుగా శ్రీమత్ నాదమునిగళ్ వరకూ వెళుతుంది. ఈ నాదమునిగళ్‌ను ఈనాడున్న వైష్ణవానికి ఆదిగా తీసుకోవచ్చు. రామానుజుల తరువాత ఈనాటి వైష్ణవ సంప్రదాయానికి ఊపు వచ్చింది. రామానుజుల తరువాత వైష్ణవంలో వేదాంత దేశికులు ఉన్నతమైన గురువు. అటు తరువాత మనవాళమామునిగళ్ కాలంలో వడగలై అంటే దేశిక సంప్రదాయమూ, తెన్గలై సంప్రదాయమూ ఏర్పడ్డాయి. బెంగాల్‌లో 15వ శతాబ్దంలో చైతన్య ఏర్పరిచిన గౌడీయ వైష్ణవం, వల్లభాచార్యుల రుద్ర సంప్రదాయం, కర్ణాటక ఉడిపిలో 13వ శతాబ్దిలో మధ్వాచార్యుల మధ్వ సంప్రదాయం, నింబారకుల నింబారక సంప్రదాయం వంటివి వైష్ణవంలో ఉన్నాయి. రామానుజులకు ముందు, రామానుజలకు తరువాత అని వైష్ణవాన్ని పరిగణించాల్సి ఉంటుంది. రామానుజులు తిరుమలలో పూజావిధానాలు, సేవలు, పద్ధతులలో పెను మార్పులు తీసుకువచ్చారు.

వడగలై, తెన్గలై సంప్రదాయాల్లో నుదుటిపై పెట్టుకునే నామాలలో తేడాలున్నాయి. వడగలై నామం U . ఈ ψ కి కింద చిన్న గీత పెడితే తెన్గలై నామం అవుతుంది. మాధవా, కేశవా అంటూ నామాలు చెప్పుకుంటూ గీతలు గీసుకోవడం వల్ల ఈ ముద్రలు నామాలు అని అనడం వచ్చింది. ఇవాళున్న ఈ వైష్ణవ నామాలు రామానుజుల కాలంలో లేవు. రామానుజులు ఈ నామాల్ని పెట్టుకుని ఉండరు. ఆయన శ్రీచందనంతో ఊర్ధ్వపుండ్రాన్ని పెట్టుకొని ఉంటారు. వడగలై నామం వేదాంత దేశికర్‌తోనూ, తెన్గలై నామం మనవాళ మామునిగళ్‌తోనూ మొదలై ఉంటాయి. కర్ణాటక, ఉత్తరాది వైష్ణవ సంప్రదాయంలో శ్రీచందనంతో ఊర్ధ్వపుండ్రమే ఉంటుంది. ఇస్కాన్‌వాళ్లు కూడా ఈ నామాన్నే తీసుకున్నారు. ఇవాళ రామానుజుల విగ్రహానికి తెన్గలై నామం కనిపిస్తోంది. అది సరికాదు.

సరైన విషయాల్ని తెలుసుకొని తిరుమలపై ఇకనైనా సరైన అవగాహనకు రావాల్సిన అవసరం ఉంది. తిరుమల వేంకటమే. అక్కడున్నది వేంకటేశ్వరుడే.



# ఎరుకల భాషకు పాణిని సూత్ర అనుసరణ

**డా. వి.ఎం. సుబ్రహ్మణ్య శర్మ,** అసిస్టెంట్ ప్రొఫెసర్, డిపార్ట్‌మెంట్ ఆఫ్ లింగ్విస్టిక్స్, యూనివర్సిటీ ఆఫ్ ఢిల్లీ,
ఫోన్ : 098667 07774

**పత్ర సారాంశం**

ప్రపంచంలో అతి ప్రాచీనకాలంలోనే మానవ భాషల స్వరూప స్వభావాలను అధ్యయనం చేసిన సంప్రదాయం మన భారతీయ వ్యాకరణ సంప్రదాయం. ఆ సనాతన సంప్రదాయానికి పాణిని, పతంజలి, కాత్యాయనుడు, భర్తృహరి లాంటి వారు నాలుగు స్తంభాలు. మన భారతీయ భాషా వైజ్ఞానిక దృక్పథం కేవలం సంస్కృతానికే పరిమితమైంది కాదు. దానిలో చాలా విషయాలు సార్వత్రికాలు (universals) అని నా అభిప్రాయం. సార్వత్రికాలు అంటే పాణినీయంలో చెప్పిన చాలా విషయాలు అన్ని భాషలకు కూడా వర్తిస్తాయి అని అర్థం.

ఈ దృక్పథంతోనే ప్రస్తుత పత్రంలో పాణిని సూత్రాన్ని గిరిజన భాషైన, 'ఎరుకల' భాషకు అనువర్తించి, ఎరుకల భాషా విశేషాలను పాణినీయ దృష్టిలో విశ్లేషించడమే ఈ పత్ర ముఖ్య ఉద్దేశం.

**ఎరుకల భాష – ఉపోద్ఘాతం**

భారతదేశంలో ముఖ్యంగా నాలుగు భాషా కుటుంబాలు ఉన్నాయి. అవి. 1. ద్రావిడ భాషా కుటుంబం. 2. ఇండో–ఆర్యన్ భాషా కుటుంబం 3. ఆస్ట్రో ఏసియాటిక్ భాషా కుటుంబం 4. టిబెటో – బర్మన్ భాషా కుటుంబం. కొంతమంది భాషా శాస్త్రవేత్తల ప్రకారం అండమానీస్ భాషా కుటుంబం ఐదవది.

ఎరుకల భాష ద్రావిడ భాషా కుటుంబానికి చెందినది. ద్రవిడియన్ ఎటిమలాజికల్ డిక్షనరీలో తెలుగుపదంగా 'ఎఱుక' కన్పిస్తుంది. 'అఱై' అనే తమిళపదం దీనికి మూలరూపం. 'ఎఱుక' అనే పదానికి to know, understand, percieve, ascertain అనేవి క్రియాపరమైన అర్థాలు. 'ఎఱుక' కు నామవాచకంగా knowledge (జ్ఞానం) అని అర్థం. ఎఱుక – తెలివికి, జ్ఞానానికి అవగాహనకు సంబంధించిన క్రియాపదం. అది కలిగిన వారిని ఎఱుకకల వారని, ఇక్కడ రెండు 'క' కారాలలో ఒకటి లోపించి 'ఎఱుకల' వారుగా పిలుస్తున్నారు.

జ్ఞానం కలవారు అనే అర్థంలో భవిష్యత్తు చెప్పేవారు, సోది చెప్పేవారు అనడంలో తమకున్న తెలివితేటలను వాస్తవిక జీవితంలో వారు ఎలా ఉపయోగించుకుంటున్నారో తెలుస్తుంది. ఎఱుకకు ఉన్న ఇతర పర్యాయపదాలు వారి త్రిప్పుట జీవన విధానాన్ని కూడా సూచిస్తాయి. కొరవ, కొఱచ, కుఱ్రులాంటి పదాలు ఎరుకలకు పర్యాయపదాలే. ప్రస్తుత పత్రంలో తెలంగాణ ప్రాంతంలో నివసిస్తున్న ఎరుకల భాషను వరంగల్ జిల్లాలో నివసిస్తున్న ఎరుకల వారి దగ్గర సేకరించినది. సేకరించిన సమాచారాన్ని పాణిని సూత్రమైన 'కుత్సితే (5–3–74)' లో పతంజలి చర్చించిన 'పంచకం ప్రాతిపదికార్థః' అనే విషయాన్ని ఎరుకల భాషకు అనుసరింపచేస్తాను.

**పంచకం ప్రాతిపదికార్థ**

భారతీయ వ్యాకర్తల దృష్ట్యా ఒక నామ వాచకం ఐదు అర్థాలను సూచిస్తుంది (పంచకం ప్రాతిపదికార్థః)

అవి : 1. జాతి, 2. వ్యక్తి, 3. లింగం, 4. సంఖ్య, 5. కారకమ్. ఇప్పుడు ఎరుకల నామపదాన్ని తీసుకొని పైన చెప్పిన ఐదు రకాల అర్థాలు ఏ విధంగా వ్యక్తమౌతున్నాయి విశ్లేషిద్దాం.

1. మాదున ఎట్టుగుండువ 'ఆవును తీసుకురా'
2. మాదున కొ్ర్రోదాన 'ఆవును చంపొద్దు'

ఈ రెండు వాక్యాలలో మాదు అంటే 'ఆవు' అని అర్థం.

రెండు వాక్యాలలో ఆవును ఏకవచనంగా ప్రయోగించినా, మొదటి వాక్యంలో ఒక ఆవుని తీసుకురా అనే అర్థాన్ని ఇస్తుంది. కాని, రెండవ వాక్యంలో 'ఆవును చంపొద్దు' అంటే భూమి మీద ఎన్ని ఆవులున్నాయో అన్నింటినీ చంపొద్దు అనే అర్థం. అంటే రెండవ వాక్యంలో 'మాదు' జాతిని సూచిస్తుంది. మొదటి వాక్యంలో 'మాదు' వ్యక్తిని సూచిస్తుంది.

పతంజలి, తన భాష్యంలో జాతి, వ్యక్తి మధ్య ఉన్న సంబంధాన్ని 'నాంతరీయకత' విడదీయరానిదిగా వివరించారు. వ్యక్తిగా, జాతిగా మనకు అర్థబోధ ఎలా కలుగుతుంది అంటే సందర్భాన్ని బట్టి గుర్తించాల్సి ఉంటుంది. అంతేకాకుండా, జాతిని విడిగా చూపించడం సాధ్యం కాదు కాబట్టి నాంతరీయకమైన వ్యక్తిని ఆశ్రయించి చెప్పాల్సి వస్తుంది.

**లింగం :** నామవాచకం సూచించే మూడవ అర్థం లింగం. 'సరూపాణాం ఏక శేక ఏక విభక్తౌ (1–2–64)' అనే సూత్రంలో లింగం గురించి చర్చించారు. ఒకే అర్థాన్ని సూచించే పదాలు విభిన్న లింగాల్లో సంస్కృతంలో కన్పిస్తాయి. పుష్య తారకా, నక్షత్రం అనే మూడు పదాలు ఒకే అర్థాన్ని సూచించినా వరుసగా పులింగం, స్త్రీలింగం, నపుంసక లింగాలలో ఉన్నాయి. కాబట్టి సంస్కృతంలో లింగం అనేది శబ్దాన్ని బట్టి ఉంటుంది తప్ప అర్థాన్ని బట్టి ఉండదు.

ఎరుకల భాషలో కొన్ని ప్రత్యేకమైన ప్రత్యయాల ద్వారా లింగాన్ని గ్రహించవచ్చు. అవి.

**పుంలింగాన్ని సూచించే ప్రత్యయాలు**

| ఎరుకల పదం | అర్థం | ప్రత్యయం |
|---|---|---|
| 1. మగుమ్ | కొడుకు | – ఉమ్ |

| | | |
|---|---|---|
| 2. పేతో | మనుమడు | – ఓ |
| 3. మచ్చుడో | బావ | – అడో |

**స్త్రీ లింగాన్ని సూచించే ప్రత్యయాలు**

| **ఎరుకల పదం** | **అర్థం** | **ప్రత్యయం** |
|---|---|---|
| 1. మగ | అమ్మాయి / బిడ్డ | – అ |
| 2. పేతి | మనుమరాలు | – ఇ |
| 3. మెచ్చించి | మరదలు | – ఇంచి |
| 4. ఇగార్సి | వియ్యంపురాలు | – సి |

ప్రత్యయాలే కాక, తెలుగులో ఉన్నట్టుగా మగ, ఆడ అనే పదాలు లింగాన్ని ఏ విధంగా సూచిస్తాయో అదే విధంగా ఎరుకలలో కూడా 'గెందు', 'పొాట' అనే పదాలు లింగాన్ని సూచిస్తాయి.

| | |
|---|---|
| గెందునాయి | 'మగ కుక్క' |
| పొాటనాయి | 'ఆడ కుక్క' |

అదే విధంగా, అమ్మాయి, అబ్బాయి అనే వైవిధ్యాన్ని ఎరుకలలో 'గుంట', 'గోడో' అనే పదాలతో సూచిస్తారు. సంస్కృత భాషతో వైవిధ్యాన్ని కలిగి ఉన్నా ఎరుకలలో నామవాచకం జాతి, వ్యక్తితో పాటు లింగాన్ని కూడా సూచిస్తుంది.

**సంఖ్యా (వచనం)**

నామ వాచకం సూచించే నాల్గవ అర్థం – సంఖ్య (వచనం). సంస్కృతం లాంటి భాషల్లో ఏకవచన, ద్వివచన, బహు వచనాలుంటాయి. ద్రావిడ భాషల్లో మరియు ఇతర భాషా కుటుంబాల్లో కూడా చాలావరకు ఏకవచన, బహువచన విభాగం మాత్రమే ఉంటుంది. ఎరుకలలో తెలుగులో లాగా ఏకవచన – బహువచన విభాగం మాత్రమే ఉంటుంది. ఎరుకలలో ఐదు సార్థకాలు బహువచనాన్ని సూచిస్తాయి. తెలుగులో ఉన్న – లు అనే బహువచన ప్రత్యయం కూడా ఎరుకల బహువచన రూపాలలో కన్పడుతుంది. కాని బహువచన విధానం ప్రత్యేకంగా కన్పడుతుంది.

**ఎరుకల బహువచన రూపాలు వాటి పరిసరాలు**

1. బంధు వాచక శబ్దాలు – మారు అనే బహువచన ప్రత్యయాన్ని తీసుకుంటాయి.

| **ఏక వచనం** | **బహువచనం** | **అర్థం** |
|---|---|---|
| నంగ | నంగమారు | వదిన |
| పేతో | పేతొామారు | మనమడు |

2. 'దు'తో అంతమయ్యే పదాలు – 'ఆయె' అనే బహువచన ప్రత్యయాన్ని తీసుకుంటాయి.

| **ఏ.వ** | **బ.వ** | **అర్థం** |
|---|---|---|
| ఒల్లదు | ఒల్లాయె | 'తెల్లాయన' |
| తెన్నికొర్దు | తెన్నికోరాయె | 'బాపనాయన' |

3. 'ఇ' కారంతో అంతమయ్యే పదాలు 'ఎ' అనే బహువచన ప్రత్యయాన్ని తీసుకుంటాయి.

| **ఏ.వ.** | **బ.వ** | **అర్థం** |
|---|---|---|
| శెడి | శెడె | చెట్టు |
| ముయ్యి | ముయ్యె | నోరు |

4. 'ఉ' కారంతో అంతమయ్యే పదాలు 'గ' అనే బహువచన ప్రత్యయాన్ని తీసుకుంటాయి.

| **ఏ.వ.** | **బ.వ** | **అర్థం** |
|---|---|---|
| మాడు | మాడుగ | 'ఆవు' |
| ఊడు | ఊడుగ | 'ఇల్లు' |

5. 'అ'తో అంతయయ్యే పదాలు బహువచన ప్రత్యయం – 'లు' ని తీసుకుంటాయి.

| **ఏ.వ** | **బ.వ** | **అర్థం** |
|---|---|---|
| ఎల | ఎలలు | ఆకు |
| ఈగ | ఈగలు | ఈగ |

ఎరుకల పదాలు అంతమయ్యే అచ్చుని బట్టి బహువచన ప్రత్యయాలు మారుతాయి. బంధువాచక పదాలు ఒక ప్రత్యేకమైన బహువచన ప్రత్యయాన్ని తీసుకుంటాయి.

**కారకమ్**

నామపదం సూచించే ఐదవ అర్థం కారకమ్. క్రియాజనకత్వం కారకత్వమ్, క్రియా అన్వయిత్యం కారకత్వం అని వైయాకరణులు రెండు రకాలుగా నిర్వచించారు. క్రియను ఉత్పత్తి చేసేదే కారకమ్. సాధారణంగా కారకాలు ఆరు. అవి. కర్తృ, కర్మ, కరణ, సంప్రదాన, అపాదాన, అధికరణ కారకాలు. అర్థ ప్రధానంగా (సెమాంటిక్ కాటగిరి) చెప్పేవి కారకాలు. వాటిని సూచించేవి విభక్తులు (సింటాక్టిక్ కాటగిరి). ఈ ఆరు కారకాలు ఎరుకల భాషలో ఎలా ఉన్నాయో చూద్దాం.

**1. కర్తృకారకమ్ :** స్వతంత్ర: కర్తా. కాబట్టి ఈ క్రింది వాక్యంలో – విజయ్ కర్త.

విజయ్ అడారి 'విజయ్ వందుతున్నాడు'

**2. కర్మకారకమ్ :** కర్తకు ఈప్సితతమం అయినటువంటిది – కర్మ.

నవీన్ ఊరుకొాగారి – 'నవీన్ ఊరికి వెళ్తున్నాడు'. ఈ వాక్యంలో కర్తకు ఈప్సితతమం 'ఊరు' కాబట్టి ఊరుకు కర్మ కారకమ్ సిద్ధిస్తుంది. (కు అనేది విభక్తి)

3. కిశోర్ గొడ్డలితో బొట్టారి "కిశోర్ గొడ్డలితో నరుకుతున్నాడు.

ఈ వాక్యంలో సాధనం 'గొడ్డలి' కాబట్టి దానికి కరణ కారకం సిద్ధిస్తుంది. (తో అనేది విభక్తి)

4. 'పద్మ సీత గొత్తుకు పుస్తకం కుడ్కారి.

పద్మ సీత కొరకు పుస్తకం ఇస్తుంది. (విభక్తి : గొత్తుకు)

ఈ వాక్యంలో పుస్తకాన్ని తీసుకుంటుంది సీత కాబట్టి సంప్రదాన కారకం సీతకు సిద్ధిస్తుంది.

5. 'శెడి ఆందు పంగలు బుగారుమ్.

చెట్టు నుండి పండ్లు పడుతున్నాయి.

ఇక్కడ చెట్టు స్థిరంగా ఉంది. పండ్లు పడుతున్నాయి.

కాబట్టి 'శెడి'కి అపాదాన కారకం సిద్ధిస్తుంది.

(ఇక్కడ 'ఆందు' అనేది, విభక్తిగా ఉపయోగిస్తున్న పదం)

6. బావి కోకు తన్నిక్కిరి

బావిలో నీళ్ళున్నాయి

బావి అనేది ఆధారం కాబట్టి దానికి అధికరణ కారకం సిద్ధిస్తుంది. ('కొకు' కూడా విభక్తిగా ఉపయోగిస్తున్న పదం)

**ముగింపు**

పంచకం ప్రాతిపదికార్థ: అనే సూత్రం కేవలం సంస్కృతభాషకే పరిమితం కాకుండా అన్ని మానవ భాషలకు వర్తిస్తుంది అని ప్రతిపాదన చేశాను. ప్రస్తుత పత్రంలో తెలుగు, ఎరుకల భాషలకు పాణిని సూత్రం వర్తిస్తున్న విషయం నిరూపించబడింది.

ఎరుకల భాష తెలుగు – తమిళ – కన్నడ మిశ్రమ పదజాలాన్ని కల్గి ఉన్న ఒక విలక్షణమైన భాష. తెలుగు, తమిళ, కన్నడ భాషలు ఎంత ప్రాచీనమైనదో ఎరుకల కూడా అంతే ప్రాచీనమైన భాష. ఎన్నో భాషలు అంతరించి పోతున్న తరుణంలో వాళ్ళ భాషను ఇంకా రక్షించుకుంటూ జీవనాన్ని సాగిస్తున్న తెగ ఎరుకల.

ఎన్నో వేల సంవత్సరాల క్రితం భారతీయ వ్యాకరణ శాస్త్ర అంశాలు లిఖిత సాహిత్యం ఉన్న భాషలే కాకుండా కేవలం మౌఖిక సాహిత్యం ఉన్న ఎరుకల లాంటి భాషలకు కూడా పాణినీయ సూత్రాలను అనువర్తింపచేయగల్గిన శక్తి ఉండటం, మన భారతీయ వైయాకరణుల యొక్క అద్భుతమైన ధీశక్తికి నిదర్శనం.

ఛామ్స్కి, హాలిడే సిద్ధాంతాలను ఇతర భాషలకు ఆపాదించి పనిచేస్తున్న శాస్త్రవేత్తలు, పాణినీయ దృక్పథంలో భాషలను విశ్లేషిస్తే పరిశోధనలలో క్రొత్త కోణాన్ని ఆవిష్కరించే అవకాశం ఉంది అని నా అభిప్రాయం.



# ఎదురు చూపు

ఈ రేయి ఇంకా తెలుపెక్కడంలేదు...
నా గుండెలో ఆరాటం తగ్గడంలేదు..
ఊహలు వర్షమై కురుస్తుంటే..
కన్నుల్లో వర్ణరేఖలు
విరబూశాయి.
నిన్ను చూస్తానన్న ఆశ,
ఆకాశంలో అనంత ఉత్సాహంతో గిరికీలుకొడుతున్నది.
క్షణాలు భారమై..
చూపులు నీ ఎడబాటుకు ఎరుపెక్కాయి.
జ్ఞాపకాలు.. కొత్తపువ్వుల సుగంధ
పరిమళాలతో పెనవేసి..లేతనలుపెక్కాయి.
ఏటి అలలసవ్వడులు
నాప్రతినిట్టూర్పులు.
విరిసిన పూలరెమ్మలు నాకనుపాప రెప్పలు...
చిమ్మచీకటికి చిరుదీపాలు..
ఆ దీపాల దారిలో.. నీకై ........
నాఎదురు చూపులు.
ఆకాశ అద్దంలో నాఊహాల మీదుగా
నడుస్తూ వెళుతున్న నిన్ను చూస్తూ..
నీపేరును నేనై..
నా మాట నువ్వై..
దిగంతాలకు వినిపించేలా అరుస్తున్నాను..
ఆకాశం నవ్వంగా మురుస్తున్నాను.. మనసోపలేనంతగా..
ఏమి ఈ ఆనందం..
ఉంటే బాగుండు..
ఈ జన్మాంతం.
రేపు తాకుతాను నిన్ను...
ఏడుస్తానేమో నేను..
నీ ఎడబాటు వడి.. వసంతపు వనమై..
నన్ను ఓదారుస్తుందని.. అంతులేని ఆశ.
అందుకే ఈ రేయిని పట్టుకొని ఎక్కడికో విసురుతున్నాను.
ప్రణయరెక్కలతో ఎగురుకుంటూ వేగంగా వద్దామని..
వెలితెరగని ప్రేమ మకరందం.. నా హృదయపుష్ప
లోగిలినుండి పొంగిపొరులుతుంది..
నీ పాదాలనుఅల్లుకోడానికి.
ఎదురై రావా.. ప్రియా..........

**డా. కందుల శ్రీను**

నల్లగొండ, ఫోన్ : 9652674834

# నెత్తి మీది పొద్దు

గుడిసెలో ఓ మూలకు మూల్గుతున్న
ఎఱ్ఱటి సూర్యుడు
అవ్వ భుజాలమీదనే ఉదయిస్తాడు.
ఊరికి ముందర్నే నిద్రలేసి
గుడిసె ముంగిలిని అపురూపంగా
అలికిపూసి
మట్టిమీద మమకారపు సంతకం చేస్తది.

కట్టెలపొయ్యిమీద
నాల్గు మెత్కులు ఉడికేసుకొని
నెత్తిమీద సద్ది
చేతిలో కొడవలితో
ఆకలిబాట పడుతుంది.

కట్టుకున్నోడు కాటికి పయనమైనా
కన్న కొడుకులు ముద్దకూడు పెట్టకున్నా
అవ్వ జీవితమే పాఠంగా రాసుకొని
రోజుకో  పుట చదువుకుంటది.

చీర చిన్గినా
నెత్తి మాసినా
పెయ్యంత మైలపడినా
దిగులు చెందని పెద్దగుట్ట ధైర్యం అవ్వది.

బువ్వకావాలి కూరకావలనేమి అడగదు
కారం మెత్కులైన
కండ్లకద్దుకొని
గొంతు దింపుకుంటది.

ఎముకలిరిగేటట్లు
ఎద్దుకష్టం చేసిన
ఎన్నడు కూడా నోటిరుసి ఎరుగదు
పండుగపొద్దైనా జేజబువ్వకు గతుండదు.



కూలికెల్లినకాడ
మునంలో ముందరుంటది
పదంపాడేకాడ పల్లవై మోగుతుంటది.

అవ్వ నోరిప్పితే
తెలుగు యాసలన్ని తొణికిసలాడుతయి
మాటమాటకొక సామెత జాలువార్తది.
అవ్వ వందల శాస్త్రాలకు
ఓ పెద్దబాలశిక్ష
అవ్వ పెండ్లి పందిట్లో
పల్లవించే పాటల కుప్ప.

ఎంత బీదరికం గుండెపై పొర్లాడినా
ఇంటిముందరికొచ్చినవారికి
పిడికెడు బువ్వపెట్టే
ఆత్మ గల్ల చెయ్యి అవ్వది.

అవ్వకు కవిత్వం తెల్వదు
మొనగాండ్లమనీ
కులికే కవులే
అవ్వనోటి ముందర దోసిలిపట్టాలి.

**అవని శ్రీ**
ఫోన్ : 998 541 9424

గ్రంథాంతరంగం 14

# నవ్య సాహిత్య మాల (సమీక్ష)

శ్రీ ఘట్టమరాజు, బెంగుళూరు, ఫోన్ : 9964082076




విద్వాన్ విశ్వం (1915-87) పేరు తలుస్తూనే సాహిత్య ప్రియులకు చటుక్కున స్ఫురించే రచన 'పెన్నేటి పాట' (1956) అనే కథాత్మక ఖండ కావ్యం. కాని ఆయన రచించిన 'విరికన్నె', 'ఒకనాడు' ఖండకావ్యాలు దుర్లభాలైనందువల్ల వాటిపై విమర్శలు రాకపొయ్యాయి. 'పెన్నేటిపాట' ఖండకావ్యం మీద చాలా విమర్శలు వచ్చి, ఆ రచన తెలుగు కావ్య జగత్తులో సుస్థిర స్థానం సంపాదించుకుంది. బాధాకరమైన విషయమేమంటే చెయ్యి తిరిగిన గద్య రచయిత ఐన విద్వాన్ మీసరగండ విశ్వంభర (విశ్వరూప) శాస్త్రి భావ వస్తు రచనల వైశిష్ట్యాన్ని తెలిపే ఎన్నో గద్య రచనలు విస్మృతి గర్భంలో విలీనమై పోవడం. కాని 'ఆంధ్రప్రభ' వార పత్రికా సంపాదకులుగా విశ్వంగారు రాసిన 'కాలమ్'– 'మాణిక్య వీణ' చాలా ఏళ్లపాటు వెలువడి పాఠకులకు మనోల్లాసమూ, మనో వికాసమూ కలిగించగలిగింది.

విద్వాన్ విశ్వం అనంతపురం జిల్లాకు చెందినవాడు. ఆయన అక్కడి ప్రభుత్వ కళాశాల ఆంధ్రోపన్యాసకులైన డా. చిలుకూరి నారాయణ రావుగారి ప్రియ శిష్యుల్లో ఒకరు. పైగా సుప్రసిద్ధ కాంగ్రెసు నాయకుడు, అనంతపురం శ్రీసాధన ప్రెస్ నుండి వెలువడే శ్రీసాధన పత్రిక (వార పత్రిక) సంపాదకుడు, శ్రీమాన్ పప్పూరు రామాచార్యుల గరిడీలో వ్యాస రచనలోని మెలకువల్ని నేర్చుకున్న కుశాగ్రబుద్ధి.

విద్వాన్ విశ్వం మొదట్లో కాంగ్రెసు పార్టీ క్రియాశీల కార్యకర్తగా పనిచేసినా, ప్రాణమిత్రుడైన తరిమెల నాగిరెడ్డి సాహచర్యంలో కమ్యూనిస్టు భావాలపట్ల మొగ్గు చూపి, సామ్యవాద సిద్ధాంతాల్ని క్షుణ్ణంగా చదివి వొంట బట్టిచ్చుకున్నారు. ఇద్దరూ కలిసి 1938లో అనంతపురం నుంచి సంపాదక బాధ్యత వహించి 'నవ్య సాహిత్య మాల' ప్రచురణలు ప్రారంభించారు. విద్వాన్ విశ్వం గారి 'సమీక్ష' ఆ మాలలోని పుష్పమే.

విద్వాన్ విశ్వం 'సమీక్ష' లో రాసిన 'మనవి' (జనవరి 15, 1940) మాటలు ఇలా వున్నాయి. "ఇదొక వ్యాస సంపుటి. అప్పుడప్పుడూ శ్రీసాధనలో వ్రాస్తూన్న వానిలో కొన్ని యీ రూపం తాల్చినవి. దేనికది ప్రత్యేకంగా కనబడుతున్నా అన్నిటినీ అనుసంధించే ఒక సమీక్ష వీనిలో ఉందనుకుంటాను. చదివితే మీకే తెలుస్తుందిలే."

'సమీక్ష' వ్యాస సంపుటిలో పదకొండు రచనలున్నాయి. అవి : 1 వింటారూ? 2. సారస్వతం 3. అనుభవం 4. మంచీ చెడ్డా 5. విజ్ఞానం 6. విలాసాలు 7. సమాధానాలు 8. నీతులు 9. ఆనందం 10. ఎందుకు? 11. ఎక్కడికి?.

విద్వాన్ విశ్వం పైలా పచ్చీసు వయస్సులో పేదరికం, ఆకలిదప్పులు, నిరుద్యోగం, బరువు బాధ్యతలు మొదలైన ఈతి బాధలవల్ల కుంగి పొయ్యారు. అందులోనూ మద్రాసు నగర జీవితంలో దారీ తెన్నులు తెలియక కొట్టుమిట్టాడారు. భావనా ప్రపంచంలోని సుఖం, భౌతిక ప్రపంచంలో బొత్తిగా కానరాదని తెలుసుకున్నారాయన.

'వింటారూ?' అన్న తొలి వ్యాసంలోనే జీవిత కఠోర సత్యావిష్కరణ కళ్లముందు నిలిచింది. "మన తలపులన్నీ యేదో అవ్యక్తమైన భావనా ప్రపంచములో నుంచీ అలా ఉద్భవిస్తూన్నాయనడం మాత్రము వల్లకాదు. ఈ అభిప్రాయాలన్నిటికీ వాని ఆర్థికాదులైన భౌతిక వాతావరణమూ కారణం. (పేజి : 10-11) దుర్భర దారిద్ర్యం కబంధ హస్తాల నుంచి తప్పించుకొనేందుకు ప్రయత్నిస్తూ దాని మూలకారణాల్ని అన్వేషించడం, ప్రపంచం, జీవితాన్ని విమర్శించేందుకు పూనుకొంటారు రచయిత. "మానవ జీవితాన్ని మనస్సునూ పరోక్షంగానో, ప్రత్యక్షంగానో పరిణమింపజేసే పరమోద్దేశంతో ప్రవర్తించడమే." (పేజి: 17-18) సారస్వత ముఖ్య లక్షణమన్నారు విశ్వంగారు.

'సమాజాన్ని మరమ్మత్తు చేయడంలో సిద్ధహస్తులైన రచయితల యెడ సహకార సద్భావాలను చూపి దేశ సౌభాగ్యానికి దారి తీయవలెను." (పేజి: 18) అంటూ సంఘంలోని పెద్ద మనుష్యుల్ని కోరారు రచయిత.

విశ్వంగారు 'అనుభవము' వ్యాసంలో "అనుభవమంటే అది భావనాశక్తితోనూ, మనశ్శక్తితోనూ, ఆత్మశక్తితోనూ యెట్లా అయినా సరే సకారణంగా చర్చింపబడి తేల్చుకొనబడితే సరి అందుకు వారివారి తెలివితేటలే కారణం కానీ అందులో చాలా నాళ్ళుండడం కాదు." (పేజి: 22) అంటూ 'అనుభవం' అనే మాటకు హేతుబద్ధమైన, సకారాత్మకమైన, ఆచరణ యోగ్యమైన భావన అని చక్కగా నిర్వచించారు.

వ్యాసకర్త "మంచి చెడ్డలు ఆయా కాలంలో అధికార ప్రాబల్యం గల వారి యిష్టానిష్టాలను బట్టి యేర్పడుతూంట' వని (పేజి: 28) అభిప్రాయపడ్డారు. సంఘాన్ని తమ గుప్పెట్లో పెట్టుకుని తమ స్వార్థం కోసం ఉపయోగించుకునేందుకు ఇంటలిజెన్సియా 'ధీమంతుల మేధాబలం వెన్నుదన్నుగా ప్రణాళికలు రచింపచేసి విధినిషేధాల్ని (డూస్ - డోంట్స్) నిర్ణయించే ధనికవర్గ ముసుగు వీరుల వర్గమే మంచి - చెడ్డల్ని తమ తమ అవసరాల కనుగుణంగా రూపొందిస్తుందని అంటారు విశ్వంగారు. విజ్ఞానం వల్ల కలిగే లాభాలు సంఘంలో అందరికీ చెందాలంటే దానికి తగిన సిద్ధాంతాల ఆసరాతో ప్రజా సంక్షేమం కోసం పాటుపడేందుకు కొందరు మేధావులు ప్రయత్నిస్తున్నారని అంటారు రచయిత. సామ్యవాద ఆచరణ వల్లనే ఇది సాధ్యమని ధ్వనిగర్భితంగా సూచించారు రచయిత.

సంఘంలో ఉన్నవాళ్ల కొక నీతి, లేనివాళ్ల కింకొక నీతి బోధింప బడుతున్నదని విశ్వంగారి వాదన. విలాసాలు శ్రీమంతులకు అవసరాలైతే, అవి పేదసాదలకు అనవసరమైనవిగా భావింపబడు తున్నాయని రచయిత అభిమతం. "కానీ, కొంచం విలాస జీవితాన్ని అనుభవించడానికి యేమీ లేనివాళ్లకూ హక్కున్నది అని అంటే అది అక్రమం, అధర్మం, ఘోరం." (పేజి: 39) అని విశ్వంగారి ఆక్రోశం.

'సమాధానాలు' మూడు భాగాలుగా 23 పేజీల దాకా విస్తరించిన వ్యాసం. రష్యాలో అనుసరింపబడ్డ కమ్యూనిస్టు సిద్ధాంతాల్ని మన దేశంలో తు.చ. తప్పకుండా పాటించాల్సిన అవసరం లేదనీ, మన దేశకాల పరిస్థితులకు అనువైన రీతిలో వాటిని అమలు చేయాలని విశ్వంగారి అభిమతం "కాబట్టి సోషలిస్టు మూల సిద్ధాంతాలూ, ఆ సమాజ విధానమూ ఒక్క రష్యాకే కాదు అందరూ అనుసరించొచ్చు. యెక్కడ పీడనా, దరిద్రమూ, నిరుద్యోగమూ ఉంటే అక్కడంతా వానిని తొలగించుకోవడానికి పనికివస్తుందని మనవి." (పేజి: 47) విద్వాన్ విశ్వం కమ్యూనిస్టు సిద్ధాంతాల గాఢ ప్రభావానికి లోనైనా భారత దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించాలని త్రికరణశుద్ధిగా సంకల్పించారు. ఈ సందర్భంగా ఆయన ఇలా అంటారు– "పరపీడన తొలగిపొయ్యే వరకు పాటుపడి పరపీడనకు తావీని సమాజాన్ని నిర్మించా లనుకొనేవారు పాటుపడాలి. పడతారు. యెందఱు త్యాగం చేస్తే యీ మాత్రం వచ్చింది ఇంకా యెందఱో చేస్తే కాని ఆ స్థితి రాదు." (పేజి: 56) హింసాత్మక మార్గంలో దేశానికి స్వరాజ్యం తేవాలన్న భావన సోషలిస్టు కమ్యూనిస్టు సిద్ధాంతాలకు వ్యతిరేకమని విశ్వంగారు మరీమరీ చెప్పారు.

నీతి నియమాలు కాలక్రమంలో మార్పులకు లోనవుతాయని, సంఘ శ్రేయస్సుకు అప్పుడే అవి తోడ్పడగలవని విద్వాన్ విశ్వం గారన్నారు. 'నీతులు' వ్యాసంలో "ఆచరణ లేని సిద్ధాంతాలనవసరాలు, ఆడంబరాలు." (పేజి: 70) అని ఖరాఖండిగా చెప్పారు రచయిత. 'వర్గరహితమైన సమాజం' ఏర్పడాలన్నది ఆయన ప్రబల ఆకాంక్ష, ఆశయం. (పేజి: 71)

'ఆనందం' అన్న వ్యాసంలో వ్యాసకర్త సమాజంలోని ప్రజలందరికీ ఆనందించే వసతులుండాలనీ, సామర్థ్యం కలగాలనీ ఆశిస్తారు. కాని, ఈ రచయిత ఆనందించడానికి బదులు 'ఆవేదన' పడుతున్నారు. ఎందుకంటే సంఘంలో చాలామందికి ఆనందించే అవకాశాలు లేవనే ఈ సంవేదన శీలుని వ్యథా, బాధానూ.

'ఎందుకు?' అన్న వ్యాసంలో వర్తమాన సంక్షుభిత సమాజాన్ని చక్కబరచాలని రచయిత పడే వేదన హృదయ స్పర్శిగా వ్యక్తమయింది. సంఘంలోని మూల మూలల్లో కనపడే దుఃఖితుల్ని చూసి విశ్వంగారు విలవిలలాడి పోతారు. ఈ సంఘంలో, దేశంలో సుఖశాంతులు నెలకొనాలంటే వేలాది మంది ప్రపంచాగ్నిలో సమిధలైపోవాల్సిందే అంటారు ఆయన." సంఘాన్ని పునర్నిర్మాణం చెయ్యడానికి చేతనౌతుంది. అని అందుకు నడుము కట్టి ప్రస్తుత సంఘాన్ని విమర్శిస్తే కనులెర్రవౌతవి వారికి. ఆ సేవా పరాయణులే అతణ్ణి ద్వేషిస్తారు. సంఘం వెలివేస్తుంది. స్నేహితులు అపహాస్యం చేస్తారు.

అయితే మాత్రం అతను ప్రయత్నం మానుకుంటాడా? ఎన్నటికీ మానుకోడు" (పేజి: 85) అభ్యుదయ భావ సంపన్నులు విశ్వంగారు నవ సమాజ నిర్మాణ ప్రయత్నాల్ని కొనసాగిస్తారు.

'ఎక్కడికి?' అన్నది చిట్టచివరి వ్యాసం. మన ప్రజలు ఎటు పోతున్నారు? ఎలా బతుకుతున్నారు? ఏవిధంగా బతకాలి? అనే ప్రశ్నల్ని వేస్తూ రచయిత తన ఆశయాన్ని ఇలా విప్పి చెప్తారు– "యీ బ్రిటిషు సామ్రాజ్యతత్త్వం నశించే వఱకూ యేదీ సాధ్యం కాదు. కాబట్టే ప్రతివారూ పై ఆదర్శాన్ని మనసులో నుంచుకొని అందుకు సాధన ప్రాయమైన సామ్రాజ్యతత్త్వ విచ్ఛిత్తికై, స్వరాజ ప్రాప్తికై అన్ని వర్గాలవారూ కూడగట్టుకొని సంయుక్త సంఘటన ద్వారా భారతదేశ దాస్య బంధనాలను విచ్ఛిన్నం చేయవలెను. అంత మాత్రంతోనే తృప్తి చెందక ఆ స్వరాజ్యాన్ని నిజమైన ప్రజారాజ్యం చెయ్యడానికి విప్లవం కొని రావలెను." (పేజి: 90).

విద్వాన్ విశ్వం తొలి దశలో సంస్కృతాంధ్ర కావ్యాల పట్ల మక్కువ చూపి, సంప్రదాయవాదిగా రూపొందినా, కాలక్రమంలో అభ్యుదయ, విప్లవ భావాల్ని హృదయగతం చేసుకొన్నారు. ఆయన 'పెన్నేటి పాట' కావ్యంలో కరువుకాటకాల కరాళ దంష్ట్రల మధ్య చిక్కి విలవిల లాడుతున్న రాయలసీమవాసుల ఆవేదనలకు, ఆక్రోశాలకు వత్తాసు పలికి, సమసమాజ నిర్మాణం వైపు సాగేలా ప్రజల్ని పురికొల్పారు. విద్వాన్ విశ్వంగారి మార్క్సిస్టు భావజాలాన్ని తెలిపే 'లెనిన్' 'ఏమి చెయ్యడం' మొదలైన చింతనాత్మక రచనలు ఇరవయ్యవ శతాబ్దపు నాల్గవ దశకంలోనే వెలువడి ప్రజల్లో జాగృతి కలిగించాయి.

1940లో ముద్రింపబడ్డ ఈ వ్యాస సంకలనం 'సమీక్ష' విద్వాన్ విశ్వంగారి సాహితీ వ్యక్తిత్వంలోని మరో కోణాన్ని, భంగిమను, సరళ సుందర స్పష్టమైన రీతిలో వ్యక్తం చేస్తుందని భావించవచ్చు.

కథ

# పాటల మంగమ్మ

**డా. పేట శ్రీనివాసులు రెడ్డి,** ఆచార్యులు, శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం, తిరుపతి. ఫోన్ : 98493 07333

చుట్టూ కిటకిటలాడే పల్లెజనం. మధ్యలో నేల మీద రెండు ఇరవై అడుగుల పొడవుండే భీమ, దుర్యోధనుల మట్టితో చేసిన బొమ్మలు. భీముని బొమ్మపై భీమ పాత్రధారి, దుర్యోధనుని బొమ్మపై దుర్యోధన పాత్రధారి నిలబడి భారతంలోని పద్యాలను ఆవేశంగా చెప్తూ ఉగ్రరూపాన్ని ప్రదర్శిస్తున్నారు. కాసేపటికి భీమ పాత్రధారి దుర్యోధనుని పాత్రధారిపై ఉరికాడు వారి చుట్టూ ఉన్న కొంతమంది భీమ పాత్రధారిని గట్టిగా పట్టుకొన్నారు. అయినా భీమపాత్రధారి దుర్యోధన పాత్రధారి తొడపై తన గదతో కొట్టాడు. దుర్యోధనుడు కూలబడ్డాడు. భీమునికి పూనకం వస్తుందని ముందే ఊహించిన నిర్వాహకులు అతనిని గట్టిగా పట్టుకొని నిలువరిస్తున్నా దుర్యోధనుని మీదికి ఉరుకుతున్నాడు. చుట్టూ ఉన్న జన ఘోష దద్దరిల్లి ఆకాశన్నంటుతోంది. నిర్వాహకులు దుర్యోధనుని చనిపోయినట్లు భావించి వెనక వైపున్న ధర్మరాజుల గుడిలోకి తీసుకెళ్ళారు. అలాగే భీముని శాంతింపజేసి గుడిలోకి తీసుకెళ్ళారు. జనం బొమ్మల మట్టి కోసం ఎగబడ్డారు. మేము అక్కడ్నుంచి వీడియో కెమెరాను, స్టిల్ కెమెరాలను, వాయిస్ రికార్డర్లను సర్దుకొని గుడి ఉన్న చుట్టు గుంట రామాపురంలోని మా బంధువుల ఇంటికి భోజనానికెళ్ళాం. తిరుపతికి ఎనిమిది కిలోమీటర్ల దూరంలో చుట్టు గుంట రామాపురం ఉంది. ఇక్కడ ధర్మరాజుల గుడి ఉంది. ప్రతి సంవత్సరం ఇక్కడ ధర్మరాజు పేరు మీద లేదా ద్రౌపదమ్మ పేరు మీద తిరునాళ్ళు పద్దెనిమిది రోజుల పాటు జరుగుతాయి. దీనినే భారతం తిరునాళ్ళని కూడా అంటారు. ఇందులో ప్రధాన ఘట్టాలు బకాసుర బండి కూడు, అర్జున తపస్సు మాను, అగ్గి తొక్కడం వంటివి కూడా ఉన్నాయి. మధ్యాహ్నం అందరం భోజనాలు చేసి ఇంటి ముందరేసిన ప్లాస్టిక్ కుర్చీలలో కూర్చున్నాం.

**"జానపద విజ్ఞానం మీద పరిశోధనలు ఇంత ఘోరంగా తగ్గిపోతాయని నేనూహించలేదు. చిత్తూరు జిల్లాకే పరిమితమైన ఈ ద్రౌపదమ్మ తిరునాళ్ళ మీద పరిశోధనలు చేసే వారే కరువవుతున్నారు. మనమేదో ద్రౌపదమ్మ తిరునాళ్ళను కొన్ని ఘట్టాలను రికార్డు చేసి పెడ్తామని వచ్చాం"** అన్నాడు ప్రముఖ జానపద విజ్ఞానవేత్త ఆచార్య భక్తవత్సలరెడ్డి.

**"ఏం చేసేది అన్నగారు! ఎంతోమంది స్కాలర్లకు జానపద విజ్ఞానంలోని అంశాల మీద పిహెచ్.డి.లకు టాపిక్‌లిచ్చాను. తీసుకునేటప్పుడు హుషారుగా తీసుకొంటారు. ఆ తర్వాత క్షేత్ర పర్యటనలు చేయాల్సి వస్తుందని తాత్సారం చేస్తారు. మూడు, నాలుగు నెలలు అలా గడిపేస్తారు. క్షేత్ర పర్యటనలకు ఎప్పుడు పోతారని అడిగినప్పుడు నీళ్ళు నములుతూ అప్పుడు పోతాం, ఇప్పుడు పోతాం అంటూ దాటేస్తుంటారు. ఇక లాభం లేదనుకొని వారికి కథల మీదో, నవలల మీదో, మరోవాటి మీదో టాపిక్‌లను మార్చేస్తుంటాను"** అన్నాను.

**"మన తెలుగు రాష్ట్రాలలోని విశ్వవిద్యాలయాల్లోనే ఇలా జరుగుతోంది. కర్నాటక రాష్ట్రంలో మాత్రం జానపద విజ్ఞానమంటే వారికి ప్రాణం. జానపద అకాడమి ఉంది. జానపద విశ్వవిద్యాలయం ఉంది. అక్కడ జానపదంపై వచ్చినన్ని గ్రంథాలు మరెక్కడా వెలువడలేదు. యక్షగానం తమ ఆస్తిగా, ప్రాణంగా భావిస్తారు. ఇప్పటికీ జానపద గేయాలను పాడేవారు అధికంగా ఉన్నారు. కర్ణాటక తర్వాత తమిళనాడు, ఆ తర్వాత కేరళ ఫర్వాలేదు. ఎటొచ్చి మన తెలుగు రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్‌లో కావలసినంత జానపద విజ్ఞానమున్నా సేకరించి, భద్రపరిచేవారు లేకపోవడంతో అవి తమ ఉనికిని కోల్పోతున్నాయి"** అన్నాడు భక్తవత్సలం.

**"అన్నా! ఒకప్పుడు మన తెలుగు పల్లెల్లో జానపద గేయాలను విపరీతంగా పాడేవారు. ఆచార్య బిరుదురాజు రామరాజు లాంటివారు 1955 ప్రాంతంలో ఆంధ్రప్రదేశ్ అంతా తిరిగి 'తెలుగు జానపద గేయ సాహిత్యం' మీద పరిశోధన చేసి డాక్టరేట్ తీసుకొన్నారు. దక్షిణ భారతదేశంలో జానపదం మీద ఇదే మొదటి పరిశోధన. ఆంధ్రులు ఆరంభ శూరులని ఊరకే అన్నారా?. ఇప్పుడు జానపద పరిశోధనారంగంలో మనం బాగా వెనకబడిపోయాం. మన పల్లెల్లో కూడా ఇప్పుడు స్త్రీలు తప్ప పురుషులు పాడడం లేదు. కారణం పురుషులు వ్యవసాయానికి దూరమవడం, స్త్రీలే వ్యవసాయాన్ని చేస్తుండడం. పని పాటలు అన్నాం. పని ఎక్కడుంటే పాట అక్కడుంటుంది. నేడు స్త్రీలు పనిచేయడం వల్ల పాటలు వారి దగ్గరే ఉన్నాయి"** అన్నాను.

**"ఒకప్పుడు మా ఊరిలో కూడా విపరీతంగా పాటలు పాడేవారుండేవారు. ఇప్పుడు పల్లెల్లో కూడా సినిమా పాటలు పాడుకొంటూ టి.వి. సీరియళ్ళ కథలను చెప్పుకుంటున్నారు"** అన్నాడు మాతోపాటు వచ్చిన, చిత్తూరు జిల్లా జానపద రూపకాల మీద పరిశోధన చేసిన డాక్టర్ బ్రహ్మానందరెడ్డి.

"అన్నా! నేను 1985లో చిత్తూరు జిల్లా జానపద శృంగార గేయాలు మీద పరిశోధన చేసే రోజుల్లో టేప్ రికార్డర్ తీసుకొని ఏ వూరికెళ్ళినా సాయంత్రం పూట కూర్చోబెట్టి ఒక క్యాసెట్ నిండా పాటలు పాడి పంపించేవారు. జానపద గేయాలను అందరూ పాడినా వాళ్ళళ్ళో అక్కడక్కడా గొప్ప గాయకులు, అందులో నిష్ణాతులుండేవారు. ఒకసారి శ్రీనివాసమంగాపురం దగ్గరుండే

దళితవాడలో సిద్ధయ్య అనే ఒక జానపద గాయకుడుండేవాడు. ఈ విషయం తెలిసిన నేను అతని దగ్గరకెళ్ళాను. అతను ఐదారు పాటలు పాడుతూనే నిలిపేస్తాడు. కారణం చెప్పారు ఆ వూరు వాళ్ళు. డబ్బులిచ్చాను. డబ్బుల్ని తీసుకొని వెళ్ళి సారా తాగొచ్చి మళ్ళీ నాలుగైదు పాటలు పాడాడు. మళ్ళీ సారా తాగొచ్చి మళ్ళీ పాడాడు. అలా అతని దగ్గర కొన్ని మంచి పాటలు సేకరించా. అతను సారా కోసం పాడలేదు. అది తాగితే ఊపొస్తుందని తాగేవాడు. జానపదులు అల్ప సంతోషులు చాలా ఊర్లల్లో చిన్న చిన్న వాటికే అంటే బీడీలకు, వక్కాకుకు, రవిక గుడ్డలకు పాడేసేవారు. అంతకుమించి మన దగ్గర ఏమీ ఆశించరు. పీలేరు రాయచోటి మార్గంలో ముప్పిరెడ్డిగారి పల్లెలో రాజా అనేవాడు భలే పాడ్తాడు. టేప్ రికార్డర్ ఆన్ చేస్తూనే పాడడం ఆపేస్తాడు. ఏమని అడిగితే నా గొంతును ఆ పెట్టెలో పట్టుకొని పోతే నేనెట్లా మాట్లాడ్తాను? అని ససేమిరా పాడలేదు. కొంతమంది ఫోటోలు తీస్తే తమ కళ పోయి చచ్చిపోతామని ఫోటోలు తీయించుకోలేదు" అన్నాను.

"ఇలా చెప్పాలంటే నా క్షేత్ర పర్యటనల్లో కూడా ఎన్నో సంఘటనలు జరిగాయి. రామరాజుగారు గాయకుల్ని పోలీసు స్టేషన్లకు పిలిపించి కొట్టించి కూడా పాడించుకొన్నాడట. చేసిన పాపం చెప్తే పోతుందని అప్పుడప్పుడు చెప్పేవాడు" అన్నాడు భక్తవత్సలం.

"అలా సేకరించాడు కాబట్టే ఆయన పరిశోధనా గ్రంథం నేటికీ ప్రామాణికంగా నిలిచింది" అన్నాడు బ్రహ్మం.

"జానపద గేయాలు వొట్టి పాటలే కావు. అందులో మన సంస్కృతీ సంప్రదాయాలు, ఆచారాలు, వివిధ వర్గాల మనస్తత్వాలు, జనజీవం ప్రతిబింబిస్తుంటాయి" అన్నాను.

"కథలు, నవలలులాంటి కల్పిత సాహిత్యంలోకి కూడా ఏదో ఒక విధంగా, సందర్భోచితంగా జానపద గేయాలు, కథాగేయాలు, పురాగాథలు, ఐతిహ్యాలు, జానపద కథలు, కళలు, సామెతల్లా చోటు చేసుకోవాలి. అప్పుడు అవి నిధుల్లా భద్రంగా అందులో ఉంటాయి. ఈ దిశగా నేటి రచయితలు కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది" అన్నాడు భక్తవత్సలం.

"సినిమా పాటల్లో జానపద గేయాలు ఎన్నో ఉన్నాయి కదా? కొన్ని జానపద గేయాలను చిన్న చిన్న మార్పులతో కొంతమంది గేయరచయితలు ఉపయోగించుకుంటే, కొంతమంది యథాతథంగా వాడుకొన్నారు. తిరుపతి గంగ జాతరలో వందలాది సంవత్సరాలుగా పాడుకొనే 'కాశీకి పోయాను రామాహరే' పాట... 'ఉంటే ఈ ఊర్లో ఉండు పోతే నీ దేశం పోరా'...'చల్ మోహన్‌రంగా'... 'దూరుచూడుదున్నాచూడు'...'గాజువాక పిల్లా'...'ముక్కుచూడు ముక్కందం చూడు'...ఇలా కొసరాజు, ఆత్రేయ, సి.నా.రె., మొదలు నేటి పెంచలదాసు వరకు వందలాది జానపద గేయాలను సినిమాలలో ప్రవేశపెట్టి పాపులర్ సాంగ్స్‌ను చేశారు" అన్నాడు మాతోపాటు కారులో వచ్చిన పరిశోధక విద్యార్థి దర్గాబాబు.

"ఇప్పుడిప్పుడే కొన్ని టి.వి. ఛానళ్ళవాళ్ళు జానపద గాయకులను పోగేసి కొన్ని రేలారే రేలా వంటి కార్యక్రమాలను నిర్వహించి ప్రసారం చేశారు. అవి ఎంతో జనాదరణ పొందాయి" అన్నాడు మాతో పాటు వచ్చిన పరసుమణి.

"ఇప్పుడు జానపద గేయాలను పాడేవారు ఎవరున్నారు? పదేళ్ళకుముందు నేను గొబ్బి పాటలు సేకరించాను. వాటిని సంకలనంగా వేయాలని మరికొన్ని పాటలను సేకరించదలచి పల్లెలకు వెళ్తే నాకు నిరాశే మిగిలింది. అరకొర తప్ప బాగా పాడినవారు ఒక్కరూ లేరు. కళ్ళల్లో నీళ్ళు వచ్చినంత పనైంది. పదేళ్ళకే ఇంత మార్పా? అని" అన్నాను.

"జానపద గేయాలు పూర్తిగా నశించిపోలేదు. బాగా పాడేవాళ్ళు అక్కడక్కడ పల్లెల్లో ఉండే ఉంటారు. జానపద గేయాల మీద అభిరుచి ఉండే వాళ్ళు వాటిని వదలరు. నువ్వు చెప్పినట్లు ముందు పాడుతున్నంత మంది పాడడం లేదు" అన్నాడు భక్తవత్సలం.

"సార్! ఈ ఊర్లోని దళితవాడలో మంగమ్మ అనే ఒకామె ఉంది. జానపద గేయాలు భలే పాడుతుంది. ఆమెను 'పాటల మంగమ్మ' అని కూడా అంటారు. ఈ ఊర్లోనే పుట్టి పెరిగింది. సంవత్సరం ముందు ఈ వూరి ఆయన్నే పెళ్ళి చేసుకొంది. ఎందుకో పెళ్ళి అయినప్పటి నుంచి పాటలు పాడడం మానేసింది" అన్నాడు మేమొచ్చామని తెలిసి మాతోపాటే ఉన్న మా తెలుగు శాఖ విద్యార్థి ధనంజయ.

"ఆ పిల్ల ఈ పాటల పిచ్చిలో పడి పెళ్ళే చేసుకోననింది. వచ్చేవాడు పాడనిస్తాడో? లేదో?నని. వాళ్ళమ్మ వయసైపోతోందని ఏడ్చి, నానా యాగి చేసి ఆ పిల్లకు ముప్పై ఐదేళ్ళకు పెళ్ళి చేసింది. ఆ పిల్ల అనుకున్నట్లే వచ్చినోడు పదిమందిలో పాడితే ఒప్పుకోనన్నాడు. పైగా వాడు తాగుబోతోడు. వాడు తాగుబోతోడని వాడికెవరూ పిల్లనీయలేదు. ఇక ఈ పిల్ల వయసుకు వాడే దొరికాడు" అన్నాడు అక్కడే కూర్చుని ఉన్న మా బంధువు.

"సార్! మేము పొలం పనులు చేయాలంటే కూలీలకన్నా ముందు మంగమ్మను కచ్చితంగా పిలుస్తాం. ఆమె వచ్చిందంటే ఆమె పాడే పాటలు వింటూ ఎకరా నారు నాటేవాళ్ళు వొళ్ళు మరచిపోయి తన్మయత్వంతో ఒకటిన్నర ఎకరా నాటేస్తారు. మంగమ్మ రాకపోతే కూలోళ్ళు ఒక ఎకరా కూడా సరిగ్గా నాటరు. అలాగే కలుపు విషయంలోనూ అంతే" అన్నాడు ధనంజయ.

"ఆ పిల్లకు చిన్నప్పటి నుంచి పాటల పిచ్చి. పొలం పనులకు

చిన్నప్పటి నుంచి వాళ్ళమ్మతో పాటు వచ్చేది. ఆ పిల్ల పాడ్తా ఉంటే మిగిలిన కూలీలు వంత పాడేవారు. పొలం పనులుండి కూలీలను పిలిస్తే వాళ్ళు పాటల మంగమ్మను పిలవమనేవారు. కూలీలలో ఆ పిల్లకు అంత పరపతి ఉంది. దానికి కారణం ఆ పిల్ల పాడే పాటలే. చిన్నప్పటి నుంచి ఆ పిల్ల కవి గట్టి కూడా పాటలు అప్పటికప్పుడే పాడ్తాది కూడా. మేము కూడా ఆ పిల్ల వచ్చిందంటే ఆ పిల్ల పాడే పాటలను వినడానికెళ్ళే వాళ్ళం. ఒక్కోసారి ఆ పిల్ల మా మీద కూడా కవి గట్టి పాటలు పాడి అందరినీ నవ్వించేస్తుంది. మాకు కూడా ఆ పిల్లంటే చాలా ఇష్టం. ఆ పిల్ల కూలీ కొచ్చేటప్పుడు తంబూరాను కూడా వెంట తెచ్చుకొనేది. మధ్యాహ్నం కూలోళ్ళంతా సంగటి తిన్నాక కాసేపు బావికాడ చెట్టు కింద కూర్చొని, లేదా పొలం గట్ల మీద కూర్చొని తంబూరాను మీటుతూ ఎన్నో తత్వాలు పాడేది. ఎవరైనా ఊర్లోకి తత్వాలు పాడుకొంటూ భిక్షానికొచ్చేవారి దగ్గర తత్వాలు నేర్చుకొనేసేది. ఏదైనా ఊరికెళ్తే ఆ ఊరి ముసలోళ్ళ దగ్గర పాటలు నేర్చుకొచ్చి కొత్త పాటలుగా పాడేది. ఎందుకో ఆ పిల్లకు పాటంటే పంచ ప్రాణాలు" అన్నాడు మా బంధువు. అతను వయసులో పెద్దోడు కాబట్టి మంగమ్మను పిల్ల అని అంటున్నాడు.

"దీనిని బట్టి చూస్తుంటే మీ ఊర్లో చాలా మంది పాడేవాళ్ళు ఉన్నట్లున్నారే?" అన్నాడు భక్తవత్సలం.

"ఇప్పుడెవరున్నారు పాడేవాళ్ళు మంగమ్మ తప్ప. మంగమ్మ పాడితే మిగతా వాళ్ళు గొంతు కలపాలసిందే. ఒకప్పుడు పొలం పనులు జోరుగా జరిగే రోజుల్లో మా ఊరిలోని ఆడోళ్ళంతా పాడేవారు. ఇప్పుడు నాగరికత ముదిరిపోయింది. పొలం పనులకొచ్చే కూలీలే పాడ్తున్నారు. వాళ్ళు కూడా పాడడం మానేస్తున్నారు. దీనికి కారణం కూలీలు దొరక్క ఒక్కోసారి ఇబ్బంది పడ్తుంటాం. ఎందుకొచ్చిన గొడవ అని పొలాల్లో మామిడి చెట్లు పెట్టేస్తున్నాం. నీళ్ళు పెట్టడానికి కూడా కూలీలు దొరకడం లేదని డ్రిప్పు ఇరిగేషన్ పెట్టేస్తున్నాం" అన్నాడు మా బంధువు.

"పాటల మంగమ్మను ఎలాగైనా చూడాలి. ఆమెతో మాట్లాడాలి. ఎలాగైనా ఆమె చేత పాటలు పాడించి రికార్డు చేయాలి" అన్నాడు భక్తవత్సలం.

"ఆమె తెల్లారంతా ధర్మరాజుల గుడికాడ్నే ఉన్నిందే. మీరు వీడియో తీసేదంతా గమనిస్తానే ఉన్నిందే" అన్నాడు మా బంధువు.

"దళితవాడలో ఆమె పక్కింట్లో మా క్లాసుమేట్ మహేశ్ ఉన్నాడు. వాడికి ఫోన్ చేసి సాయంత్రం ఆమెను కలిసేటట్లు ఏర్పాటు చేయమంటా. వాడు మంగమ్మకు పిన్నమ్మ కొడుకే. తమ్ముడవుతాడు" అని చెప్పి మా ముందు ఫోన్లో మాట్లాడడం బాగుండదని ముందుకెళ్ళి ఫోన్ చేశాడు.

"ఏం నాయనా! ఆ పిల్లను ఇక్కడికి రమ్మంటే వస్తుంది కదా? మీరు అంత దూరం పోవాల్నా?" అన్నాడు మా బంధువు.

"జానపద కళాకారుల దగ్గరకు మనమెల్లడమే వాళ్ళకు గౌరవం...ఆమెను మన దగ్గరకు పిలిపించుకోవడం బాగుండదు" అన్నాను.

"అయినా దళితవాడ ధర్మరాజుల గుడి దారిలోనే కదా ఉండేది. వెళ్ళొస్తే పోతుంది" అన్నాడు భక్తవత్సలం.

"మీరు అట్నుంచి అటే తిరుపతికెళ్ళి పోతారని అలా అన్నా...రాత్రికి మా ఇంట్లో భోజనం చేశాకే మీరెళ్ళాలి. ఎంత రాత్రి అయినా ఫర్వాలేదు" అన్నాడు మా బంధువు.

ధనంజయ ఫోన్ చేసే సరికి మహేశ్ మేమున్న చోటుకు వచ్చేశాడు. జరిగిన సంగతంతా చెప్పాడు. మా సార్ల దగ్గర తన పరువు కాపాడమని బతిమలాడాడు. అతన్ని మాకు పరిచయం చేశాడు.

"ఒరే! మంగమ్మ ఇప్పుడు పాటలు పాడడం లేదని నీకు తెలుసుగా! ఏదో ఇంట్లో వంట చేస్తూ, ఊరుమిండి నూరుతూ, ఇంటి పనులు చేసుకొంటూనే పాటలు పాడేస్తుంటాది. మొగుడొస్తే నిలిపేస్తాది. అలాంటిది బయట పాడమంటే ఒప్పుకుంటుందా?" అని మహేశ్ ఆలోచనలో పడ్డాడు.

మేము కూడా మహేశ్‌పై ఒత్తిడి తెచ్చాం. మంగమ్మను ఎలాగైనా కలవాలని.

"సరే! సాయంత్రం ఆరు గంటలకు మా దళితవాడలోని భజన గుడికాడికి వచ్చేయండి. నేనెలాగో మంగమ్మని అక్కడికి తీసుకొస్తాను. ఆమె దగ్గర ఎలా పాడించుకుంటారో మిమ్మల్ని బట్టి ఉంటుంది" అన్నాడు మహేశ్.

మాకు పనీ పాట లేదు కాబట్టి ఐదు గంటల నుంచే ముఖాలు కడుక్కొని ఆరు గంటల కల్లా దళితవాడలోని భజనగుడి ముందు వాలిపోయాం. మహేశ్ ఎలా బతిమాలాడాడో? ఏమో? మొత్తానికి మంగమ్మను తీసుకొచ్చి భజన గుడి ముందు నిలిపాడు. మేము గుడి ముందుండే రాతి తిన్నెలపై నుంచి లేచి ఆమెను పలకరించాం. మమ్మల్ని పరిచయం చేసుకొన్నాం.

"అన్నా! నేను సంవత్సరం నుంచి పాడేది లేదన్నా" అంది మంగమ్మ.

"అమ్మా! మాకు అన్నీ తెలుసు. మీ ఊర్లో వాళ్ళు నీ గురించి ఎంతో గొప్పగా చెప్పారు. పాట శక్తివంతమైంది. దానిని గొంతులో ఎంత తొక్కి పెట్టినా అది ఏదో రూపంలో ఎప్పుడో ఒకప్పుడు బయటకు వస్తూనే ఉంటుంది. నువ్వు పాడే పాటలు నీతోనే

ISSN 2457-0796
UGC Care List Approved Journal
మూసీ మాసపత్రిక సంపుటి -25 : సంచిక - 9  హైదరాబాద్ జులై : 2022

అంతరించి పోకూడదు. నీలో నువ్వు పాడుకుంటే నీకు మాత్రమే ఆనందం కలుగుతుంది. పది మంది కోసం పాడితే అది వారిలో చైతన్యాన్ని నింపుతుంది. మనం మన కోసమే బతకకూడదు. సమాజం కోసం కూడా బతకాలి. నువ్వు మనసు మార్చుకొని పాటలు పాడితే వాటిని మేము రికార్డు చేస్తాం. నీ పేరుతో పుస్తకాలలో ప్రచురిస్తాం. అది భావితరాలవారి పరిశోధనకు ఎంతో పనికి వస్తుంది. నువ్వు అనుమతిస్తే వీడియో కూడా తీసుకుంటాం" అన్నాను నేను. ఆమె మెత్తబడింది.

"వీడియో వొద్దన్నా! నాకు సిగ్గుగా ఉంటుంది. పాటలు పాడ్తా కావాలంటే రికార్డు చేసుకోండి" అంది మంగమ్మ.

అప్పుడే చీకటి పడింది. గుడి ముందు లైటు వేశారు. మంగమ్మ జానపద గేయాలు పాడడం మొదలు పెట్టింది. ఆ వాడలో మంగమ్మ పాటకు వాసి పోయిన వాళ్ళు గుడిముందు గుంపు చేరారు. నేను ఎం.పి. త్రీ రికార్డర్‌తో రికార్డు చేస్తుంటే దర్గాబాబు, మణి సెల్‌ఫోన్లో రికార్డు చేయడం మొదలు పెట్టారు. మంగమ్మ గొంతు విని ఆశ్చర్యపోయాం. సినీ గాయనీమణులకు ఏ మాత్రం తీసిపోదు. పాటలు స్వచ్ఛంగా ఉన్నాయి. వాటిలో కొన్ని విన్న పాటలున్నా చాలా పాటలు అద్భుతంగా ఉన్నాయి. **'నూగు నూగు మీసమోడ నూగుసేని కావిలోడా...ఆకిస్తా నవలబ్బే తోటాకులిస్తానవలబ్బే...బాగుబాగు బాటల్లో నా సామి...మావిటికి మావూరిలో సారిగా...కీలూగంటా లేనుకోని కిన్నెరీలు మీటుకుంటా సామి వద్దకు నేనూ బోతినో...తుమ్మీదాలున్నాయేమిరా...జడ నీకు ఎవరల్లిరే చిన్నదానా...ఆదివారం వస్తావనీ బావా ఆశతో నేనుంటినీ...**ఇలా చాలా పాటలు తన్మయత్వంతో పాడ్తూపోతోంది. ఎన్నాళ్ళో అణచిపెట్టిన పాతాళగంగ పైకి ఎగజిమ్మినట్లైంది. ఇంతలో ఎక్కడ్నుంచో మెరుపులా ఒక వ్యక్తి తూలుతూ వచ్చి మంగమ్మ జుట్టు పట్టుకొని బరబరా ఇంటికి లాక్కొని పోయాడు. మహేశ్ వారిస్తూ వెంటపోయాడు. తప్పంతా తనదేనని చెప్పాడు. అయినా ఆ తాగుబోతు భర్త మంగమ్మను ఇంటికి బరబరా లాక్కొనిపోయాడు.

"సార్! ఇక లాభం లేదు. మీరు అన్నీ సర్దుకొని వెళ్ళిపోండి. మంగమ్మను చితక్కొట్టాడు. ఎంత చెప్పినా విన్లేదు. రాళ్ళు కొట్టే కాడ పెండ్లామును కొట్టేకాడ ఉండొద్దు పోరా అని మా అమ్మ కసిరింది. నేనొచ్చేశాను" అన్నాడు మహేశ్.

కాసింత దూరంలో వీధి లైట్ల కాంతిలో భర్తను తిడ్తూ...అపర కాళిలా చేతిలో తంబురను తీసుకొని వస్తోంది మంగమ్మ.

"ఇక నీతో కాపురం చేయను...మా ఇంటికి పోతాను. నేనేమి తప్పు చేశానని నన్ను కొట్టావు? నన్ను కూలికి పోయినప్పుడు పాడొద్దన్నావు. మనసు చంపుకొని సరేనన్నాను. నీ కూలి డబ్బుల్ని తాగేసి ఇంటికి రూపాయి తెచ్చేవు. నేను కూలికెళ్ళి డబ్బు దెస్తే నువ్వు తింటున్నావు. పాట నా ప్రాణం. ఇన్నాళ్ళు ప్రాణాన్ని బిగ పట్టుకొన్నాను. ఇప్పుడు వాళ్ళు పదిమందికి పనికొస్తుందంటే పాడుతున్నాను. తప్పా?" అని భర్తకు వినబడేటట్లు అరుస్తూ మంగమ్మ వచ్చేసింది. భర్త వెనకడుగు వేశాడు. మంగమ్మ మా దగ్గరకొచ్చేసరికి చల్లారిపోయింది. శాంతి స్వరూపిణిగా గోచరించింది.

"అన్నా! తత్వాలు పాడ్తాను రికార్డు చేసుకోండి" అంటూ తంబురాను శృతి చేసి పాడింది. పాటల్లో పడి భర్త కొట్టిన సంగతిని మరచిపోయి, మామూలుగా ఇంతకు క్రితం ఎలా పాడిందో అలా పాడింది.

**"గూట చిలకేదిరా చిన్నన్నా గూడు చినబోయెరా...ఎవరు చేసిన కర్మ వారనుభవింపక ఎవరికైనను తప్పదన్నా...తోలు తిత్తి యిది తూటులు తొమ్మిది తుస్సుమనుట కాయం, ఓ నరుడా తెలుసుకో అపాయం...చిలుక పలుకులు పలికితి నాకేమి తెలియు తత్వ రహస్యం"** అని మంగమ్మ యాగంటి తత్వాలు, బ్రహ్మంగారి తత్వాలు కూడా పాడింది.

"ఇక చాలమ్మా చాలా పొద్దుపోయింది" అన్నాడు భక్తవత్సలం.

"అక్కా! రేపట్నుంచి కూలి పనుల్లో పాటలుంటాయి" అంది మంగమ్మ. చుట్టూ నిలబడి పాటలను వింటున్న అమ్మలక్కలను చూసి. చుట్టుపక్కల అమ్మలక్కలు మొగుడ్ని వదలి పెట్టిందని బాధపడకుండా, రేపట్నుంచి పాటలుంటాయని సంతోషపడడం మాకు నచ్చలేదు. అనవసరంగా మా వల్ల దెబ్బలు తినింది. మొగుడికి దూరమైంది. పచ్చని కాపురంలో చిచ్చు పెట్టామేనని మేమంతా మౌనంగా బాధపడ్తూ వాడ నుంచి బయటకెళ్ళేటప్పుడు మంగమ్మ భర్త మా దగ్గరకొచ్చి నిలబడ్డాడు.

**"సార్! మీరైనా చెప్పండి! నాకు మంగమ్మంటే ప్రాణం. మంగమ్మ ఎవరి ముందైనా పాటలు పాడితే నాకు అసూయ కలుగుతుంది. అందుకే పాడకుండా చేశాను. బాగా ఆలోచించాక మంగమ్మే కరెక్టు అనిపించింది. నేను తప్పు చేశాను. ఇంకెప్పుడూ మంగమ్మ పాటకు అడ్డు చెప్పను...దేవుడి మీద ఒట్టు...రేపట్నుంచి కూలి పనుల్లో మంగమ్మ పాటలుంటాయి"** అని అందరి ముందూ చెప్పి క్షమించ మన్నట్లు మంగమ్మ చేయి పట్టుకొని ఇంటికి తీసుకెళ్ళాడు ఆమె భర్త.

పాటల మంగమ్మ కోయిలలా వయ్యారంగా భర్తతో వెళ్ళిపోయింది.



ISSN 2457-0796
UGC Care List Approved Journal
మూసీ మాసపత్రిక సంపుటి -25 : సంచిక - 9 (39) హైదరాబాద్ జులై : 2022

# నన్నయ భారతంలోని రెండు ఘట్టాలు – విలువల బోధన

**డా. కె.వి.యన్.డి. వరప్రసాద్,** సహాయ ఆచార్యులు, తెలుగుశాఖ, ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం.
**ఫోన్ : 94909 21345**

సాహిత్యమంటేనే స్థూలంగా విలువలతో కూడిన విద్య. సామాజిక అవసరాలవల్ల అఖండమైన విద్య శాఖోపశాఖలుగా విస్తరించి విలువలను విస్మరించింది. విలువలన్నీ సాహిత్యాన్ని ఆశ్రయించాయి. అందువల్ల సాహిత్యం విలువలతో మరింత చిక్కబడింది. కాబట్టి సమాజానికి హితాన్ని చేకూర్చడమే సాహిత్యం యొక్క మౌలిక లక్షణమయ్యింది. వేయి వసంతాలకు పూర్వం తెలుగు సాహిత్యానికి శ్రీకారం చుట్టిన నన్నయ భట్టారకులు విశ్వశ్రేయస్సు కోసమే సాహిత్యమని నమ్మి తన భావనను భారతంలో **"జగద్ధితం"** అని స్పష్టం చేశాడు.

**"యదిహాస్తి తదన్యత్ర యన్నే హాస్తి న తత్ క్వచిత్"** అన్న వ్యాస వచనంలోని పరమార్థమంతా జగద్ధితాన్ని సూచిస్తుందని విశ్వసించిన నన్నయ ఆయన భారత భాగములలో అన్నిచోట్ల ఆ నియమానికి కట్టుబడి ఉండడాన్ని గమనించాలి. ధర్మతత్త్వజ్ఞులకు భారతం ధర్మశాస్త్రంలాంటిదని నన్నయ అభిప్రాయం. అందుకే ప్రధాన కథలోనైనా, ప్రాసంగికంగానైనా, ఉపాఖ్యానాలలోనైనా, ఉద్దేశ పూర్వకంగానైనా సామాజిక విలువలకు పెద్ద పీట వేసి నన్నయ తన ప్రతిజ్ఞను నిలబెట్టుకున్నాడు.

నన్నయ విరచితమైన ఏ ఘట్టంలోనైనా సార్వజనీనతను ప్రదర్శిస్తూ, సామాజికతను స్ఫురింపచేశాడు. కథా భాగము చిన్నదే అయినా దాని నిండా సామాజికాంశాలు, సార్వజనీనతలు పుష్కలంగా గోచరిస్తాయి. ఈ సందర్భంగా రెండు చిన్న చిన్న విభిన్న ఘట్టాలలోని వ్యక్తుల ప్రవర్తనను, శీలాన్ని తులనాత్మక పరిశీలన చేయడం ద్వారా సార్వజనీన సామాజిక విలువలను మూల్యాంకనం చేయడం ఈ వ్యాస ప్రధానోద్దేశం.

**ఘట్టాలు :**

1. బ్రహ్మసభలో ఇక్ష్వాకు వంశపురాజైన మహాభిషుని అనుచిత ప్రవర్తన.
2. గంగాదేవి యెడల భరత వంశపురాజైన ప్రతీపుడి సముచిత ప్రవర్తన.

***గంగా మహాభిషుల గాథ :*** ఇక్ష్వాకువంశపు రాజు 'మహాభిషుడు' ధర్మస్వరూపుడై వేయి అశ్వమేధములు, నూరు రాజసూయములు చేసి స్వర్గానికి వెళ్ళాడు. ఒకనాడు బ్రహ్మ దర్శనానికి వెళ్లగా అదే సమయానికి గంగాదేవి బ్రహ్మసభకు వచ్చింది. ఆమె చీర గాలికి ఎగిరింది. అప్పుడు ఆమె ఊరుమూలం కనబడింది. ఆమెను దేవతలు చూడకుండా ముఖాలు పక్కకు త్రిప్పుకున్నారు. మహాభిషుడు మాత్రం ఆసక్తిగా చూశాడు. దీంతో బ్రహ్మ కోపించి, మహాభిషుని మానవస్త్రీకి పుట్టుమని శపించాడు. మహాభిషుడు భయపడి, తాను భూలోకంలో పుణ్యాత్ముడైన ప్రతీపునికి పుత్రునిగా పుడతాననీ, ఇతరులకు జన్మించలేననీ వేడుకొని అందుకు బ్రహ్మదేవుడి సమ్మతిని పొందడం అనేది ఈ ఘట్టంలోని ప్రధాన విషయం.

**మహాభిషుని గుణశీలముల పరిశీలన :** మహాభిషుని గురించి నన్నయ **"మహా ధర్మశీలుడై అశ్వమేధ సహస్రంబును, రాజసూయ శతంబును జేసి ఇంద్రాది దేవతలందనిపి"** అని చెప్పినాడు. ఈ వచనంలో భూలోకంలో ఉన్నప్పుడు ధార్మికుడైన మహాభిషుడు చేసిన యాగాది సత్కార్యాలు, ఇంద్రలోక వాసయోగ్యమైన సమున్నత స్థితిని పొందే అర్హత గలవాడు అనేది స్పష్టమౌతుంది. ఒక యజ్ఞం చేయడమే కష్టం. నూరు యజ్ఞాలు చేస్తే ఇంద్రపదవి.



పదకొండువందల యజ్ఞాలు చేస్తేనో, ఇక ఆ పుణ్య ఫలితం అక్షయం, అనంతం. ఇది మహాభిషుని ప్రథమ భూమిక.

ఇక రెండవ విషయంగా నన్నయ మహాభిషుని **"దేవ లోకంబునకుం జని యందు దేవర్షిగణంబులతో పితామహుం గొల్చుచున్న"** అని చెప్పినాడు. ముందు చెప్పిన పుణ్య ఫలితం వలన మహాభిషుడు దేవలోకవాస యోగ్యతను పొందాడు. దేవర్షులతో సమానంగా మసలే అర్హతను సంపాదించాడు. సృష్టికర్త దర్శనం చేసుకొనే గొప్ప యోగ్యతను పొందాడు. ఇది అనన్యసామాన్యమైన స్థితి. మనుషులందరూ పొందలేని సమున్నత స్థితి.

**మహాభిషుని అనుచిత ప్రవర్తన :** ఎంతగానో అహోరాత్రాలు కష్టపడి ఒక గొప్ప స్థితిని పొందడం సామాన్యమైన విషయంకాదు. లోకంలో చాలామంది చాలా



గొప్పగొప్ప స్థానాల్ని, పదవుల్ని పొందగలిగినా ఆ స్థితిని పూర్తిగా నిలుపుకోలేకపోవడం చూస్తున్నాం. ఏదో ఒక విధమైన అనుచిత కార్యానికి పాల్పడడం, పదవీచ్యుతులు కావడం, ఏదో ఒక శిక్షను అనుభవించడం జరుగుతుంది. పితామహుని దర్శన సమయంలో అక్కడికి వచ్చిన గంగను ఈ విధంగా చూడడం తటస్థించింది.

**ఊరుమూల మేర్పడఁగ నయ్యువిద వలపు**
**దొలఁగె ననిలంబుచేత విధూత మగుచు,**
**నమరు లెల్లఁ బరాఙ్ముఖులైరి, దాని**
**సాభిలాషుఁడై చూచె మహాభిషుండు. (భార. 1-4-123)**

ఇక మూడవ విషయం. బ్రహ్మదేవుడు మహాభిషుడు చేసిన అకృత్యాన్ని తెలుసుకొని అతడిమీద అమితంగా కోపించాడు. అంతే కాకుండా తన సన్నిధిలో అతడు చేసిన అనుచిత కార్యానికి ఫలితంగా “మర్త్యయోని యందు” పుట్టుమనుచు శాపమిచ్చాడు. ఈ సందర్భంగా బ్రహ్మ వాక్కులను నన్నయ కింది విధంగా చెప్పాడు.

**“ .......... కమలయోని వానికిఁ గర**
**మల్లి మర్త్యయోనియందుఁ బుట్టు**
**మనుచు శాపమిచ్చె ..............**
**................................” (భార. 1-4-124)**

**సామాజిక అనువర్తనము :** అది బ్రహ్మలోకము. అచట పితామహుడైన బ్రహ్మదేవుడున్నాడు. ఆయన దర్శనార్థం వచ్చిన దేవతలు, దేవర్షులు ఉన్నారు. అక్కడే మహాభిషుడున్నాడు. ఆయన భూలోకంలో గొప్పవాడు. ఆ ఘనత ఆధారంగా దేవలోకానికి వచ్చాడు. ఆయన దేవలోక నియమాలను, బ్రహ్మసన్నిధిలో ప్రవర్తించవలసిన తీరుకు ఏమాత్రమూ కట్టుబడలేదు. ఎంతటి మహానుభావుడైనా ఇతర ప్రదేశాలకు, ఉత్తములు లేక ఉన్నతుల వద్దకు వెళ్ళినప్పుడు అక్కడ కొన్ని నియమాల్ని పాటించవలసి ఉంటుంది. పెద్దల దగ్గర, గురువుల దగ్గర, దైవ సాన్నిధ్యంలోను అనుచిత ప్రవర్తన కూడదు అనే విషయాన్ని ఎప్పుడూ స్మృతి పథంలో ఉంచుకోవాలి. వందల యజ్ఞాలు చేసి ఇంద్రపదవికి అర్హతను సాధించినంతటి పుణ్యాన్ని పోగుచేసుకున్నాడు మహాభిషుడు. బ్రహ్మ సన్నిధిలో దేవతా స్త్రీ అయిన గంగను కామదృష్టితో కాంక్షించినాడు. తాను బ్రహ్మలోకమునందు ఉన్న సంగతిని, సాక్షాత్తు సృష్టికర్త సన్నిధిలో ఉన్న విషయాన్ని విస్మరించాడు. కనీసం తన ప్రక్కనే ఉన్న దేవతలు, ముఖాలను త్రిప్పుకోవడం కూడా చూడలేదు. యద్యదాచరతి శ్రేష్ఠః ... అన్నట్లు ఉత్తములైనవారి ప్రవర్తన అనుసరించదగినది అనే ఇంగిత జ్ఞానాన్ని కూడా గుర్తుచేసుకోలేదు. దీంతో ఎంత పుణ్యాత్ముడైనా బ్రహ్మశాపానికి గురికావలసి వచ్చింది.

ఇతర దేశాలలో ఉద్యోగాన్ని పొందే అన్ని అర్హతలతోను ఆయా దేశాలకు వెళ్ళి స్థిరపడిన తరువాత అక్కడి నియమ నిబంధనలను పాటించి తీరవలసిందే. అక్కడ నియమాలను ఉల్లంఘిస్తే పదవీ భ్రష్టుడై యథాస్థితికి తిరిగి రావలసిందే. చదువులాంటి సమస్త అర్హతలు ఉన్నా నైతికతతో కూడిన సామాజిక విలువలను సర్వకాల సర్వావస్థలలోను పాటించాలి అనే నియమం సార్వజనీనం అని గమనించాలి. అలా గమనించక, నియమాల్ని పాటించక ప్రవర్తిస్తే ఎవరికైనా మహాభిషుడికి పట్టిన గతే పడుతుంది. ఎంత గొప్పవాడైనా ఒక చిన్న అవగుణం ఉంటే మహాభిషుడిలా పతనం తప్పదు. ఉన్నత స్థితి కోరుకునే ఎవ్వరైనా ఉత్తమమైన ప్రవర్తనను సర్వదా కల్గి ఉండాలి అనే విలువలతో కూడిన సామాజికాంశం మహాభిషుడి విషయంలో చూడవచ్చు.

సామాజిక విలువలకు సంబంధించిన మరో అనుబంధ ఘట్టాన్ని పరిశీలిద్దాం. ఉత్తర జన్మలో శంతనుడిగా జన్మించబోయే మహాభిషుడికి తండ్రి కావలసిన ప్రతీపుని ధార్మిక జీవనానికి సంబంధించిన గాథలో ఒక మజిలి ఉంది. అది ప్రతీపుడి “యమనియమ వ్రతపరాయణతకు సంబంధించిన విషయం. ప్రతీపుడి ధార్మికతను నన్నయ ప్రసన్న కథనవిధానంతో రమ్యంగా తీర్చిదిద్దాడు.

**గంగా ప్రతీపుల గాథ :** ప్రతీపుడనే భరతవంశపు రాజు ధర్మదీక్షాపరుడై తపస్సు చేస్తూ ఉండగా గంగాదేవి ప్రత్యక్షమయ్యింది. ప్రతీపుని ఒడిలో విలాసంగా కూర్చొని తాను జహ్నుపుత్రికననీ, ప్రతీపుని సద్గుణాలకు మెచ్చి, అతనికి భార్యను అవుదామని వచ్చాననీ, తనను ప్రీతితో స్వీకరింపుమనీ, ప్రతీపుని కోరింది. భవిష్యత్ కథలో గంగా ప్రతీపులకు మహాభిషుడు శంతనుడై జన్మించడం విధి నిర్ణయం. అది ఐతిహాసిక విషయం. గంగ ప్రతీపుడి వద్దకు వచ్చినప్పుడు ఆమె రూపురేఖల్ని నన్నయ సందర్భోచితంగా చక్కగా అభివర్ణించాడు. ఈ సందర్భంలో నన్నయగారి గంగ ప్రతీపుని ముందు సాక్షాత్కరించిన తీరు పూర్తిగా మదన వాతావరణానికి అనుకూలం. ప్రతీపుడికి కావాలనే గంగ తన అందాలు ఒలకబోస్తూ కనువిందు చేయబోయింది. నన్నయ వర్ణించిన అప్పటి గంగ రూపం – గంగా సౌందర్య వర్ణన. ఇది మొదటి విషయం.

**గంగ నిజాంగదీప్తు లెసఁగం జనుదెంచి లతాంగి సంగతో**
**త్తుంగ పయోధర ద్వితయ తోయరుహానన చారునేత్ర ది**

**వ్యాంగన యై ప్రతీపవసుధాధిపు శాలవిశాల దక్షిణో**
**త్సంగమునందు మన్మథవశంబున నుండెఁ గరంబు లీలతోన్.**
**(భార. 1-4-135)**

**ప్రతీపుని ధర్మబద్ధత :** ప్రతీపుడికి ప్రత్యక్షమైన గంగ తన గురించి పరిచయం చేసుకుంటూ తనను వివాహమాడమని అభ్యర్థించడమనేది రెండవ విషయం. ఈ సందర్భంగా నన్నయ రాసిన పద్యం.

**ఏను జహ్నుకన్య నింద్రసమాన! నీ। సద్గుణావళులకు సంతసిల్లి**
**భానుతేజ! నీకు భార్యగా వచ్చితి। నిష్టమునఁ బరిగ్రహింపు నన్ను.**
**(భార. 1-4-137)**

తనను భార్యగా పరిగ్రహించమని చెప్పిన గంగతో ప్రతీపుడు ఈవిధంగా చెప్పాడు.

**అనినఁ బ్రతీపుఁ డిట్లనియెః 'నంబురుహానన యగ్నిసాక్షికం**
**బునఁ బరిణీత యైన సతిఁ బొల్పుగ నొక్కతఁగాని యన్యలన్**
**మనముననేనియుం దలఁపః మానిని! యిట్టి జితాత్ము నన్ను ని**
**ట్లని పలుకంగ నీ కగునె? యన్యులఁ బల్కినయట్ల బేల వై.**
**(భార. 1-4-138)**

అనడమే కాకుండా ఇంకా -

**....... "స్త్రీభాగం బయిన దాపలికుఱువెక్కక పురుషభాగంబై పుత్త్రారోహణ యోగ్యం బైన నావలపలికుఱు వెక్కితిగావున నాపుత్త్రునకు భార్యవగుమని"** (భార. 1-4-139) చెప్పడం ఆయన ధార్మిక ప్రవర్తనకు అద్దం పట్టినట్లయ్యింది.

ప్రతీపుడు అగ్నిసాక్షిగా పెండ్లాడిన భార్యనే కాని, ఇతర స్త్రీలను మనస్సులో సైతం తాను స్మరించననీ, ఆత్మనిగ్రహముగల తనను, ఆ విధంగా అడగడం న్యాయము కాదనీ, చెప్పాడు. అదీగాక, ఆమె స్త్రీలు కూర్చుండే ఎడమతొడపై కూర్చుండలేదనీ, పురుషులు కూర్చుండే కుడితొడపై కూర్చున్నదనీ, అందువల్ల ఆమెను తన కుమారునికి భార్యవు కమ్మనీ చెప్పాడు.

**సామాజిక అనువర్తన :** వివాహితుడైన వ్యక్తి సమస్త సుఖభోగాలతో సమృద్ధిగా జీవిస్తున్న ఏకాంతంలో కాంతలకు దాసుడయ్యే అవకాశం ఎక్కువగా ఉంది. మనిషి ఒంటరిగా ఉన్నప్పుడు, ఎవరూ చూడరు అని అనుకొన్నప్పుడు పరస్త్రీ సాంగత్యానికి వీలుచిక్కినప్పుడు అధార్మికతకు తొందరగా లొంగిపోతాడు. ప్రతీప మహారాజు తాను ఏకాంతంలో ఉండగా ఒక స్త్రీ వలచి వచ్చినా చలించని ధీరుడిలా ప్రవర్తించాడు. తప్పుచేయడానికి అవకాశం ఉన్నా ఒక రాజుగా దానికి ధర్మశాస్త్రానుమతి ఉన్నా ప్రతీపుడు అనుచితమైన ప్రవర్తనకు పూనుకోలేదు.

**మహాభిష ప్రతీపుల వ్యక్తిత్వాలు తులనాత్మక పరిశీలన :** అక్కడ గంగ దైవ సాన్నిధ్యానికి భక్తితత్పరతతో వచ్చింది. బ్రహ్మదేవుని దర్శనం



కోసం వచ్చింది. అనుకోని ఘటనగా గాలివలన ఆమె వస్త్రము తొలగింది. గంగను మహాభిషుడు సాభిలాషుడై చూశాడు. పెద్దల సన్నిధిలో అది అనుచితం. అక్కడ గంగ ప్రయత్నం లేదు. మహాభిషుడి ప్రయత్నం ఉంది.

ఇక్కడ ప్రతీపుడు గంగాతీరంలో ఏకాంతంగా ఉన్నాడు. గంగ ప్రతీపుడి వద్దకు కావాలని వచ్చింది. ఇక్కడ గంగ ప్రయత్నం ఉంది. ప్రతీపుడి ధర్మబద్ధమైన తిరస్కారం ఉంది. ఏకాంతంగా ఉన్న ప్రతీపుడు గంగ పట్ల ప్రవర్తించిన సముచితమైన వర్తనాన్ని కాలానికి సాక్షిగా సంప్రదాయ సాహిత్యం నిలబెట్టింది. విలువల విషయంలో మనిషి నలుగురిలోనూ ఒక విధంగా, ఎవరూ చూడకపోతే ఒకవిధంగా ప్రవర్తించకూడదు అనడానికి మహాభిషుడు, ప్రతీపుడు సర్వకాలాలలోను ప్రతీకలుగా నిలుస్తారు.

నియమబద్ధంగా జీవిస్తున్న ఒక అధికారి లేక ప్రభువు ధర్మబద్ధంగా జీవించాలి. అతనికి అందివచ్చే అవకాశాలు ఎన్నో ఉంటాయి. ముఖ్యంగా కాంతా,కనకాలు, ఆ రెండింటి విషయంలోనూ ముఖ్యంగా స్త్రీ విషయంలో ఏ విధమైన లోలత్వం ఉండకూడదు. వలచి వచ్చిన స్త్రీని కఠినంగాను, సున్నితంగాను కూడా తిరస్కరించవచ్చు. కాని కఠిన తిరస్కారం ఏదో ఒక విధమైన అనర్థాన్ని తెచ్చిపెడుతుంది. కాబట్టి చాలా సున్నితంగా తిరస్కరించాలి. ప్రతీప మహారాజు రెండో మార్గాన్ని అనుసరించాడు. వయసు తారతమ్యాన్ని పాటించాడు.

ప్రతీపుడు "రాజానాం బహువల్లభాః" అనే న్యాయాన్ని అనుసరించి, అందరు రాజులలానే అందివచ్చిన కన్యారత్నాలను చేజిక్కించుకునే అవకాశం ఉన్నా అది రాజధర్మాలకు విరుద్ధం కాని పద్ధతియే అయినా, తృతీయ పురుషార్థాన్ని కామోపభోగాలకు కాక "ప్రజాయై గృహమేధినాం" అని కాళిదాస మహాకవి చెప్పినట్లు సత్సంతాన ప్రాప్తికి మాత్రమే వినియోగించుకున్నాడు. పైగా ఆర్షధర్మమైన ఏకపత్నీ వ్రతాన్ని జీవితాంతము నిష్టగా నిర్వహించాడు. మన సంప్రదాయ సాహిత్యము విలువల పరిరక్షణను నిత్యమూ బోధిస్తోంది. స్త్రీలకు పాతివ్రత్యం, పురుషులకు ఏకపత్నీవ్రతాన్ని భారతీయ సనాతన ధర్మం ప్రతిపాదించింది. ఈ సార్వజనీనాంశానికి సామాజిక విలువలు తోడైతే సమాజము ఆరోగ్య ఐశ్వర్యాలతో విలసిల్లగలదని భావించవచ్చు. అనేకానేక కారణాలవల్ల అపరిచితులతో సంపర్కము కూడదు అనే నేటి మాటకు సంప్రదాయ సాహిత్యం అందించిన ధర్మబద్ధమైన జీవితానికి ప్రతీపమహారాజును ప్రతీకగా గ్రహించవచ్చు.

పైన పేర్కొన్న ఇద్దరూ గొప్పగొప్ప వంశాలలో జన్మించిన వారే. ఇరువురు స్వయంకృషితో ఘనతను సాధించి గొప్పగా కీర్తిని గడించినవారే. అన్నింటా సమస్కంధులే అయినా మొదటి వ్యక్తి స్త్రీలోలత్వాన్ని జయించలేకపోయినందువల్ల బ్రహ్మ శాపానికి గురయ్యాడు. రెండవ వ్యక్తి స్త్రీలోలత్వాన్ని జయించినందువల్ల విశుద్ధ వర్తనుడిగా కీర్తి గడించాడు. ధర్మబద్ధత విషయంలో ఇరువురికి చాలా తేడా ఉంది. చపలచిత్తుడు మహాభిషుడు. స్థిరచిత్తుడు ప్రతీపుడు. స్త్రీ విషయంలో ఇరువురి ప్రవర్తనను మహాకవి మనముందు నిలబెట్టాడు. దైవ దర్శనం కోసం వెళ్ళిన మహాభిషుడు ఆ పనిని మరచి మరో అనుచిత కార్యానికి పాల్పడ్డాడు. తపస్సు చేసుకుంటున్న ప్రతీపుడు పరస్త్రీవల్ల ఆటంకంకలిగే అవకాశం ఉన్నా తపస్సుకు భగ్నం కలుగుకుండా తన కర్తవ్యంపై ఏకాగ్రత దృష్టిని విడిచి పెట్టలేదు. కర్మాచరణలో ఏకాగ్రత ముఖ్యం, అంతకంటే శీల పరిరక్షణ మరింత ముఖ్యం అనే విషయాన్ని మహాభిష, ప్రతీప మహారాజుల ప్రవర్తనల ఆధారంగా గ్రహించవచ్చు. అదే సార్వజనీనత, సామాజికత.

మహాభిషుడిని పదకొండువందల యాగాల పుణ్యం కాపాడలేక పోయింది. కారణం చిన్న తప్పిదం. ఒక్కొక్కసారి చిన్న తప్పిదమే పెద్ద శిక్ష వేయిస్తుందనడానికి మహాభిషుడి కథనే తార్కాణంగా చెప్పుకోవచ్చు. నలుగురిలో నిస్సంకోచంగా, నిర్లజ్జగా మహాభిషుదు ప్రవర్తించాడు. నిజానికి సభ్య సమాజంలో నలుగురు ముందు తప్పు చేయడానికి వెనుకాడాలి. కాని మహాభిషుడు నిర్భయంగా తప్పుచేశాడు. అవకాశం ఉన్నా ప్రతీపుడు తప్పుచేయడానికి ఒప్పుకోలేదు. పైగా ఆమెను కోడలిగా సమాదరించాడు. మహాభిషుడి, ప్రతీపుడి ప్రవర్తనలలోని ఔచిత్య అనౌచిత్యాల్ని సంప్రదాయ సాహిత్యం చెప్పిన తీరును మూల్యాంకనం చేయాలి. అలా చేసినప్పుడే సంప్రదాయ సాహిత్యంలోని సార్వజనీనతను సార్వకాలికతను గుర్తించి చక్కని సమాజాన్ని నిర్మించుకోవచ్చు. ఈ విధంగా సాహిత్యాన్ని అధ్యయనం చేయడంవల్ల సాహిత్యం యొక్క పరమ ప్రయోజనం నెరవేరుతుంది.

---

## భగవద్గీత - తపస్సు

**దేవ ద్విజ గురు ప్రాజ్ఞ పూజనం శౌచ మార్జవమ్**
**బ్రహ్మచర్య మహింసా చ శారీరం తప ఉచ్యతే**

దేవతలను, బ్రాహ్మణులను, గురువులను పూజించడం, శారీరక, మానసిక శుచిత్వం, బ్రహ్మచర్యం, అహింస – ఇవి శరీరంతో చేసే తపస్సు అని చెప్పబడతాయి.

**అనుద్వేగకరం వాక్యం సత్యం ప్రియ హితం చ యత్**
**స్వాధ్యాయాభ్యసనం చైవ వాఙ్మయం తప ఉచ్యతే**

ఇతరుల మనస్సును నొప్పించననిది, సత్యములు, హితములు, ప్రియములును, అనుకూలమైన మాటలు, చదివిన వేద శాస్త్రములను అభ్యసించడం – వీటిని వాఙ్మయ తపస్సు అని చెప్పారు.

**మనః ప్రసాద స్సౌమ్యత్వం మౌన మాత్మ వినిగ్రహః**
**భావ సంశుద్ధి రి త్యేతత్ తపో మానస ముచ్యతే.**

మానసిక నిర్మలత్వము, నెమ్మదితనము, మౌనము, ఆత్మ (చిత్త) నిగ్రహము, భావ నైర్మల్యము – ఇవన్నీ మానసిక తపస్సు అని చెప్పారు.

**శ్రద్ధయా పరయా తప్తం తపస్త త్రివిధం నరైః**
**అఫలా కాంక్షిభిర్యుక్తైః సాత్త్వికం పరి చక్షతే**

శ్రేష్ఠమైన శ్రద్ధతో ఆచరించినది, పై మూడు విధములైనది, ఫలాపేక్ష లేకుండా మనస్సును నిలిపి వేసేది... అయిన తపస్సు సాత్త్విక తపమని చెప్పారు.

# విస్మృత జంటకవులు "బాబయ్య గుప్త – మచ్చ లక్ష్మయ్య"

**డా. పెబ్బేటి మల్లికార్జున్,** సహాయ ఆచార్యులు, నాగర్ కర్నూలు, ఫోన్: 9491881916

నా పరిశోధన నిమిత్తం ఉమ్మడి నల్గొండ జిల్లాలో క్షేత్ర పర్యటన చేస్తూ, భువనగిరి ప్రాంతానికి వెళ్ళినప్పుడు 'సైదాపురం' గ్రామానికి చెందిన లెక్కల మల్లారెడ్డి గారు, బాబయ్యగుప్తగారి కుమారుడు సంతోష్‌గారు వీరి గురించిన సమాచారం ఇచ్చారు. ఈ కవులు భువనగిరి దగ్గరలోని కాటేపల్లి గ్రామ వాస్తవ్యులు.

బాబయ్య గారు 1952లో చంద్రమ్మ సిద్ధయ్య దంపతులకు జన్మించాడు. కాటేపల్లికి దగ్గరలోని చాడ గ్రామంలో బాబయ్య పాఠశాల విద్యాభ్యాసం కొనసాగింది. అధ్యాపకుడిగా బాగాయత్, మిర్యాలగూడ, బీచ్‌మహల్లా, చందుపట్ల ప్రభుత్వ పాఠశాలల్లో పని చేశారు. లక్ష్మయ్యగారు కూడా ఇదే పాఠశాలలో విద్యాభ్యాసం చేశారు. బ్రతుకుదెరువు కొరకు 1970 ప్రాంతంలో బొంబాయి వెళ్లి చేనేత పని చేసుకుంటూ బ్రతికాడు. 1980 ప్రాంతంలో తిరిగి వచ్చి నేతపని చేసుకుంటూ స్వగ్రామంలో జీవనాన్ని కొనసాగించాడు. బాబయ్య, లక్ష్మయ్యలిద్దరూ 1980 నుండి 3 శతకాలను జంటకవులుగా రచించారు. 1) సాయినాథ శతకం, 2) మిత్ర శతకం, 3) శ్రీ వేంకటేశ్వర శతకం. 'కాటెపల్లిలో నున్న దుర్గమ్మతల్లి' అనే మకుటంతో 35 పద్యాలు గల రాతప్రతి కూడా లభించింది. వీరి రచనలన్నీ అముద్రితాలుగా ఉన్నాయి.

మచ్చ లక్ష్మయ్యగారు బ్రతుకుదెరువు నిమిత్తం బొంబాయి వెళ్లి చేనేత కార్మికుడిగా పని చేస్తూ, అక్కడి చేనేత కార్మికుల దుస్థితిని, చేనేత గొప్పదనాన్ని అప్పుడప్పుడు పద్యాలుగా రాశాడు. వీటిని 'నేత కళ' పేరుతో బొంబాయిలోని వివేక గ్రంథాలయం వారు 1978లో ముద్రణ వేశారు. బయటి రాష్ట్రంలో ముద్రణ పొందడం, లక్ష్మయ్యగారు తెలంగాణాకు వచ్చేటప్పటికి ఆ ప్రతులు తన దగ్గర లేకపోవడంతో ఇక్కడ కవిగా గుర్తింపు రాలేదు. నేతపని యొక్క నైపుణ్యాన్ని, వర్ణనను క్రింది పద్యంలో చూడవచ్చు.

**సీ. జలధిలో చంద్రిక జలకమాడిన రీతి –**
**పాలార బోసిన భంగిమగను**
**ఉదయ భానుని యొక్క రుధిరమయూఖముల్ –**
**గగన లలాటంబు కరిగినట్లు**
**వినువీథితారలు మినుకు మినుక్కను –**
**అవనికి జేరుదామనినయట్లు**
**జీమూతములను పరామర్శ జేయుచు –**
**దనదారి జంద్రుండు జనినయట్లు**
**యిన్ని భంగిమల్ నేతలో నిమిడియుండి**
**కన్నులకు పండుగలు జేసి కాంక్షదీర్చు**
**యెన్న తరమౌనె చేనేత నెవరికైన**
**భళిరె! ధీశాలి! బలిశాలి! పద్మశాలి**

**సాయినాథ శతకం**

వీరిద్దరి మొదటి రచన 'సాయినాథ శతకం'. ఇది 'జగతినేలుచు రక్షించు సాయినాథ' అనే మకుటాన్ని కలిగి ఉంది. ఈ శతకంలో ఆధ్యాత్మిక అంశాలతో పాటు నీతిని, సందేశాన్ని ఇచ్చిన పద్యాలున్నాయి. ఇందులో 108 పద్యాలున్నాయి.

**కలిమి గల్గినా గర్వంబు కలుగకుండ**
**పదవినెక్కినా నీతిని వదలకుండ**
**ప్రజలలో త్యాగ భావంబు పరిఢవిల్ల**
**జగతి నేలుచు రక్షించు సాయినాథ (అముద్రిత ప్రతి – పద్యం15)**

**బ్రతుకు దెరువును జూపియు నీతినేర్పి**
**జ్ఞాన జ్యోతిని వెల్గించు జ్ఞానులైన**
**గురువును గౌరవించెడి గుణము పెంచి**
**జగతి నేలుచు రక్షించు సాయినాథ (అముద్రిత ప్రతి–పద్యం 102)**

**మిత్రశతకం**

వీరి రెండవ రచన 'మిత్ర శతకం'. సమాజానికి మిత్రుడిగా మంచిని బోధించడంతో పాటు వీరి స్నేహానికి గుర్తుగా కూడా 'మిత్రశతకం' అని పేరు పెట్టారు. ఇందులో 108 పద్యాలున్నాయి.

'మిత్రమా' అనే మకుటంతో పద్యాలున్నాయి. ఇవి అన్నీ నీతిని, సందేశాన్ని పంచుతున్నవే.

**"భారములు కావు కష్టములు, భారముగాదు విచారమొంతయున్**
**భారముకావు నిందలును, భారము పేదతనంబు కాదుగా**
**భారములన్నీ దీర్చగ ప్రభాతమునందున విఘ్నరాజునే**
**కోరియు పూజ సేయుదువకుంఠిత దీక్షబూని మిత్రమా!"**

**"మంచికి నీవు ముందుపడు, మానవతంబుకు నీవు నిల్వు ఏ**
**వంచన సేయకుండగ పగవారలకైనను మేలుచేసి నీ**
**మంచితనము చాటు మన మానవజాతిని మేలుకొల్పగా**
**పంచుము జ్ఞానమిక, పరుల బాధలు తీర్చగలపూను మిత్రమా"**

**శ్రీ వేంకటేశ్వర శతకం**

'సుంకిశాలలవాస! వేంకటేశ! అనే మకుటంతో ఈ శతకంలో 108 పద్యాలున్నాయి. నల్గొండ జిల్లాలోని వలిగొండ మండలం పరిధిలోనున్న సుంకిశాలలో గల వేంకటేశ్వరుడిని స్తుతిస్తూ,

ISSN 2457-0796
UGC Care List Approved Journal
మూసీ మాసపత్రిక సంపుటి -25 : సంచిక - 9 44 హైదరాబాద్ జులై : 2022

సమాజంలోని రుగ్మతల్ని, చెడు అలవాట్లను, ఆలోచనలను మార్చవలసిందిగా ప్రార్థిస్తూ రాసిన పద్యాలు ఇవి.

**"స్వార్థపరత పెరిగి సంఘమ్మునందున**
**సుఖ శాంతులన్ని శూన్యమాయె**
**మంచి దారిలోన మనుజులన్ నడిపించు**
**సుంకిశాలవాస! వేంకటేశ!" (పద్యం-5)**

**"భక్తిశ్రద్ధ గలిగి బాబయ్య లక్ష్మయ్య**
**అనెడిమేము శతకమును రచించి**
**నీకె అంకితమ్ము నిచ్చితిమోస్వామి (పద్యం-108)**

'తెలంగాణ కవులకు కీర్తికాంక్ష ఉండదు' అనే మాటలు ప్రచారంలో ఉన్నాయి. ఈ మాటలకు ప్రత్యక్ష నిదర్శనం ఈ జంట కవులు. తాము రాసిన శతకాలను వేదికలపైన చదివి, ముద్రణ వేసుకొని మెప్పు పొందాలని భావించలేదు. తమ భావాలను, ఆలోచనలను పద్య రూపంలోరాసి, ఆనందం పొందారు. అందుకే వీరు మరుగునపడిన కవులుగా మిగిలిపోయారు. వీరిద్దరూ ఒకే గ్రామంలో, ఒకే సంవత్సరంలో జన్మించడం, ఒకే పాఠశాలలో సహ విద్యార్థులుగా విద్యనభ్యసించడం, తమ భావాలకు జంట కవులుగా పద్యరూపం ఇవ్వడం, ఒకే సంవత్సరంలో (2015) కాలం చేయడం ఒక వింత, అరుదైన సంఘటన. నిజమైన జంట కవులకు ప్రతి రూపం. వీరి రచనలు సాహిత్య ప్రపంచంలోకి రావలసిన అవసరం ఉంది.

## జీవన గీతం



ఇప్పుడు నేను ఒక జీవన గీతాన్ని
వర్తమానానికి గతానికి భవిష్యత్తుకు దారి దీపాన్ని
నేను పైనిస్తూనే ఉంటాను పదిమందికి ఒక కొత్త బాటగా
ఆలోచనలు పల్లవిస్తూనే ఉంటాయి చిగురుటాకులై
నేను ఎన్ని వసంతాలను చూడలేదు
ఎన్ని శిశిరాలను వీక్షించలేదు
అవకాశవాదపు బాట వైపు ఎంతమంది సాగలేదు
ధరల రాశిని తట్టుకోవడం సామాన్యునికి ఒక జీవన సమరం
కన్నీటి పర్యంతం నేటి ఆకాశపు విహారం చేస్తున్న ధరలు
పెట్రోల్ మంటలు మండుతున్నాయి
కూరగాయలు గాయాలు చేస్తున్నాయి
ఏం తినేటట్టు లేదు ఏం కొనేటట్టు లేదు
చేసిన కూలి మిగిలేటట్టు లేదు
జీవితం అత్యంత దుఃఖభరితం
బ్రతుకులో సుఖాల జాడను లేనే లేదు
నిరంతరం వేదనల కొలిమిలో నిలబడటమే
అప్పుల భారంతో నడ్డి విరిగి చిక్కి కంకాలమై
ఇప్పుడు బాధల నదిలో ఈదుతున్నాడు
విషాద సముద్రాన్ని దాటిపోవాలనే ప్రయత్నం
సుఖాల తీరంలో ఆవలనైనా సుఖంగా ఉండాలని ఆరాటం
ఈవలి నుండి ఆవలి తీరానికి
ఒంటరి పడవలో ప్రయాణం చేసి సాగిపోవాలని ఒకటే ప్రయాస
అక్కడనైనా మంచి ఉంటుందని ఆశతో....



**డా. సిహెచ్ ఆంజనేయులు**
ఖమ్మం, ఫోన్ : 770 253 7453

ISSN 2457-0796 UGC Care List Approved Journal
మూసీ మాసపత్రిక సంపుటి -25 : సంచిక - 9 (45) హైదరాబాద్ జులై : 2022

# తెలంగాణ మాండలికంలో జంట పదాలు

**డా. సి.హెచ్. చంద్రయ్య,** పరిశోధకులు, హైదరాబాద్. ఫోన్ : 9441 671 609

తెలంగాణ మాండలికంలోని జంటపదాలు ఒక భావాన్ని ఎదుటివారి గుండెకు హత్తుకునేలా చెప్పటానికి అవ్యవధానంగా ఉపయోగిస్తారు. రెండు పదాల కలయికను జంటపదం అంటారు. ఈ రెండు పదాలకు అవినాభావ సంబంధం ఉంటుంది. ఇందులో రెండు భిన్న పదాలు ఉంటాయి. ఒకే పదం రెండుసార్లు ఆవృత్తి కాదు. రెండు పదాలు చెప్పడం వల్ల చెప్పదలుచుకున్న అర్థానికి బలం వస్తుంది. ఒంటి పదంతో చెబితే తేలిపోయే అర్థం వల్ల బరువు సంతరించుకుంటుంది. జంటపదాలలో ద్వంద సమాసాలు ఉంటాయి. ఉభయ పదార్థ ప్రధానం ద్వంద సమాసాలు. ఒకే పదం రెండుసార్లు వచ్చే ఆమ్రేడితాలు ఉంటాయి. సాధారణంగా ప్రజలు సౌందర్య ప్రియులు అందువల్ల తమ మాటలతో శబ్ద అలంకారంలో యతి ప్రాసలను దొర్లిస్తారు. సహజంగా అంత్యానుప్రాస యమకం వారికి చాలా ఇష్టమైనది. కనుక సమానార్థకాలు కాకపోయినా కొంత సంబంధం ఉన్న అంత్యానుప్రాసతోనో, యతితోనూ బిగిస్తారు. జంటపదాలను వర్గీకరించినట్లయితే పూర్వ పదానికి అర్థం ఉండి పరపదానికి అర్థంలేని జంట పదాలు, పూర్వ పదానికి అర్థం లేక పరపదానికి అర్థం ఉండే జంట పదాలు, పూర్వ పదాలకు అర్థం ఉన్న జంట పదాలు వ్యతిరేకార్థక జంట పదాలు, పూర్వ పర పదాలకు అర్థంలేని జంట పదాలు. రెండు పదాలకు ఒకే అర్థం ఉన్న జంట పదాలు.. అన్యదేశ జంట పదాలు కూడా ఉంటాయి. అన్య దేశాలలో ఎక్కువగా హిందుస్థానీ పదాలు ఉన్నాయి. జంట పదాలు ఇలా తెలంగాణ మాండలికంలో అన్ని రకాల జంట పదాలు ఉంటాయి.

**1. పూర్వపర పదాలకు సమానార్థాలు ఉన్న జంట పదాలు :** ఇవి ప్రధానంగా ద్వంద సమాసాలు. ఇవి ఉభయ పదార్థం ప్రధానమైనవి. ఈ పదాలకు రెండు పదాలు అనగా పూర్వపదం, పరపదం రెండు కూడా సమానార్థాలు ఉంటాయి. పురుళ్ళు పుట్టెంటికలు, గారెలు బూరెలు, ఇల్లు వాకిలి, అవ్వ బిడ్డలు, ఈకలు తోకలు, వనకడు జనకుడు.

***పురుళ్ళు పుట్టెంటుకలు :*** ప్రథమ కేశఖండనం, నామకరణం. పురుడు అంటే పుట్టిన బిడ్డకు ఇరవై ఒక్కరోజులకు చేసే కార్యక్రమం పుట్టెంట్టుకలు అంటే కేశఖండనం. ఉదాహరణకు ఆమె కొడుక్కు పురుళ్ళు పుట్టెంటుకలు చేసింద్రా.

***గారెలు బూరెలు :*** ఇవి భక్ష్య విశేషాలు. గారెలు సంక్రాంతికి చేస్తారు, బూరెలు ఉగాదికి చేస్తారు. బంధువుల ఇంటికి వెళ్లి వచ్చినప్పుడు ఇలా అంటారు. "మరి చుట్టాల ఇంటికైతే పోయినావు గారెలు బూరెలు ఏమైనా చేసారా" అని అడుగుతారు.

***ఇల్లు వాకిలి :*** ఇల్లు అనగా ఇంటిని మరియు ఇంటిముందు ఉండే స్థలాన్ని ఇల్లు వాకిలి అంటారు. రాయలసీమలో వాకిలి అంటే తలుపు. వివాహ సంబంధాలు కుదుర్చుకునే సమయంలో పదాలను వాడతారు. ఉదాహరణకు "వాడికి పిల్లను ఇస్తా అంటున్నావు కానీ ఇల్లు వాకిలి ఉందా? లేదుగా అంటారు".

***అవ్వ బిడ్డలు :*** అవ్వ బిడ్డలు అనగా తల్లి కూతుర్లు. తెలంగాణాలో తల్లిని అవ్వ అంటారు. కూతురును బిడ్డ అంటారు. తల్లీకూతుర్లు ఎటైనా పోయి వస్తుంటే ఇలా అంటారు "అవ్వ బిడ్డలు ఎక్కడకు పోయి అస్తురు".

***ఈకలు తోకలు :*** ఈకలు అంటే పక్షి ఈకలు కావు, ఈకలు అంటే చిక్కుడు జాతికి చెందిన వంటివి కూర వండాలంటే, గోరుచిక్కుడు, చిక్కుడు వాటిని తుంచి నారలను చీల్చుతారు. వీటినే ఈకలు అంటారు. తోకలు అంటే జంతువుల తోకలు కాదు. ఇక్కడ అర్థం, కూరగాయల చివర్లు ఉదాహరణకు కాకరకాయకు కొసలకు ఉండే తోకలాంటివాటిని తోకలు అంటారు. రెండింటిని కలిపి ఈకలు తోకలు అంటారు.

***వనకడు జనకడు :*** భయపడక పోవటం. ఆయన ఎవ్వలు చెప్పిన ఇనడు. ఎవ్వలకి భయపడడు వెనకడు జనకడు.

**2. పూర్వ పదానికి అర్థం ఉండి పరపదానికి అర్థంలేని జంట పదాలు :** ఈ జంట పదాల్లో ఒక జంటపదంలో మొదటి పదానికి అర్థం ఉంటుంది. రెండో పదానికి అర్థం ఉండదు. ఈ జంట పదాలు ఉభయపదార్థం ప్రధానం కాదు. మొదటి పదానికి అర్థం ఉండి, రెండో పదానికి అర్థం ఉండదు, ఇవి కూడా తెలంగాణ జన బాహుళ్యంలో చాలా కనిపిస్తాయి. మొదటి పదం అర్థం రెండో పదానికి వర్తిస్తుంది. అగ్గువ సగ్గువ, పిల్లజల్ల, మందుమాకు, అడ్డం దిడ్డం, సాటుకునేటుకు,అడుగుబొడుగులు ఉస్కేమస్కే మొదలైనవి.

***అగ్గువ సగ్గువ :*** తక్కువ ధర, తక్కువ విలువ. ఆ అంగట్ల అన్ని అగ్గువ సగ్గువ వస్తాయి. అంగట్లో బట్టలు అగ్గువ సగ్గువ వస్తాయి.

***పిల్ల జల్ల :*** యోగ క్షేమాలు అడిగినప్పుడు పిల్లలు బాగున్నారా మంచిగున్నారా అని అంటారు. అదే ఇతరుల గురించి అయితే మన ఊరి మంగమ్మ వాళ్ళ పిల్ల జిల్ల బాగున్నారా అంటారు.

***మందు మాకు :*** చెట్ల మందులు ఇతర మందులు, ఒక రకమైన జాతికి చెందిన పాములు కాటు వేసినప్పుడు మందు మాకు ఏమీ ఉండదు అని చెప్పే సందర్భంలో ఆ పాము కాటేస్తే మందు మాకు ఏది ఉండదు అంటారు.







***అడుగులు బొడుగులు :*** అనగా చివరకు మిగిలినవి. ఉదాహరణకు రంగయ్య వడ్లన్ని అయిపోయినంక వచ్చిండు. ఆయనకు ఏమైనా అడుగులు బొడుగులు ఏమైనా ఉంటే పెట్టు అని యజమాని అంటాడు.

***అడ్డం దిడ్డం :*** సరిగా పని చేయకపోవడం. ఉదాహరణకు పనోళ్ళు పని చేయమంటే అడ్డం దిడ్డం చేసి పోయిండ్రు. వానికి పని చేయమని అప్పచెప్పితే అడ్డదిడ్డంగా మాట్లాడుతుండు.

***ఉస్కె మస్కె :*** వడ్లు, బియ్యంలో ఇసుకను ఏరివేయడం. రేషన్ బియ్యం వచ్చినాయి కదా ఎట్లున్నాయి, మంచిగానే ఉన్నాయి కానీ కొంచెం ఉస్కె మస్కె చేసుకొని పట్టించుకోవాలి (ఆడించాలి).

**3. పూర్వ పదానికి అర్థం లేక పరమపదానికి అర్థం ఉన్న జంట పదాలు :** ఈ జంట పదాలు కూడా రెండవ పదం యొక్క అర్థం మొదటి పదానికి వస్తుంది. చిల్లం కల్లం, అలాయ్ బలాయ్, ఆలన పాలన, వావి వరుస, అన్నెం పుణ్యం, సీదా సాదా.

***చిల్లం కల్లం :*** కుప్పగా ఉన్న గింజలు ఇతర పదార్థం విసిరినట్లుగా చేయడం, లేదంటే చిల్లం కల్లంగా ఉన్న వడ్లను దగ్గర చేయి. అడ్లన్నీ చిల్లం కల్లం జేసిండు పిల్లగాడు.

***అలాయ్ బలాయ్ :*** ఆత్మీయ ఆలింగనం, కౌగిలించుకోవడం. ఉదాహరణకు వాళ్లు పండుగలప్పుడు కలుసుకుని అలాయ్ బలాయ్ తీసుకుంటారు.

***ఆలనా పాలనా :*** పెంపకంలో అన్ని రకాలుగా చూసుకోవటం. ఉదాహరణకు కొండయ్య ఆలనా పాలన అంతా వాళ్ళ మేనత్త జూసుకుంటుంది.

***వావి వరుస :*** మానవ సంబంధమైన వరుసలు లేకపోవటం. ఉదాహరణకు వాళ్లకు వావి వరుసలు లేవు అక్క బిడ్డను పెళ్లి చేసుకుంటారు. అక్రమ సంబంధాలకు వావివరుసలు ఉండవు.

***అన్నెం పుణ్యం :*** ఏమీ ఎరుగని, ఏమీ తెలియని. ఉదాహరణకు అరెరే పిల్లగాన్ని ఎందుకు కొడుతున్నారు. అన్నెం పుణ్యం ఎరుగనోడు వాడు.

**4. ఒకే అర్థం గల జంట పదాలు :** ఇందులో ఉన్న రెండు పదాలకు ఒకటే అర్థం ఉంటుంది. పూర్వపర పదాలకు ఏకార్థం ఉంటుంది. ఉభయ పదార్థం ఒక్కటే అంటే రెండు పదాల అర్థం ఒక్కటే. కలి గంజి, గొడ్డు గోదా, భూమి జాగా, రాయి రప్ప, ఊరు పల్లె.

***గొడ్డు గోదా :*** జంతువులు జీవాలు, ఇక్కడ గొడ్డు అన్న ఆవు, గోదా అన్న ఆవు. కానీ ఇక్కడ గొడ్డు గోదా అనే పదాన్ని బహువచనంలో ఉపయోగిస్తారు. ఏకవచనంలో ఉపయోగిస్తారు. ఉదాహరణకు ఈ కాలంలో గొడ్డు గోదా లేని ఊళ్లు చాలా ఉన్నాయి. దొరలకు పాతకాలంలో గొడ్డు గోదా బాగా ఉండేవి

***భూమి జాగా :*** భూమి అనగా స్థలం ల్యాండ్. జాగ అంటే స్థలం, భూమి జాగా అనేది అన్యదేశ్యం. కిత్త జాగ హై అంటారు. అంటే ఎంత స్థలం ఉంది అని అయితే భూమి జాగా రెండింటి అర్థం ఒక్కటే స్థలం. ఉదాహరణకు పల్లెటూర్లో భూమి జాగా లేనివాడు అంటూ ఎవలు ఉండరు. ఆ దొరకు భూమి జాగా మస్తుగా ఉన్నది.

***కలి గంజి :*** కలి అంటే కుండలో పులియబెట్టిన గంజి మరియు ఓర్పు అంటే బియ్యం కడగాగ వచ్చిన నీరు. ఓర్పు మరియు గంజి కలిపితే కలి గంజి అవుతుంది. గంజి అనగా బియ్యాన్ని ఉడికించేటప్పుడు వచ్చేది. అందుకే కలి గంజి అని రెండు పదాలు ఒకటే అర్థం వస్తుంది. ఉదాహరణకు పాపం వాళ్ళు కలో గంజో తాగి బతికిండ్రు.

**5. వ్యతిరేకార్థక జంట పదాలు :** ఈ జంట పదాలు వ్యతిరేకంగా ఉంటాయి. వీటి అర్థాలు వ్యతిరేక అర్థాన్నిచ్చే రెండు పదాలు జంట పదాలుగా కూర్చబడతాయి. ఈ పదాల మధ్య వ్యతిరేక అవినాభావ సంబంధం ఉంటుంది. పూర్వ పదానికి పర పదం ఎప్పుడూ వ్యతిరేకార్థంలో ఉంటుంది. పోరీ పోరడు, ఇయ్యాల రేపు, అచ్చుడు పోవుడు, ఆకలి దూప, ఆకులు పోకలు, సాటుకు నెటుకు, కానీ పోనీ, ఉన్నట్లు లేనట్లు.

***పోరీ పోరడు :*** ఆడపిల్ల మగ పిల్లవాడు పోరీ పోరడులో పోరి అంటే అమ్మాయి. అలాగే పోరడు అంటే పిల్లవాడు అని అర్థం. తెలంగాణలో పోరీ పోరడు అనే పదం చాలా సాధారణం. ఉదాహరణకు అక్కడ పోరీ పోరడు గొడవ పడ్డుర్రు.

***ఇయ్యాల రేపు :*** ఈరోజు రేపు, ఉదాహరణకు ఇయ్యాల రేపు రోజులు మంచిగా లేవు నమ్మేట్టు లేదు.

***ఆకలి దూప :*** ఆకలి దప్పిక దాహం, సమయానికి బువ్వ నీళు

లేకపోవటం, ఇంటికి చుట్టాలు వస్తే అన్నం నీళ్లు అరుసుకోవాలి అంటారు. ఉదాహరణకు ఆయన ఎప్పుడు కలిసినా ఆకలి దూప అనడు.

***అచ్చుడు పోవుడు :*** అచ్చుడు అంటే రావటం పోవుడు అంటే పోవడం. ఉదాహరణకు చంద్రయ్య కాళ్ల నొప్పులు రావడంతో నడవలేక ఇంటికీ అచ్చుడు పోవుడు తగ్గించిండు అంటారు. మీతో లొల్లి పెట్టుకున్నారు కదా ఇంటికి అచ్చుడు పోవుడు ఉన్నదా!.

***ఆకులు పోకలు :*** ఆకులు అంటే తమలపాకులు పోకలు అంటే వక్కలు. ఆకులు మెత్తగా ఉంటాయి, పోకలు గట్టిగా ఉంటాయి. ఉదాహరణకు పెండ్లిలల్లా ఆకులు పోకలు అందుకుంటారు కదా. ఆకులు పోకలు లేకపోతే నడవదు ఎప్పుడు ఆకేసుకుంటాడు.

**6.పూర్వ పదాలకు అర్థంలేని జంట పదాలు :** పూర్వ పదానికి గాని, పర పదానికి గాని రెంటికి కూడా అర్థం ఉండదు. పూర్వ పదాలు వేరు వేరు ఉంటే అర్థం స్ఫురించదు. రెండు జంట పదాలుగా ఉంటేనే అర్థం స్ఫురిస్తుంది. ఆదర బాదర, దడ్డర బుడ్డర, ఇయ్యర మయ్యర, అగ్గేడ బెగ్గేడ, ఎటమటం, అగులు బుగులు, అల్లిబిల్లి, చెంగి బెంగి, కాయి పాయి, ఆగం ఆగం.

***ఆదరబాదర :*** ఏది పట్టించుకోకుండా ఏది తీసుకోకపోవటం. ఉదాహరణకు ఆమె జల్ది రమ్మన్నది అదర బదరగా వచ్చిన.

***దడ్డర బుడ్డర :*** అనగా అపసవ్యంగా క్రమము లేకుండా పని చేయడం. ఉదాహరణకు రామన్నకు పని చెపితే అడ్డర బుడ్డర చేసి వచ్చిండు.

***కాయి పాయి :*** అనగా అన్ని వస్తువులతో కూడిన భోజనం చేయడం. ఉదాహరణకు వారికీ ఒకప్పుడు ఏమీ లేకుండా ఇప్పుడు అంతా కాయి పాయి తింటుండ్రు.

***ఇయ్యర మయ్యర :*** అనగా ఎలా వీలు అయితే అలా చేయడం. ఉదాహరణకు వాడు దొంగతనం జెసిండు ఇయ్యర మయ్యర జంపురి (కొట్టు) ఎలా వీలైతే అలా కొట్టు అని అర్థం.

***ఎటమటం :*** అంటే కొంచెం క్లిష్టంగా ఉండటం. ఉదాహరణకు రాజన్నకు పైసలు ఇయ్యాలె ఎల్లుత లేదు. ఎటమటంగా ఉంది.

***అగులు బుగులు :*** అంటే భయం. ఉదాహరణకు మా ఊరికి పోయివచ్చినప్పటి నుంచి అంతా అగులు బుగులు ఐతంది. అంటే ఒక విధమైన మానసిక సంక్షోభం.

***అల్లిబిల్లి :*** వంకరటింకర. ఉదాహరణకు ఆ ఆవు పిల్ల అల్లిబిల్లి ఆడుతుంది. కుక్క పిల్ల అల్లిబిల్లి ఆడుతుంది. అంటే ఒక రకంగా సయ్యాట ఆడటం అని అర్థం.




***ఆగం ఆగం :*** తొందర పెట్టడం. ఉదాహరణకు మెల్లగా పోదాం ఆగం ఆగం చేయకు, ఆగం ఆగం చేసి పైసలు పొడగొడితివి.

**7. ఒకే పదం రెండుసార్లు వచ్చే జంట పదాలు :** ఇవి ఇవి ఆమ్రేడితాలు. ఒకే పదం రెండుసార్లు వస్తే అది ఆమ్రేడితం అవుతుంది. ఇందులో ఎక్కువగా ధ్వన్యనుకరణ పదాలు ఉంటాయి, ఇతర పదాలు కూడా ఉంటాయి. తుళ్ళు తుళ్ళు, గీద గీద, దవ్వ దవ్వ, కట కట, కుట కుట, ముల ముల, సర సర, పుల్కు పుల్కున, గుబ గుబ, గడబిడ, బోమ్ బోమ్, అడి ఈడి, పరం పరం

***తుళ్ళు తుళ్ళు :*** నుజ్జు నుజ్జు చేయడం, అక్కడ టక్కర్ అయ్యింది బండి అంతా తుళ్ళు తుళ్ళు అయ్యింది.

***గీద గీద :*** చిన్న పిల్లలను నడువు అనడానికి ఈ జంట పదం వాడతారు ఉదాహరణకు గిద గిద నడువు అంటారు.

***దవ్వ దవ్వ :*** నడిచేటప్పుడు తొందరగా నడువు అనడానికి ఈ జంట పదం వాడతారు. ఉదాహరణకు దవ్వ దవ్వ నడువు తొందరగా పోవాలే.

***కుట కుట :*** గడ బిడ ఉదాహరణకు ఈ జంట పదాన్ని వంట వండేటప్పుడు అన్నం ఉడికేటప్పుడు అన్నం కుట కుట అంటుందా అంటారు. కడుపులో కుట కుట అంటుంది అంటారు. జీర్ణం కానప్పుడు ఈ జంట పదం వాడతారు.

***ముల ముల :*** దురద పెట్టినప్పుడు ఈ పదం ఉపయోగిస్తారు. ఉదాహరణకు అంతా ముల ముల పెడుతుంది అంటారు.

***సర సర :*** తొందరగా నడువు అనడానికి ఈ పదం వాడతారు. ఉదాహరణకు సర సర నడువు ఆలస్యం అవుతుంది అంటారు.

***పుల్కు పుల్కున :*** ఈ జంట పదాన్ని ఏడవడానికి ఉపయోగిస్తారు. ఉదాహరణకు ఆమె అత్త తిట్టిందని పుల్కు పుల్కున ఏడుస్తుంది.

***బొమ్ బొమ్ :*** అంత ప్రచారం చేయడం. ఆయన అంతా బొమ్ బొమ్ చేసిండు. అందరికీ తెలిసింది. చెప్పకూడని విషయాన్ని తెలియ జెప్పడం.

***అడి అడి :*** కుక్కలను కొట్టడానికి అడి అడి అంటారు. ఉదాహరణకు కుక్క వచ్చింది అడి అడి (వెళ్ళిపో).

**8. అన్యదేశ్య జంటపదాలు :** ఈ రకమైన జంట పదాలలో అన్యదేశ్య పదాలలో ఉంటాయి. ఇందులో ఎక్కువగా హిందుస్థాని పదాలు ఉంటాయి. అలగ్ సలగ్, ఉల్టా పల్టా, అడ తేడ, సీదా సాదా, అర్కత్ బర్కత్, అగ్గడ్ బగ్గాడ్.

***అలగ్ సలగ్ :*** ఏకాంతంగా లేదా ఒక్కరే లేదా గ్రూపుగా వెళ్లి తినడం, తాగడం లేదా పని చేసుకోవడం చేస్తారు. ఉదాహరణకు అలాగ్ సలగ్ పోయి చాయ్ తాగి వస్తున్నారు.

***ఉల్ట పల్ట :*** తీరు మారుగా ఉండటం, ఈ జంట పదాలు వ్యతిరేకంగా ఉంటాయి. ఉదాహరణకు ఓరారి అంగిని ఉల్టా పల్ట చూసుకొని వేసుకోలేదా సరిగేసుకో అంటారు.

***అడ తేడ :*** సక్రమంగా లేకపోవటం సరిగా లేకపోవడం. ఉదాహరణకు ఆ తోవ్వ అంతా అడ తేడా ఉంది సరిగా లేదు.

***అర్కత్ బర్కత్ :*** కలిసి రాకపోవడం. ఉదాహరణకు పంట మొత్తం తీసిన కొంచెమే వచ్చింది. అర్కత్ బర్కత్ లేని కాలం.

***గరం గరం :*** వేడి వేడి. ఉదాహరణకు చాయి బాగా గరం గరంగా ఉండాలే.

***సీద సాదా :*** సాధారణంగా సహజంగా ఉండటం. ఆమె చాలా సీద సాదా మనిషి. ఇలా జంట పదాలలో చాలా రకాలుగా విభజించవచ్చు. ఇవే కాకుండా చాలా చాలా సహజంగా ఉండే జంట పదాలు కూడా ఉన్నాయి.

**ఆధార గ్రంథాలు**

1.శ్రీనివాస రావు, పి. ఎస్. 1985. "తెలుగులో జంట పదాలు", హైదరాబాదు, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం.

2.సుబ్రహ్మణ్యం వడ్ల, 2004 "తెలుగు జంట పద నిఘంటువు" హైదరాబాదు, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, నిఘంటువు నిర్మాణ శాఖ.

3. వెంకటేశ్వరరావు. నార్ల., 1959. "పదబంధ పారిజాతం" హైదరాబాదు, ఆంధ్ర సారస్వత పరిషత్, తిలక్ నగర్.

4. రాధాకృష్ణ బుధరాజు 2004 "తెలుగు మాండలికాలు కరీంనగర్ జిల్లా, తెలుగు అకాడమీ, హిమాయత్ నగర్, హైదరాబాద్.

---

# అగ్ని

**భార్యా వియోగః స్వ జనాపవాదః ఋణస్య శేషం కృపణస్య సేవాః**
**దారిద్ర్య కాలే ప్రియదర్శనం చ, వినాగ్నినా పంచ దహన్తి కాయమ్**

శరీరమును అగ్ని కన్నా అధికంగా దహించివేసేవి ఐదు. 1. భార్యావియోగం 2. స్వజనాపవాదం 3. ఋణ శేషముండటం 4. నీచత్వ సేవ 5. ప్రియ దర్శనంలో దారిద్ర్యముండటం.... అనేవి, అగ్ని లేకనే శరీరాన్ని దహించి వేస్తాయి.

నిరంతరం సంతాప జనకాలు ఆరు. అవి... 1. కుగ్రామవాసం 2. దుర్జన సేవ 3. అభక్ష్య భోజనం 4. నిరంతరం క్రోధోద్దీపితయగు భార్య 5. మూర్ఖుడైన పుత్రుడు 6. వితంతు (పుత్రిక) ఇంట ఉండడం ... అనేవి ఆరు కూడా, అగ్ని లాగా దహింప చేసే నిరంతరం బాధాగ్నులు.

కట్టెలో ఉండే అగ్ని, తనని ఆశ్రయించిన కట్టెనే దహించిన దానికన్న మిన్న అయింది క్రోధాగ్ని. ఎందుకంటే అది తనని, తన వారిని, సంఘాన్ని కూడా దహింపజేస్తుంది అది. మిక్కిలి హానికమైంది.

**చితా చింతాద్వయోర్మధ్యే చింతానామ గరీయసి**
**చితా దహతి నిర్జీవం చింతా ప్రాణయుతం వపుః**

చితా అంటే అగ్ని; చింతా అంటే దిగులు. "చితా, చింత" అనే ఈ రెండింటిలో చింతయే పెద్దది. భయంకరమైనది. అనగా 'చితా' ప్రాణం లేని దానిని కాలిస్తే చింత ప్రాణమున్న మనిషినే దహించి వేస్తుంది.

ISSN 2457-0796 UGC Care List Approved Journal
మూసీ మాసపత్రిక సంపుటి -25 : సంచిక - 9 (49) హైదరాబాద్ జులై : 2022

# అపూర్వ సంస్కృతాంధ్ర శతావధానం

**డా. బోచ్కర్ ఓం ప్రకాశ్,** జక్రాన్ పల్లి, నిజామాబాదు, ఫోన్: 9441 955 998

**28. 06. 2022**

**శ్రీ లలితాదిత్య శతావధానం మొదటి రోజు**

అవధానికి ధార ధారణతో పాటు ధైర్యం కూడా ఉండాలని, ధైర్యం లేకపోతే ఎంత పాండిత్యమున్నా ఉపయోగం ఉండదనీ అని ధారణా బ్రహ్మరాక్షస, పద్మశ్రీ పురస్కృతులు డా. గరికిపాటి నరసింహారావు అన్నారు. జూన్ 28 నుండి 30 వరకు హైదరాబాదు బొగ్గులకుంటలో జరుగుతున్న అమెరికా నివాసి శతావధాని శరచ్చంద్ర, కాలకంత గన్నవరం లలితాదిత్య శతావధానం ఆరంభ సభలో ఆయన విశిష్ట అతిథిగా గరికిపాటి పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అష్టావధానం కష్టం, శతావధానం మరీ కష్టం, సహస్రావధానం అపూర్వమనీ, అత్యాధునికమైన క్రికెట్ వంటి క్రీడలు కూడా అవధానం ముందు తీసికట్టేనని చెప్పారు అన్నారు. అవధాని ఎప్పుడూ ధైర్యంగా ఉండాలనీ, ఎటువంటి ప్రశ్ననైనా ఎదుర్కొనేందుకు సదా సిద్ధంగా ఉండాలని సూచించారు. అవధానం కూడా యుద్ధం వంటిదేనని అవధాని విమర్శలకు, ప్రశంసలకు కూడా లొంగిపోరాదని ఆయన అన్నారు. తమ పద్యాలతో సభను అలరించారు.

అవధాని లలితాదిత్యకు పద్యాశీస్సులందిచారు శతావధాన కార్యక్రమాన్ని శుభారంభం చేస్తూ శతావధాన సారథ్యసంఘం అధ్యక్షులు, తెలంగాణా రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు డా. కె.వి. రమణాచారి గారు మాట్లాతూ అమెరికాలోఉంటూ, ఏరోస్పేస్ ఇంజనీరింగ్ చదువుతూ కూడా మరో ప్రక్క మన భారతీయ సంస్కృతిని నిలబెట్టడంకోసం శృంగేరీ జగద్గురువులు పరమపూజ్య భారతీతీర్థ స్వామివారి వద్ద శిష్యరికం చేస్తూ శారదాంబ అనుగ్రహంతో నేను సైతం అంటూ సంస్కృతాంధ్ర భాషలలో శతావధానం చేయడం స్ఫూర్తిదాయకమని అన్నారు. ఈ సందర్భంగా లక్షమంది చదువుకున్న వారుంటే అందులో ఒక్కరు పండితుడుంటాడని, అలాంటి వెయ్యిమంది పండితులలో ఒక్కరు కవీశ్వరుడు ఉంటాడని, అలాంటి కవీశ్వరులలో నూటికి ఒక్కరు అవధానిగా ఉంటాడన్న తిరుపతి వేంకట కవుల పద్యాన్ని గుర్తు చేసుకున్నారు.

ప్రముఖ సినీనటులు, దర్శకులు తనికెళ్ళ భరణి అవధానిని శాలువాతో సన్మానించి శుభాశీస్సులు అందించారు. తొలి ఆశువు పృచ్ఛకుడుగా ఆయన ప్రసిద్ధ 'యాస్యత్యద్య శకుంతలేతి హృదయం సంస్పృష్టముత్కంఠయా" అనే కాళిదాసు శ్లోకానికి తెలుగులో పద్యం అడుగగా అవధాని గన్నవరం లలితాదిత్య సరళసుందరమైన తెలుగులో అప్పటికపుడు అనువదించి పద్యం చెప్పారు.




ప్రారంభ వేదికకు కోలాచల మల్లినాథ వేదికగా నామకరణం చేశారు. ప్రారంభసభ అనంతరం మాడభూషి వేంకటాచార్య వేదికగా జరిగిన సభలో 3 నిషిద్ధాక్షరి, 24 సమస్యాపూరణ, 12 దత్తపదులు, 5 ఆశువు అంశాలలో మంది పృచ్ఛకులు సంస్కృతాంధ్ర భాషలలో ప్రశ్నలు సందించగా నిషిద్ధాక్షరిలో రెండు పాదాలు, సమస్యాపూరణలో ఒక పాదం, దత్తపదులలో రెండు పాదాలను చెప్పారు. మిగతా పాదాలను 29వ తేదీన పూరిస్తారు.

ఉదయం 8.45 నిముషాలనుండి మధ్యాహ్నం 2 గంటల వరకు జరిగిన కార్యక్రమంలో అధ్యక్షులుగా శతావధాని డా. జి.యం. రామశర్మ, శతావధాన సంచాలకులు శ్రీరంగాచార్య, శతావధాని ఆముదాల మురళి, దర్శనమ్ పత్రిక ప్రధాన సంపాదకులు ఎం.వి.ఆర్. శర్మ పాల్గొన్నారు. తెలంగాణా గురుకుల విద్యాలయాల విశ్రాంత ప్రధానాచార్యులు మరుమాముల దత్తాత్రేయ శర్మ సభను నిర్వహించారు. గంటి నగేష్ సభా ప్రారంభంలో శంఖనాదం వినిపించారు. లిభారత పూర్వ ప్రధాని, శ్రీ పి.వి. నరసింహారావు గారి జన్మదినం సందర్భంగా పి.వి. చిత్రపటానికి నివాళులు అర్పించారు.

తిరిగి మధ్యాహ్నం 3గంటల నుండి.. 8:30 వరకు తిరుపతి వేంకట కవుల వేదికగా సభ నిర్వహించారు. ప్రతి వేదికను ఆమహావధానుల పరిచయమాలికను రసరమ్యంగా ఆయా మహావధానుల సుప్రసిద్ధ పద్యాలతో మధురాలాపనతో సభను అలరించారు పద్యకోకిల, అష్టావధాని డాక్టర్. బోచ్కర్ ఓమ్ప్రకాశ్.

ఈ సభకు గౌరవఅతిథిగా శతావధాని ఐతగోని వేంకటేశ్వర్లు పాల్గొన్నారు. ఈ సభలో 12 దత్తపదులకు రెండుపాదాలు, 24 వర్ణనాంశాలలో ఒక పాదం, 5 ఆశువులను అవధాని పూరించారు.

సద్యస్ఫురణతో ఝటితిస్ఫూర్తితో సాగుతున్న శతావధాన శరచ్చంద్ర శ్రీ గన్నవరం లలితాదిత్య శతావధానంలో తొలిరోజు

అంశాలలో 3 నిషిద్ధాక్షరులలో తొలిరెండు పాదాలను, 24 దత్తపదులలో తొలి రెండుపాదాలను, 24 వర్ణనలలో ఒక్కొక్క పాదాన్ని అవధాని పూరించారు. 10 ఆశువులను పూర్తి చేశారు. శతావధాని ఆముదాలమురళి గారు విశిష్ట పృచ్ఛకులుగా వర్ణన అంశంలో పాల్గొన్నారు.

తెలంగాణా రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రధాన ప్రజా సంబంధాల అధికారి శ్రీ వనం జ్వాలానరసింహారావు గారు ప్రత్యేక అతిధిగా పాల్గొని అవధాని గారిని అభినందించి ఆశువు అడిగారు.

తొలిరోజు ముగింపు సభలో అష్టావధాని ధూళిపాళ మహదేవమణి గారు గన్నవరం లలితాదిత్య అవధాన ప్రస్థానాన్ని వివరించారు. ఇంకా ఈ సభలో సంస్కృత శతావధాని శ్రీ దోర్బల ప్రభాకర శర్మగారు, అచ్చ తెలుగు శతావధాని కుదురాట గండ శ్రీ పాలపర్తి శ్యామలానందప్రసాద్ గారు, శతావధాని శ్రీ రాంభట్ల పార్వతీశ్వర శర్మ, అమెరికా కేలిఫోర్నియాకు నివాసులైన అష్టావధాని మైలవరపు సాయికృష్ణ, అమెరికా నివాసులు ఇంద్రగంటి వెంకట్ గారు పాల్గొని అవధానిని అభినందించారు. మరుమాముల దత్తాత్రేయ శర్మ గారు తొలిరోజు సభకు ముగింపువాక్యాలు పలికారు ఆరోజు కార్యక్రమం డా బోచ్కర్ ఓమ్ప్రకాశ్ అష్టావధాని సమీక్షించారు.

**రెండవరోజు 29.06.2022**

హైదరాబాద్ బొగ్గులకుంటలోని తెలంగాణ సారస్వత పరిషత్ దేవులపల్లి రామానుజరావు కళా మందిరంలో జూన్ 28న ప్రారంభమైన శతావధాన శరచ్చంద్ర శ్రీ గన్నవరం లలితాదిత్య శతావధానం రెండవరోజు 29.06.2022 బుధవారం సద్యస్ఫురణతో ఝుఠితిస్ఫూర్తితో సాగింది.

శతావధాన నిర్వహణ కమిటీ గౌరవాధ్యక్షులు, తెలంగాణా రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు డా. కె.వి. రమణాచారి ప్రత్యేక అతిథిగా పాల్గొని గౌరవ అతిథులు డా. పాలపర్తి శ్యామలానంద ప్రసాద్, డా. ధూళిపాళ మహదేవమణి గార్లను సత్కరించారు

**రెండవరోజు ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటలవరకు**

లికొప్పరపు కవుల వేదికగాలి సాగిన అవధాన సభకు గౌరవ అతిథిగా అచ్చతెలుగు శతావధాని, కుదురాట గండ డా. పాలపర్తి శ్యామలానంద ప్రసాద్ పాల్గొన్నారు. విఖ్యాత సాహితీవేత్త శ్రీరంగాచార్య సంచాలకత్వంలో సాగుతున్న ఈ అవధాన సభలో 3 నిషిద్ధాక్షరులలో చివరి రెండుపాదాలు, 24 సమస్యాపూరణలలో చివరి రెండు పాదాలు, 12 దత్తపదులలో చివరి రెండుపాదాలను అత్యద్భుత ధార, ధిషణ, సద్యస్ఫురణలతో అవధాని పూర్తి చేశారు. 7 ఆశువు అంశాలకు పూర్తి పద్యాలను అప్పటికప్పుడే అవధాని వినిపించారు.

**తిరిగి మధ్యాహ్నం 3 గంటల నుండి**

శిరిశినహళ్ కృష్ణమాచార్య వేదికలో ప్రారంభమైనది. ఈ సభకు అభినవ వాల్మీకి, ప్రవచన రాజహంస ధూళిపాళ మహదేవమణి గారు గౌరవ అతిథిగా విచ్చేసారు. ఈ సభలో దత్తపదులలో మిగిలిన చివరి రెండుపాదాలను, 24 వర్ణనలలో రెండవ మూడవ పాదాలను వేగవంతంగా అవధాని పూరించారు. 3 ఆశువు అంశాలకు అవధాని సమాధానమిచ్చారు.

పండితులు, ఉభయభాషా కోవిదులు శ్రీ రంగి సత్యనారాయణ గారు రసస్ఫోరకంగా చమత్కార సంభాషణతో అప్రస్తుతం నిర్వహించారు.

**మూడవరోజు – ఉదయం10నుండి 1గం. వరకు**

శతావధాని విఠాలచంద్రమౌళిశాస్త్రి వేదికగా మిగిలిన కొన్ని పూరణలు, ఆశువు లు రమణీయ శైలిలో ఆశువుగా చెప్పారు శతావధాని లలితాదిత్య శతావధాన పూరణలన్ని రసరమ్యంగా పూరించారు.

మధ్యాహ్నం భోజన విరామం తరువాత పృచ్ఛకుల స్పందనలను అనేకులు ఎంతో ఆనందతుందిమైన హృదయాలతో అందించారు.

**ధారణాసభ**

సి.వి.సుబ్బన్న వేదికగా జరిగిన శతావధాన ధారణ సభలో అవధాని శ్రీ గన్నవరం లలితాదిత్య... 3 నిషిద్ధాక్షరి పూరణలు, 24 సమస్యాపూరణలు, 24 దత్తపది పూరణలు, 24 వర్ణన పద్యాలను మొత్తం 75 పద్యాలను 32 నిముషాల 15 సెకెన్లలో ఏ మాత్రం తడుముకోకుండా పూర్తి సాధికారికతతో అత్యంత వేగవంతంగా అవధాని శతావధాన పద్యాలను ధారణ చేశారు

**జూన్28 నుండి 30 వరకు**

జరిగిన గన్నవరం లలితాదిత్య శతావధానం దిగ్విజయంగా పూర్తయిన సందర్భంగా గురువారం భాగ్యనగరం బొగ్గులకుంటలోని తెలంగాణ సారస్వతపరిషత్ లో గౌరీభట్ల – గుమ్మనగారి వేదికగా సాయంత్రం 6గంటలకు

జరిగిన విజయోత్సవ సభలో అసమాన ద్విభాషా పాండిత్యంతో, అత్యద్భుతమైన ధారణాశక్తితో, సద్యస్ఫురణతో శతావధానాన్ని దిగ్విజయంగా పూర్తి చేసిన శతావధాని గన్నవరం లలితాదిత్యను తెలంగాణా రాష్ట్రప్రభుత్వ సలహాదారు డా. కె.వి. రమణాచారి, ముఖ్యమంత్రి ప్రజాసంబంధాల అధికారి శ్రీ వనం జ్వాలా నరసింహారావు, శతావధాన సంచాలకులు శ్రీరంగాచార్య, శ్రీ పి.వి. మనోహరరావు, శాసనమండలి సభ్యురాలు సురభి వాణీదేవి, శాసనమండలి సభ్యులు శ్రీ కూర రఘూత్తం రెడ్డి దర్శనమ్ ప్రధాన సంపాదకులు మరుమాముల వెంకటరమణ శర్మ, తెలంగాణ గురుకుల పాఠశాలల విశ్రాంత ప్రధానాచార్యులు మరుమాముల

దత్తాత్రేయశర్మ, 8 మంది శతావధానులు, వేలేటి మృత్యుంజయశర్మ, బగళాముఖీ పీఠాధిపతులు శాస్త్రుల వేంకటేశ్వర్లు, వేదపండితులు జనమంచి సీతారామశర్మ తదితరుల సమక్షంలో శతావధాని శతధృతి బిరుదుతో సత్కరించారు. ఈ సందర్భంగా అవధానిని దుశ్శాలువా, గజమాల, ముత్యాలహారం, జ్ఞాపిక, తలపాగా, సన్మానపత్రాలతో సన్మానించారు.

అవధానిని సన్మానించిన అనంతరం తెలంగాణ శాసనమండలి సభ్యులు శ్రీ కూర రఘూత్తంరెడ్డి మాట్లాడుతూ.. లలితాదిత్య ధారణా ప్రతిభను చూసి తనను తాను మరిచిపోయానని, తన్మయత్వం చెందానని, ఈ కార్యక్రమంలో పాల్గొనడం తన అదృష్టమని అన్నారు. చిన్నవయసులోనే ఇంతటి ప్రతిభను ప్రదర్శించిన లలితాదిత్య అష్టావధానం అంటే ఏమిటో తెలియని నేటి పిల్లలకు ఆదర్శమని, తల్లిభాషను ఏవిధంగా కాపాడుకోవాలో ఆచరించి చూపించారని అన్నారు.

తెలంగాణా ముఖ్యమంత్రి ప్రజాసంబంధాల అధికారి వనం జ్వాలానారసింహారావు మాట్లాడుతూ 22 ఏళ్లకే అమెరికాలో ఉంటూ కూడా శతావధానం చేయడం అంటే చాలా శ్రమించి ఉంటారని, అలాంటి లలితాదిత్య వందల వేల మంది లలితాదిత్యలను తయారు చేయాలని అభిలషించారు.

తెలంగాణా శాసనమండలి సభ్యురాలు సురభి వాణీదేవి మాట్లాడుతూ...

ఇంతమంది అవధానులమధ్య మాట్లాడడమంటే తాను సాహసం చేస్తున్నట్టే నని అంటూ ... అవధానానికి తెలుగుభాషలో ఎంతో ప్రత్యేకమైన స్థానం ఉందని, బి.ఎ. లో తెలుగు చదివిన తనకు అవధానం అంటే చాలా ఇష్టమని అన్నారు. అష్టావధానం, శతావధానం, సహస్రావధానం మొదలైన ప్రక్రియలను నిర్వహించడమంటే అద్భుతమని అన్నారు.

తన కుమారుని వయసు ఉన్న అవధాని సరస్వతీ పుత్రుడని, అమెరికాలో ఉంటూ, అంతరిక్ష జ్ఞానాన్ని అభ్యసిస్తూ కూడా ఇలాంటి శతావధానాన్ని చేయడమంటే అత్యద్భుతమని, ఈ యువ అవధానికి ఆకాశమే హద్దని ప్రశంసించారు.

యూ ట్యూబ్ లోనూ, సాంకేతిక తెరలలోనూ మునిగి ఉండే ఈ తరం పిల్లలకు స్ఫూర్తి నిచ్చేలా ఈ శతావధానం సాగిందని అన్నారు తెలంగాణా ప్రభుత్వ సలహాదారు డా.కె.వి.రమణాచారి మాట్లాడుతూ...

మూడు రోజులుగా నవ యువ శతావధాని గన్నవరం లలితాదిత్య పద్యాలను శ్లోకాలను అప్పుచెప్తుంటే ఎంతో అబ్బురపడ్డానని, 32 నిముషాలలో ధరణ చేయడం చూస్తున్నప్పుడు ఒక్కొక్క పదాన్ని అవధాని పలుకుతున్న తీరు చూసి తనకు కళ్లల్లో నీళ్ళు వచ్చాయని అన్నారు.




ఈ శతావధానం వల్ల సారస్వత పరిషత్ పేరు సార్థకమైందని అనేకమంది పూర్వ అవధానులను స్మరిస్తూ వారి పేర్లను పలు వేదికలకు ఉంచడం ఎంతో స్ఫూర్తిదాయకమని అంటూ భవిష్యతులో ఇటువంటి కార్యక్రమాలకు జనం తండోపదండాలుగా రావాలని అన్నారు. ఈ సందర్భంగా నభూతో న భవిష్యతి అన్న రీతిగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన దర్శనమ్ పత్రిక అధినేతలు మరుమాముల సోదరులు వెంకటరమణ శర్మ, దత్తాత్రేయ శర్మలను అభినందించారు.

శతావధాన సంచాలకులు శ్రీరంగాచార్య అవధానిని ప్రశంసిస్తూ... ఈ అవధానం తెలుగువారి పురాకృత పుణ్యవిశేషంగా భావిస్తున్నానని, అంతరించిపోతున్న తెలుగు భాషా గౌరవాన్ని పునరుద్దీపితం చేసే విధంగా అవధానం సాగిందని అన్నారు

శతావధానం చేయడమంటే మాటలు కాదని, అలాగే నిర్వహించడమంటే మరింత కష్టమని అందుకు దర్శనమ్ సోదరులు మరుమాముల వేంకటరమణ శర్మ, మరుమాముల దత్తాత్రేయశర్మలను అభినందిస్తున్నానని గన్నవరం లలితాదిత్య అవధాన గురువులు శ్రీ ధూళిపాళ మహదేవమణి అన్నారు. అదేవిధంగా శ్రీ రమణాచారి గారు ధారణసభకు ముందే విచ్చేసి అవధానం పట్ల తమ మక్కువను ప్రదర్శించడం గొప్ప విషయమని ఆయన అన్నారు.



ధారణ అనంతరం జరిగిన శతావధాన విజయోత్సవ సభలో తెలంగాణా రాష్ట్రప్రభుత్వ సలహాదారు డా. కె.వి. రమణాచారి, ముఖ్యమంత్రి ప్రజాసంబంధాల అధికారి శ్రీ వనం జ్వాలా నరసింహా రావు, శతావధాన సంచాలకులు శ్రీరంగాచార్య, శ్రీ పి.వి. మనోహరరావు, శాసనమండలి సభ్యురాలు సురభి వాణీదేవి, దర్శనమ్ ప్రధాన సంపాదకులు మరుమాముల వెంకటరమణ శర్మ, తెలంగాణ గురుకుల పాఠశాలల విశ్రాంత ప్రధానాచార్యులు మరుమాముల దత్తాత్రేయశర్మ, 8 మంది శతావధానులు – (డా. దోర్బల ప్రభాకర శర్మ, డా. జి.యం. రామశర్మ, శ్రీ ధూళిపాళ మహదేవమణి, డా. పాలపర్తి శ్యామలానంద ప్రసాద్, శ్రీ గండ్లూరి దత్తాత్రేయశర్మ, శ్రీ ఆముదాల మురళి, రాంభట్ల పార్వతీశ్వర శర్మ, శ్రీ ఐతగోని వేంకటేశ్వర్లు) – పసర్ల శ్రీవల్లి సుబ్బలక్ష్మి, శంకరమఠం కృష్ణారావు,

అష్టావధాని డాక్టర్ బోచ్కర్ ఓమ్ప్రకాశ్, మంచినీళ్ళ సరస్వతీ రామశర్మ, పంతుల విట్టుబాబు, అవధాని సురభి శంకరశర్మ, రంగి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

**"నమోఽవధాన సరస్వత్యై సుకవితా యద్యస్తి రాజ్యేన కిమ్"**

**అవధాని లలితాదిత్య గారు చేసిన పూరణలు...**

**సమస్య ..**

**వెన్నెల గ్రుమ్మరించె కడు ప్రేమను భానుడు నేల జేరుచున్!!**

ఉన్నతమైన తూర్పు గిరినుండి జగమ్మును నిద్రలేపి, సం
పన్నము జేసి పద్మినుల పంక్తిని, విప్రకృతార్యజాతమో
జన్నిరసించిన యంధతమసమ్ము, రచించియు కాలబుద్ధి ది
వ్వెన్నెల గ్రుమ్మరించె కడు ప్రేమను భానుడు నేల జేరుచున్ !

2 – దత్తపది **మృదువు, పదును, కదనం, సదనం...గాయత్రీ మాత గళంలో మాలగా ..చెప్పాలి**

సదనము సాంధ్యభానుకరసప్తకగర్భితమండలమ్ము,నీ–
కదనము మామకీనజపయత్నపురస్కృతమంత్రమాలికల్
మృదువుగ మూడు పాదముల మించుచు దాగు చతుర్థపంక్తికా–
స్పదు,నుతియించు కౌశికుని భావమునందలి తల్లి గొల్చెదన్!!

3– వర్ణన సంస్కృత భాష లో

కాళిదాసు నాడు కుమార సంభవంలో "అస్త్యుత్తరస్యాం దిశిదేవతాత్మా" అన్నారు కదా! మరి నేటి హిమాలయ వర్ణన చేయండీ...

అస్త్యుత్తరస్యాం దిశి సైనికాత్మా
దుర్గాధిపో నామ హిమాలయాద్రిః
పూర్వాపరం దేశయుగం విగాహ్య
స్థితః పృథివ్యా ఇవ రక్షావర్మ

4– ఆశువు సరస్వతీ దేవి ప్రార్థన ...

కబరీబంధములోని నైల్యమును వీకన్ గప్పి దంతచ్ఛదా–
నిబిడారుణ్యతిరోహితిన్ సలిపి ప్రార్ణీతశుక్లత్వమున్
సబబున్ జేయుచు వాగ్వధూటిముఖమన్ సౌధాంతస్థాయినుల్
విబుధప్రార్థనలందు హాసలతికల్ ప్రేష్ఠంబులన్ పూచెడిన్

**ఏది కవిత...**

కవిత ప్రభావం ఉల్లాసమో! వేదనయో
ఏదో ఒక నేపథ్య స్వరం! స్వనిస్తుంది సూక్ష్మంగా
పాత నంటి కొత్త ప్రవేశంతో జీవన ప్రవాహం
ఎప్పటికీ అవసరమైన అనుభవ సుందర రూపం

(మాదిరాజు రంగారావు)



ISSN 2457-0796 UGC Care List Approved Journal
మూసీ మాసపత్రిక సంపుటి -25 : సంచిక - 9 (53) హైదరాబాద్ జులై : 2022

# వినిపించే విజ్ఞానసర్వస్వం కిరణ్ ప్రభ టాకీ షో

**బి. మదన్‌మోహన్ రెడ్డి,** పరిశోధక విద్యార్థి, హైదరాబాదు కేంద్రీయ విశ్వవిద్యాలయం, ఫోన్ : 9989894308



శ్రవణం ఓ గొప్ప కళ. **"మంచి వక్తవి కావాలంటే మంచి శ్రోతవయ్యుండాలన్న"** ఆర్యోక్తి ఇందుకు ప్రతీక. తొలినాళ్ళలో విద్యాభ్యాసమంతా శ్రవణ మాధ్యమంలోనే జరిగేది. ఈ భావనలోనే వేదాలను 'శ్రుతులు' అన్నారు. 'డిజిటల్ విప్లవం' అంకురించక ముందు శ్రవణ మాధ్యమమైన రేడియోనే ప్రధాన మాధ్యమం. ఇప్పటికీ ఇతర మాధ్యమాల ప్రభావాన్ని తట్టుకొని ఎన్నో 'రేడియో స్టేషన్లు', 'టాకీ షో'లు శ్రోతల్ని ఆకట్టుకొంటున్నాయి. ఎన్నో దృశ్య మాధ్యమాల పోటీని తట్టుకొని నేటికి సినిమా, రాజకీయ 'ప్రచారాలు', వినోదం, సాహిత్యం... మొదలైన సమాచారం ప్రజలకు చేరువ చెయ్యడానికి వాహకాలుగా నిలిస్తున్నాయి. కొత్తతరం పాఠకులు పుస్తకాలు చదవడానికి సమయలేమికి ప్రత్యామ్నయంగా ఎన్నో 'టాకీ అప్స్', 'టాకీ షో'లు పుట్టుకొచ్చాయి. తెలుగునాట అటువంటి టాకీ షోలలో అగ్రశ్రేణిగా పేర్కొదగినది 'కిరణ్ ప్రభ' టాకీ షో.

సహజంగా **'కిరణ్ ప్రభ టాకీ షో'** అనేది తన పేరు మీదుగానే ఆరంభించారు అని చాలామంది పొరబడుతుంటారు. వాస్తవానికి ఆయన అసలు పేరు ప్రభాకర్ రావ్. ఈయన కృష్ణాజిల్లాలోని శ్రీకాకుళానికి దగ్గరలో ఉండే ఒక మారుమూల గ్రామంలో సామాన్య మధ్యతరగతి ఇంట జన్మించారు. బాల్యంలోనే తల్లిదండ్రులు గ్రంథాలయంపై మక్కువ పెంపొందించుకొనేలా చేశారు. తత్ఫలితంగా పాఠశాల దశలోనే సాహిత్యంపై అభిలాష ఏర్పడింది. క్రమంగా గుంటూరు హిందూ కళాశాల డిగ్రీ, ఆంధ్ర విశ్వవిద్యాలయంలో పీజీ చేస్తున్నప్పుడే విద్యార్థులచే నడిచే వ్రాతపత్రికల బాధ్యతలు నిర్వహించేలా చేసింది. ఉద్యోగరీత్యా హైదరాబాదుకు వచ్చిన తొలినాళ్ళలో పత్రికలవాళ్ళు ముద్రించే ఫొటోలను అనుసరిస్తూ కవిత్వం రాసి పంపేవారు. 1980-90 దశకంలో 'ఫొటో కవి'గా మంచి గుర్తింపు పొందారు. ఉన్నత ఉద్యోగరీత్యా అమెరికాలో స్థిరపడాల్సి వచ్చింది. ఎక్కడ ఉన్నా సాహిత్యపిపాస పోలేదు. అక్కడికి వెళ్ళాక మరింత ఎక్కువ అయ్యిందనే చెప్పాలి. ఒకవైపు ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తిస్తూనే సాహితీ వ్యాసంగం కొనసాగిస్తున్నారు.

బాల్యంలో పుస్తకాల దోస్తీ వల్ల తనలో కలిగిన అనుభూతుల్ని, ఆలోచనల్ని చిన్నచిన్న కవితల రూపంలోకి ఒంపారు. ప్రముఖ రచనలు, రచయితల సాంగత్యంతో కవిత్వంలో మెళుకువలబ్బాయి. తను రాసిన కవితలన్ని 'కౌముది'గా పాఠకులముందుంచారు. సహజంగా కిరణ్ ప్రభగారి కవితల్లో భావకవిత్వం వెల్లివిరుస్తుంది. విశ్వవిద్యాలయ స్థాయినుంచే పత్రికలు నడిపిన అనుభవం ఉండడంతో అమెరికాలో సిలికానాంధ్ర తరపున నడిచే 'సుజనరంజని' అనే అంతర్జాల మాసపత్రికకు సంపాదకత్వం వహించారు. తర్వాత తనే సొంతంగా 2007 నుంచి 'కౌముది' అన్న అంతర్జాల మాస పత్రికను స్థాపించారు. 35 శీర్షికలతో కూడుకొని 150 పేజీలు ఉండే ఈ మాసపత్రిక ఇప్పటివరకు క్రమం తప్పకుండా ప్రతి నెల ఒకటో తారీఖునే 'నెట్టింటి'లో వాలిపోతు వస్తుంది. 'ఈ శ్రమసాహితిలో భార్య చేదోడువాదోడు మరవలేనిదంటా'రాయన. ఇది అన్ని తరాల పాఠకుల అభిరుచులకు తగ్గట్టుగా ఉండడం మరో విశేషం.

కిరణ్ ప్రభ టాకీ షో ప్రధానంగా ఐదు అంశాలపై ప్రసంగాలను వినికిడి రూపంలో సంక్షిప్తం చేస్తున్నారు. ప్రముఖ సినీ, రాజకీయ, రచయితల గురించి, స్ఫూర్తిదాయక వ్యక్తుల జీవిత విశేషాలు, ప్రపంచ పాఠకుల ఆదరణ పొందిన పుస్తకాల పరిచయం, ప్రేక్షక మన్ననలు పొందిన సినిమా విశేషాలను తెలియజేస్తున్నారు. ఇప్పటివరకు అటుఇటుగా గంట నిడివిగల టాకీ వీడియోలు ఐదువందలలకు పైగా ఉన్నాయి. యూట్యూబ్ ప్రవంతిగా గత తొమ్మిదేళ్లుగా ఈ టాకీషోలు కొనసాగుతున్నాయి. 66వేల నిర్ణీత వీక్షణ చందాదారులు (సబ్స్క్రయిబర్స్) ఉన్నారంటేనే అర్థం చేసుకోవచ్చు ఈ సాహిత్య టాకీ షోకు ఏవిధమైన ఆదరణ లభిస్తుందని.

చలం పురాణ సిద్ధాంతాలను పూర్వపక్షం చేసే స్త్రీ రచనలే కాక మతగ్రంథాలను అనువాదం చేసాడన్న విషయాలు (22 భాగాలు), పింగళి నాగేంద్రరావు సినిమాల్లోకి రాక మునుపు స్వాతంత్ర్య

పోరాటాల్లో పాల్గొన్న తీరు, సబర్మతి ఆశ్రమంలో బ్రహ్మచర్య నిర్ణయం.... కె.వి.రెడ్డి స్క్రిప్టు రాసేటప్పుడు 'బిందె, చెంబు' అని మాత్రమే కాకుండా 'బిందె, అందులో పట్టు చెంబు' అని రాసుకొనేంత సూక్ష్మ నిపుణతాంశాలు..... మాయాబజార్ కంటే ముందుగా ఏడు మాయాబజార్లు వచ్చిన విషయం, వాటి సంగతులు (6 భాగాలు), శ్రీశ్రీ కంటే ముందు శ్రీశ్రీ గీతం సినిమాల్లోకి వచ్చిన నాటి మద్రాసు సినీ విశేషాలు (3 భాగాలు), దేశంలో తొలి తెలుగు క్రికెట్ దిగ్గజం సి.కె.నాయుడు గ్రౌండ్లో బంతి తగిలి నోటి పన్ను రాలిపోయిన తన బ్యాటుతో పక్కకు నెట్టి అలాగే ఆడిన మనోధైర్యం..... ఇలా ఇవే కాక ఎన్టీఆర్ (13భాగాలు), అమితాబ్ బచ్చన్ (16భాగాలు), చార్లీ చాప్లిన్ (10 భాగాలు), గూడవల్లి రామబ్రహ్మం, కిషోర్ కుమార్ (7 భాగాలు) మహనీయుల గురించి, తెలుగువారి ఇతిహాసంగా పేర్కొనే 'వెయ్యి పడగల' నవల (10 భాగాలు), The night, Thursday With morries, Around the world in 72 days, The last lecture వంటి ప్రపంచ ప్రసిద్ధి చెందిన పుస్తక విశేషాలు, ఎన్నో అందిస్తున్నారు.

ఒక టాకీ షో కోసం ఎంతో శ్రమించాల్సివుంటుంది. అందుకోసం సంబంధిత వ్యక్తి సన్నిహితులు, కుటుంబ సభ్యుల నుంచి వ్యక్తిగత సమాచారం... ఆనాటి స్థలకాల పరిస్థితులపై క్షుణ్ణమైన అవగాహన, సంబంధించిన ఆధార పుస్తక పఠనం.... ఇలా వీటన్నిటిని పరిశీలించి పరిశోధించి, మూల్యాంకనం చేసి శ్రోతల ముందుంచాలి. ఇంతటి బృహత్ కార్యక్రమాలు ఒక సంస్థ ద్వారా మనుగడలోకి వస్తాయి. కానీ ఇవన్నీ ఒక్కడే దేశం కాని దేశంలో అనితర సాధ్యంగా కిరణ్ ప్రభగారు నిర్వహిస్తున్నారు. దీనివెనుక ఎంతో అంకిత భావం, చిత్తశుద్ధితో కూడిన నిబద్ధత, నిర్దిష్ట సమయపాలన, స్వాగతించే కుటుంబం ఇవన్నీ హేతువులుగా లేకపోలేవు.

కిరణ్ ప్రభగారు ఇవే కాక అమెరికాలో తెలుగువాళ్లు కోసం నడిపే 'టోరి రేడియో', 'విరిజల్లు' వీక్లి ఆడియో, స్థానికంగా నిర్వహించే సాంస్కృతిక, సామాజిక కార్యక్రమాలు కూడా నిర్వహిస్తుంటారు. నేటి తరంతోపాటు భావితరాలకు అలనాటి సాహిత్య, రాజకీయ, జీవిత విశేషాలు సాంకేతికపరంగా పదిలపరుస్తున్నందుకు సదా అభినందనీయులు. శ్రోత సాహితీప్రియులకు, విశ్వవిద్యాలయ పరిశోధకులకు, సినిమావాళ్లకు 'కిరణ్ ప్రభ టాకీ షో' ఒక ఆకారం(సోర్స్)గా నిలుస్తున్నదనడానికి 'మహానటి' చిత్రమే ఒక సాక్ష్యం. (ఈ సినిమా పరిశోధనకు కిరణ్ ప్రభగారి "సావిత్రి"టాకీ షో ఎంతగానే ఉపయోగపడిందని చిత్ర బృందం తెలిపింది). ఫలాపేక్ష రహితంగా ఏ కార్యం చెయ్యలేని స్థితికి ఎ'దిగిన' సమాజంలో పైసా ప్రయోజనం లేకున్నా అమూల్యమైన తమ సమయాన్ని వెచ్చించి విజ్ఞానం పంచుతున్న కిరణ్ ప్రభ గారికి తెలుగు సాహితీ లోకం తప్పక రుణపడి ఉంటుంది.

---

# భయం

ప్రతి వ్యక్తి యేదో ఒక రకమైన భయంతో బాధపడుతూ ఉంటాడు. ఒక జ్ఞానికాని, పరమభక్తుడు కాని భయానికి దూరంగా ఉండగలుగుతారు. తననే అంతటా చూడగల జ్ఞాని భయానికెలా లొంగిపోగలడు? భయాన్ని ఎవరైతే జయిస్తారో వారి సాధన సగము పూర్తయినట్లే.

భయాలు యెన్నో విధాలు. ఒక గూర్ఖా కత్తికి గాని, రైఫిల్ బుల్లెటుకు గాని భయపడక పోవచ్చు గాని అతను తేలుకు భయపడవచ్చు. ఒక వేటగాడు పులులకు, సింహాలకు భయపడక పోవచ్చు కాని, శస్త్ర చికిత్స చేసే వైద్యుని కత్తికి భయపడతాడు. సరిహద్దులను రక్షించే సిపాయి కత్తికి భయపడడు. తమకు మత్తు యివ్వకుండానే ఆపరేషన్ చేయించుకోగలడు. కాని పాములకు భయపడతాడు. కొందరు దయ్యాలకు భయపడతారు. తమను విమర్శించే జనులను చూసి కొందరు భయపడతారు. కొందరు వ్యాధులకు భయపడతారు.

రాజు తన శత్రువుకు భయపడతాడు. పండితుడు వానలలో తన కెదురయ్యే మరొక ప్రత్యర్థికి భయపడతాడు. ఒక అందమైన స్త్రీ ముసలితనానికి భయపడుతుంది. ఒక న్యాయవాది తన జడ్జికి భయపడతాడు. ఒక స్త్రీ తన భర్తకు భయపడుతుంది. విద్యార్థి, ఉపాధ్యాయునికి భయపడతాడు. పోలీసు యిన్‌స్పెక్టర్, పోలీసు సూపరింటెండెంటుకు భయపడతాడు. ఒక కప్ప పాముకు భయపడుతుంది. విషనాగు అయిన త్రాచు ముంగిసకు భయపడుతుంది.

భయములో యెన్నో స్థాయిలున్నాయి. కొద్దిగా భయము, పిరికితనము, సిగ్గు హెచ్చరికల భయము, భయోత్పాతము మొదలైనవి. ఒక వ్యక్తికి భయోత్పాతము కలిగినప్పుడు గుండె వేగంగా స్పందిస్తుంది. మూత్రము పలుమార్లవుతుంది. మనస్సు మొద్దుబారిపోతుంది. ఒక్కొక్కసారి షాక్ వలన మనిషికి గుండె ఆగి మరణము సంభవిస్తుంది.

కె. విశ్వనాథ్ చలన చిత్రాలు – సామాజిక అవలోకనం – 25

# సప్తపది

**టి. లక్ష్మీనారాయణ,** తెలుగు పరిశోధక విద్యార్థి, ఉస్మానియా విశ్వవిద్యాలయం. ఫోన్ : 9704829254

"కె. విశ్వనాథ్ చలన చిత్రాలు– సామాజిక అవలోకనం" నందు ఈ మాసం చర్చించబోయే చిత్రం "సప్తపది". ఈ చిత్రం 'శంకరాభరణం' లాంటి సంగీతపరంగా పెద్ద విజయవంతమైన చిత్రం తర్వాతి వరుసలో కథానాయిక పాత్రకు నృత్యాన్ని ప్రధాన అంశంగా జోడించి సామాజిక దుష్కళంకమైన విషయాన్ని చర్చిస్తూ 1981లో రూపొందించారు. జె.వి.సోమయాజులు, గిరీష్, సబితలు ప్రధాన తారాగణం. సాధారణంగా 'సప్తపది' అనేది వివాహ వేడుకలో వధూవరులు ఒకరికొకరు జీవితాంతం కలిసి జీవించడానికి చేసుకునే ప్రమాణంగా నడిపించే ఏడడుగుల తంతు.



## చిత్ర కథ

యాజులు(జె.వి.సోమయాజులు) అమ్మవారి ఆలయంలో అర్చకులుగా వుంటూ వృద్ధాప్యానికి చేరుకున్న వ్యక్తి. యాజులు కుమారుడు అవధాని (జె.వి.రమణమూర్తి) తండ్రిచే లభించిన పురోహిత్యాన్ని నిర్వహిస్తూ తండ్రి అంటే గౌరవ మర్యాదలు, భయం వున్న కుమారుడు. అవధాని కుమారుడు గౌరీనాథం (రవికాంత్). తండ్రి, తాతలు ఇచ్చిన పురోహిత్యాన్ని కొనసాగిస్తూ కాలం మారినా ఆచారం, సంప్రదాయాలను కొనసాగించే యువకుడు. యాజులు కుమార్తె జానకి తండ్రి మాటను కాదని ఒక నాట్యాచారున్ని వివాహం చేసుకోవడం వల్ల ఆమెతో కుటుంబ బంధాన్ని దూరం చేసుకుంటాడు యాజులు. కొన్నాళ్ళకు జానకి ఒక కూతురుకు జన్మనిచ్చి మరణిస్తుంది. తల్లి లేకపోయినా ఆ పాపను పెంచి పెద్ద చేస్తాడు నాట్యాచారుడైన ఆ తండ్రి. అంతేకాక ఆమెకు నృత్యంలో మంచి శిక్షణ ఇచ్చి ఆమెను మంచి నృత్యకారిణిగా తీర్చిదిద్దుతాడు. ఆమె పేరే హేమ (సబిత). ఇక యాజులుకు అత్యంత సన్నిహితుడు, ఆయనకు మనస్సాక్షిగా మసలుకునే స్నేహితుడు రాజు గారు (అల్లు రామలింగయ్య). ఊరిలో పెద్ద మనిషిగా చలామణీ అవుతూ అన్ని కార్యక్రమాలు చూస్తూ వుంటాడు.

ఒకసారి హేమ తండ్రితో కలిసి నృత్య ప్రదర్శనకై తాతగారి గ్రామానికి వస్తుంది. ఆ కార్యక్రమ నిర్వహణకు చక్రం తిప్పిన వ్యక్తి రాజు గారే. కారణం యాజులు కుటుంబానికి నృత్యంలో పేరు పొందిన హేమను ఆయన మనుమరాలిగా మళ్ళీ దగ్గర చేయాలనే సదుద్దేశం. ఆ కార్యక్రమం చూడాలని అవధాని, ఆయన భార్య ఇద్దరు తండ్రి యాజులు వద్ద డొంకతిరుగుడు యత్నాలు చేసి చివరాఖరికి ఒప్పిస్తారు. హేమ ప్రదర్శన చూడడానికి యాజులు కూడా అనివార్య పరిస్థితుల్లో వస్తాడు. ఆ ప్రదర్శనలో హేమ నృత్యానికి ప్రేక్షకులు చేసే హర్షధ్వానాలను చూసి యాజులు సైతం ఉప్పొంగిపోయి తన కూతురు నాట్యాచారుడిని వివాహం చేసుకుందనే కారణంతో ఆమెను దూరం చేసుకోవడం పట్ల విచారం చెందుతాడు. ఆ తర్వాత హేమను దేవాలయానికి పిలిచి పూజా కార్యక్రమాల అనంతరం ఆమెను మనుమరాలుగా స్వీకరిస్తూనే కొడుకు కుమారుడైన గౌరీనాథం(రవికాంత్)కు ఇచ్చి వివాహం చేస్తున్నట్లు నిర్ణయిస్తాడు. తాతగారికి దగ్గరయ్యాననే సంతోషంలో వున్న హేమకు ఆమె వివాహ విషయం కల్లోలాన్ని సృష్టిస్తుంది. కారణం ఆమె మనసులో అప్పటికే మరో అబ్బాయి వుండడం.

హేమ గతంలో ఒకచోట నృత్య ప్రదర్శన చేస్తుండగా ఆ సభా ప్రాంగణంలో పిల్లనగ్రోవి పాడుతూ ఆమె కంట పడతాడు హరిబాబు (గిరీష్). (హరిబాబు పాత్ర చిత్రంలో ఎక్కువగా మురళి పేరుతో కొనసాగుతుంది) అనే అబ్బాయి. హరిబాబు వేణుగానాన్ని ఇష్టపడే హేమకు అతడి నుండి రాయబారంగా ఓ పిల్లాడి చేత లేఖ అందుతుంది. ఆ తర్వాత రాయబారాల ద్వారా హేమ– హరిబాబుల మధ్య ప్రేమను ఒకరికొకరు తెలుసుకుంటారు. ఒకరోజు చిన్న కాగితంలో రాసిన లేఖలో వినూత్న రీతిలో ఆహ్వానం పంపి ఆమెను చూడాలనుకుంటున్నట్లు తెలియజేస్తాడు హరిబాబు. కాని ఆ లేఖలోని విషయం అర్థం చేసుకోడానికి హేమ ఆపసోపాలు పడుతుండగా అది 'ఆభేరి' రాగం ద్వారా ఆయన నిన్ను చూడాలనుకుంటున్నట్లు పంపిన సందేశం అని ఆమె గాయ సహాయకురాలు చెప్తుంది. హరిబాబు కొండపై ఒంటరిగా జీవిస్తూ వుంటాడు. తనకు తోడుగా వుండే పిల్లాడు తిరునాళ్ళకు వెళ్దాం అక్కడ మిమ్మల్ని మా ఊరి పూజారితో పాటు రథంపై కూర్చోబెడతాను త్వరగా సిద్ధం అవండి




అంటాడు. కాని హరిబాబు ఆ పిల్లాడితో నాకు దేవుడి రథంపై కూర్చునే అర్హత లేదని చెప్తాడు. కారణం అడగ్గా తాను 'హరిజనుడిని' అని చెప్తాడు. ఆ విషయాన్ని పిల్లాడు హేమతో తెలుపుతాడు. అది తెలిసిన హేమలో మౌనం ఆవహిస్తుంది. ఓసారి దేవాలయంలో హేమ హరిబాబును కలిసినప్పుడు అతడు ఆమె చేత వారిరువురికి వివాహం జరగాలని అక్కడ వున్న వృక్షానికి ఊయలను ముడుపుగా కట్టిస్తాడు. **'నిజంగా దైవానికే కనుక శక్తి వుంటే కులాలు వేరైన మన ఇరువురికి వివాహం చేయిస్తాడో? లేదో? చూద్దాం'** అంటూ దైవ సన్నిధిలో దేవుడితో సవాలు చేస్తాడు.

యాజులు హేమకు గౌరీనాథంతో వివాహం చేస్తాడు. హేమ హరిబాబుపై వున్న ప్రేమను మనసులోనే దాచుకొని అతడి కులం కారణంగా కుటుంబ సభ్యుల వద్ద మనసు విప్పి చెప్పలేకపోతుంది. శోభనం రోజు గదిలోకి వచ్చిన గౌరీనాథానికి ఆమెను చూడగానే అమ్మవారి అవతారం దర్శనమిస్తుంది. ఇలా పలుమార్లు గౌరీనాథం ఆమెలో దేవతా స్వరూపాన్ని చూసి అయోమయానికి గురవుతాడు. కాని చుట్టూ వుండే వాళ్ళంతా హేమకు పిల్లలు ఇంకా కావట్లేదు కారణమేంటో? అంటూ చెవులు కొరుక్కుంటుంటారు. ఒకసారి గుళ్ళో వారి సంతానానికై ముడుపు కట్టే సమయంలో గౌరీనాథానికి ఆమె మనసులో మరొక వ్యక్తి వున్నాడనే విషయం తెలుస్తుంది. ఆ విషయం తెలిసిన తాతగారైన యాజులు ఏమీ పాలుపోని సందిగ్ధంలో పడతాడు. ఆయనకు దగ్గరి మిత్రుడైన రాజుగారితో చర్చించినప్పుడు ఆయన 'శంకర విజయం'లో ఆదిశంకరాచార్యుల వారికి మాల కులస్థు డెదురైన ఘట్టాన్ని గుర్తు చేస్తాడు. అది విని పలుకోణాల్లో ఆలోచించాక యాజులు ఆమెను హరిబాబుకు ఇచ్చి ఒకటి చెయ్యాలని నిర్ణయించుకుంటాడు. హరిబాబును తీసుకువచ్చి గౌరీనాథం ఊరందరి ముందు నిలబెడతాడు. అంతా ఉత్కంఠగా ఎదురుచూస్తుండగా యాజులు వారిద్దరినీ కులాలకతీతంగా ఏకం చేస్తాడు. ఊరిలోని వారంతా వ్యతిరేకించినా **"ఆచార వ్యవహారాలు అనేవి మనుషుల మనసులను క్రమబద్ధీకరించడానికే తప్ప వేరు చేయడానికి"** కాదంటూ కలపడంతో కథ సుఖాంతం అవుతుంది.

## చిత్ర విశేషాలు

వివాహం అయిన స్త్రీకి మరొక వ్యక్తితో కులాంతర వివాహం చేయడాన్ని కథాంశంగా ఎన్నుకోవడం సాహసోపేతమైన నిర్ణయమే. ఇలాంటి కథాంశాన్ని ఎన్నుకోవడం ద్వారా దర్శకుడు కె.విశ్వనాథ్ ఉన్నత వర్గం నుండి ప్రధానంగా విమర్శను ఎదుర్కొనే అవకాశం ఉన్ననూ ముందడుగు వేయడం కథకుడి, దర్శకుడి అంకితభావాన్ని తెలియపరుస్తుంది. "సప్తపది" చిత్రం సమాజంలోని కులవ్యవస్థను గూర్చి కొత్త కోణంలో ప్రస్తావించింది. కుల, మత, ప్రాంత, లింగ, శ్రామిక ఇలా సమాజంలోని ఏ అంశాన్ని తీసుకున్నా రెండు రకాల మనుషులు వుంటారు. ఒకరు అణచివేతకు గురైనవారైతే, మరొకరు గురిచేసిన వారు. సాధారణంగా మార్పు కోసం తిరుగుబాటు అనేది అణచివేతకు గురైన వారి నుండే మొదలవుతుంది. కాని ఈ చిత్రం ఉన్నత వర్గంలోని మనుషుల్లో కుల అహంకారం పట్ల వారి వైఖరి మారాలనే విషయాన్ని చెప్తుంది. దానికి ప్రతీకగా నిలిచిన పాత్ర యాజులు. ఆచార వ్యవహారాలకు సంబంధించి శంకరాభరణం శంకరశాస్త్రి పలికిన మాటలను పునాదిగా చేసుకుని ఈ చిత్రం నిర్మించబడింది. కథ, కథనం, చిత్రానువాదం పరంగా శంకరాభరణం తెలుగు సినీ చరిత్రలో ఒక శిఖరసమానమైన చిత్రం. ఆ చిత్రం తరహాలోనే 'సప్తపది' కూడా చిత్రానువాదం పరంగా అంతే ప్రభావాన్ని చూపగల్గిన చిత్రం.

హేమ (సబిత)– హరిబాబుల ప్రేమకు అంతరాన్ని పెంచింది కులం. తన వేణుగానంతో హేమ మనసు దోచుకున్న హరి, వేదశాస్త్ర జ్ఞానం పొందడానికి అబద్ధం చెప్పడానికి సైతం సిద్ధపడ్డ హరి ఆమెను వివాహం చేసుకోవడానికి కులం అడ్డుగా వుందనే భయంతో ఆమెకు దూరమవుతాడు. హరిబాబు పాత్ర ఆ విషయంలో వెనకడుగేసి ఏ మాత్రం ప్రయత్నం చెయ్యకపోవడం ప్రేక్షకుడికి కొంత అసంతృప్తిని కల్గిస్తుంది. ఇక సబిత పాత్రకు నృత్యం చెయ్యడం, సున్నితంగా ప్రవర్తించడం తప్పితే సంభాషణలు సైతం చాలా తక్కువ. ఆ పాత్రను తీర్చిదిద్దడంలో ఒక సౌకుమార్యత, అమాయకమైన మోముతో కూడిన లావణ్యం వుంటుంది. మరొక ప్రధాన పాత్ర గౌరీనాథం(రవికాంత్) తాతగారి ఆదేశం మేరకు మరదలు హేమను వివాహం చేసుకుంటాడు. చిన్నప్పటి నుండి తాత, తండ్రిగార్ల అర్చకత్వాన్ని వారసత్వంగా పుణికిపుచ్చుకున్న గౌరీనాథం హేమ మనసులో తాను లేనని తెలిసి ఆమె మనసులో వున్న మనిషిని తెచ్చి ఆమె కోరుకునే మనిషితో జీవితం సంతోషంగా సాగేలా చేయాలనే ఆలోచనలో ఒక కథానాయకుడి లక్షణం కనిపిస్తుంది. ఇక చిత్రంలో కథానాయకుడి పాత్ర ఎవరిది అనే కోణంలో చూస్తే హరిబాబు పాత్రలో సాహసం లేకపోయినా చిత్రం యొక్క లక్ష్యం హరిబాబు – హేమల ప్రేమను విజయవంతం చేయడం కాబట్టి కథానాయకుడి పాత్రకు ఇలా ఒక కొత్త రకమైన వ్యక్తీకరణ చెయ్యొచ్చని ఋజువు పర్చారు దర్శకుడు.

చిన్న కథలో పురాణ, తాత్త్విక విషయాలను జోడించి పాత్రల ఆలోచన తీరులో మార్పు తీసుకురావడం, చూసే ప్రేక్షకుల్లో కూడా ఆలోచనల సుడిగుండాలు సృష్టించడం కె.విశ్వనాథ్ ప్రత్యేకత. సాహిత్యమే కాదు, సినిమా సైతం మనిషిని ప్రభావవంతంగా ఆలోచనల అగాధంలో నెట్టేయగలదు అనేలా ఆయన చిత్రాలుంటాయి. చూసే ప్రేక్షకుల, విమర్శకుల ఆలోచనా తీరును బట్టి ఆయన చిత్రాలపై విభిన్న వ్యాఖ్యలు చేయవచ్చు, కాని చిత్రం తుది ఫలితం మాత్రం మనిషి హృదయాన్ని కదిలించి తీరక మానదు. ఈ చిత్రంలో రాజు గారి (అల్లు రామలింగయ్య) పాత్ర శంకరాభరణం చిత్రంలోని స్నేహితుడి పాత్రకు కొనసాగింపుగా వుంటుంది. యాజులు పాత్ర తర్వాత సాధికారికంగా, స్వతంత్ర భావాలతో ప్రతీ విషయాన్ని వ్యక్తీకరించిన పాత్ర రాజుగారి పాత్ర మాత్రమే. 'శంకర విజయం'లోని ఆది శంకరాచార్యులు- మాలవాని కథ చెప్పి యాజులు పాత్రకు చుట్టూ వున్న మనుషుల కన్నా మనిషిలోని పరమాత్మ గొప్పది అని గుర్తు చేసి ఆయనలో పరివర్తనకు కారణం అవుతాడు. చిత్ర ప్రారంభంలో యాజులుకు ఆయన మనుమరాలైన హేమను దగ్గర చేయాలనే ప్రయత్నంతో నృత్య ప్రదర్శన కార్యక్రమం ఏర్పాటు చేస్తాడు. ఏదేమైనా చిత్రంలో యాజులు, రాజు గారి పాత్రలు అత్యంత క్రియాత్మకంగా వుండి మిగతా పాత్రలు స్వతంత్ర, దృఢమైన వ్యక్తిత్వాలు కల్గిన పాత్రలుగా వుండకపోవడం కొంత అసంతృప్తిని కల్గిస్తుంది.

ఈ చిత్రానికి ప్రధాన సన్నివేశం అంతేకాక తెలుగు చలనచిత్రాల్లోని గొప్ప సన్నివేశాల్లోనే ఒకటిగా ఎనదగ్గ సన్నివేశం గౌరీనాథం- హేమల వివాహం తర్వాత శోభనం రాత్రి హేమ గదిలోకి వెళ్ళిన గౌరీనాథానికి ఆమెలో అమ్మవారి రూపం కనపడడం. ఈ సన్నివేశాన్ని గూర్చి ప్రేక్షకులు వారి వారి తెలివితేటలు, విచక్షణ మేరకు విభిన్న కోణాల్లో ఊహాపరికల్పన చేసేలా సన్నివేశాన్ని తీర్చిదిద్దారు దర్శకుడు. పరస్త్రీని గౌరవించే సంప్రదాయం వున్న మన సమాజంలో గౌరీనాథంలాంటి దేవీ అర్చకుడికి హేమ మనసులో మరొక వ్యక్తి వున్నప్పుడు దేవీ స్వరూపం కనబడడంలో అతిశయమేమీ కాదు కాని ఆ సన్నివేశాన్ని చూసే ప్రేక్షకుడికి కథాగమనంలో అదొక పెద్ద ఆశ్చర్యకరమైన విషయమే. అంతేకాక హరిబాబు ఆమెను చూడడానికి రమ్మని 'ఆభేరి' రాగంలో లేఖ పంపడం కూడా మరొక ప్రత్యేక సన్నివేశం.

ఈ చిత్రంలో ప్రధానంగా మాట్లాడుకోవాల్సిన విషయాలు స్క్రీన్ ప్లే, నేపథ్య సంగీతం, మాటలు, పాటలు. కూతురును దూరం చేసుకున్న యాజులుకు మనుమరాలిని దగ్గర చేసి రెండు కుటుంబాలను కలపాలనుకుంటాడు రాజుగారు. కుటుంబాలేకమయ్యే సమయానికి గౌరీనాథంతో వివాహం నిశ్చయించి, మనుమరాలు హేమను సందిగ్ధంలో పడేస్తాడు యాజులు. గతాన్ని గుర్తు చేసుకున్న




హేమకు తన ప్రేమికుడు హరిజనుడు అని తెలిసి పాలుపోని స్థితిలో వున్నప్పుడు హరిబాబు ఆమె చేత చెట్టుకు ముడుపు కట్టించి దైవం మన ప్రేమను గెలిపిస్తుందా? చూద్దాం! అనేలా సవాలు చేస్తాడు. ఇదిలా వుండగా హేమ పెళ్ళి అవుతుంది. గౌరీనాథానికి మాత్రం హేమలో అమ్మవారు కన్పిస్తుంది. గౌరీనాథానికి హేమ ప్రేమ తెలిసి హరిబాబు కోసం వెళ్తాడు. యాజులుకు హేమ ప్రేమ విషయం తెలిసి మనుమరాలు, సమాజం రెండింటిలో ఏ వైపు నిలబడాలో అర్థం కాని సంశయంతో మథనపడతాడు. కాని చిత్ర పతాక సన్నివేశంలో మాత్రం సరిగమలు, సప్తస్వరాలు, నృత్యం వంటి అంశాలతో కూడిన మాటలతో హేమ-హరిబాబులను కలిపి ముగించడంలో విశ్వనాథ్ గారు వారి మార్క్‌ను వదులుకోలేదు అనిపిస్తుంది. కథను మలుపు తిప్పే, కథకు ప్రధానమైన సన్నివేశాల్లో మరియు చిత్రం సాంతం కె.వి.మహదేవన్ నేపథ్య సంగీతం, సంగీతం చిత్రానికి ప్రధాన బలం.

జంధ్యాల మాటలు ఈ చిత్రంలో సన్నివేశాలకు తగినట్లుగా వున్నా 'శంకరాభరణం' చిత్రంలో లాగానే పాత్రలకు తక్కువ మాటలు ఇస్తూనే బలమైన భావాన్ని, విస్తృతార్థాన్ని వ్యక్తం చేసేలా రాశారు. చిత్ర పతాక సన్నివేశంలో 'అష్టవర్షాత్ భవేత్ కన్యా', 'జన్మనా జాయతే శూద్రః', 'చాతుర్వర్ణం మయాసృష్టం' వంటి శ్లోకాల ప్రస్తావనతో కులం, వర్ణం, కన్యాదానం, వేదమంత్రాల సదుద్దేశాలను తెలుపుతాడు. వ్యాసుడు, విశ్వామిత్రుడు, వశిష్ఠుడు వంటి మహర్షుల కుల నేపథ్యాలను తెలుపుతూ "కర్మచండాలుడి కంటే జన్మచండాలుడు మేలు" అని వివరణ ఇస్తాడు. అల్లు రామలింగయ్య మాటల్లో సామెతలు, శాస్త్రాంశాలు చమక్కులు, ఛలోక్తులను విసురుతాయి. సాక్షి రంగారావు మాట, మాటలో వాడే 'తప్పదీ' అనే పదం హాస్యాన్ని పుట్టిస్తుంది.

వేటూరి సాహిత్యం చిత్ర కథాంశానికి, సన్నివేశాలకు, పాత్రల మనోసంఘర్షణకు అనుగుణంగా వుంటుంది. **"ఆది నుంచి ఆకాశం మూగది/ అనాదిగా తల్లి ధరణి మూగది/ నడుమ వచ్చి ఉరుముతాయి మబ్బులూ/ నడిమంత్రపు మనుషులకే ఈ మాటలు"** మనిషి తయారు చేసుకున్న కట్టుబాట్లు మనిషిని మనిషికి దూరం అయ్యేలా చేస్తున్నాయి అని చెప్పడానికి వాడారు. **"ఏ కులమూ నీదంటే గోకులమూ నవ్వింది/**

**మాధవుడూ యాదవుడూ మా కులమే లెమ్మంది" , "తెల్లావు కడుపునా కర్రావులుండవా/ కర్రావు కడుపుల్లో ఎర్రావులుండవా/ ఎందువలనా అంటే దైవఘటన"** ఇలా సరళమైన పదాలతో గొప్ప తాత్విక భావాలు, సార్వత్రిక సత్యాలను తెలియచేశారు వేటూరి.

వేదమంత్రాలు, సప్తపది ప్రమాణాలు వివాహ వేడుకలో ఇద్దరు మనుషులను కలపడానికి మాత్రమే కాదు, రెండు మనసులను కలపడానికి అని చెప్తూ వివాహం అయిన స్త్రీకి కులంతో నిమిత్తం లేకుండా ఆమె మనసులోని మనిషితో మళ్ళీ వివాహం జరపడానికి ఓ సద్బ్రాహ్మణుడు పూనుకునే కథను "సప్తపది" చిత్ర కథాంశంగా తీసుకొని కె.విశ్వనాథ్ రూపొందించడం ఆ కాలంలో పెద్ద సంచలనమే!.

చిత్రం : సప్తపది

తారాగణం : జె.వి.సోమయాజులు, సబిత, గిరీష్, అల్లు రామలింగయ్య, సాక్షి రంగారావు, జె.వి. రమణ మూర్తి, రవికాంత్ తదితరులు

నిర్మాత : భీమవరపు బుచ్చిరెడ్డి

మాటలు : జంధ్యాల

సాహిత్యం : వేటూరి

సంగీతం : కె.వి.మహదేవన్

కథ, చిత్రానువాదం, దర్శకత్వం: కె.విశ్వనాథ్

ఈ చిత్రానికి 1981కిగానూ జాతీయ ఉత్తమ సమైక్యతా చలనచిత్ర పురస్కారం లభించింది.

## నేను

**నేను ధ్యానాన్ని**
కాల నిబద్ధత లేని ధ్యానాన్ని
నేను ధ్యాన స్థితిని
సర్వ తంత్ర ధ్యాన స్థితిని
నేను సంస్థాగత అవస్థలు లేని ధ్యానాన్ని
వ్యక్తిపర తాకిడులు లేని ధ్యానాన్ని
నేను ఇహవాసనలు లేని ధ్యానాన్ని
పరధ్యాసలు లేని ధ్యానాన్ని
నేను సత్యం వాకిటి ధ్యాన సత్వాన్ని
ధ్యానసత్వ అస్తిత్వాన్ని.

**నేను పద్మాసనంలోకి వెళ్తే చాలు**
ఇంటికప్పు అయినా బోధివృక్షమవుతుంది
అరూపంగా కురిసిన అగ్గిపూలు
శక్తి బీజాలుగా నా కుండలినిలో నిక్షిప్తమవుతాయి
ప్రతి బీజమూ ఒక శక్తి చాలనమే
ఇరు నాల్కలుగా వేయి పడగల విన్యాసమిది
సహస్రారానికి తొలి పలకరింపే
అయినా దేహ బలిమికి దొరకని ఖాతా అది
దేహం నాదే మనసూ నాదే, అయినా
లెక్కకందని అతీంద్రియ ప్రకంపనల దొంతర అది
అవును,
నా అరమోడ్పు ధ్యానంలో
శక్తి గర్భాన్ని
చైతన్య విస్ఫోటనాన్ని
ఇహంలో అస్తిత్వ చిరునామాని
పరానికి సాక్షి సంతకాన్ని

**(విశ్వర్షి వాసిలి... నేను... యౌగిక కావ్యం నుండి)**



సమీక్ష

# ప్రామాణిక కథాహారం 'పల్లవి'

**అమ్మిన శ్రీనివాస రాజు, ఫోన్: 7729883223**

తెలుగు సాహితీ ప్రక్రియలన్నిటిలో శిఖరభాగంలో నిలిచేది కథా ప్రక్రియ. సమాజంతో పాటు అందులోని మానవుల జీవన చిత్రాలను కాలానుగుణంగా నమోదు చేస్తూ భావితరాలకు సమాజ చరిత్రను 'అక్షర చిత్రం'గా అందించగలిగే అర్హత ఒక్క కథకే సొంతం. వస్తువు, శైలి అనే రెండు రెక్కల సాయంతో పయనించే ఈ 'కథాపక్షి' గమనంలో ఏది ముఖ్యం? అనేదానిలో భిన్నాభిప్రాయాలు ఉండవచ్చు కానీ.... రెండూ ప్రధానమే. వీటి సమ ప్రాధాన్యంతో వ్రాయబడ్డ కథలే పాఠక ప్రవాహంలో ఉత్తమ కథలుగా నిలవగలవు.

కేవలం సృజన సాయంతో వ్రాయబడే కథల కన్నా 'మానవ, సమాజ' పార్శ్వాలను పరామర్శిస్తూ పాఠకుల హృదయాల్లో కలకాలం నిలిచిపోతాయి. కథా రచయిత కన్నా కథాంశం కలకాలం గుర్తుండిపోయే ఉత్తమ తెలుగు కథలు తెలుగులో రాశిలో తక్కువైనా, వాటి వాసి ఎప్పటికీ తరగదు. ఆ దిశగా తన ప్రయత్నం సాగించి, తన చుట్టూ ఉన్న సమాజాన్ని సునిశితంగా పరిశీలించి, పాత్రల్లో పరకాయ ప్రవేశం చేసి అన్ని మూలాలను ముడుతూ తనదైన ప్రామాణిక పరిశోధన దృష్టితో రాసిన కథల సమాహారమే డాక్టర్ అమరవాది నీరజ "పల్లవి" కథా సంపుటి.

ప్రతి కథా రచయిత్రి యొక్క స్వీయ "స్త్రీ భావన" జతగూడి నడుస్తుంది కాని ఇవి స్త్రీవాద కథలు కానే కావు. స్త్రీ విద్య ఆవశ్యకతను మరో నూతన కోణం నుంచి ఆవిష్కరించిన సరికొత్త కథ "ముఖ్య అతిథి". అనాథ అయిన అక్క కూతురు పద్మినిని డాక్టర్ చదివించడంలో ఆమె పడ్డ వేదన చూపిస్తూ... బాల్యవివాహాల ద్వారా స్త్రీల జీవితాలు ఎలా ఛిద్రం అవుతున్నాయో కూడా చెప్పి కనువిప్పు కలిగించింది ఈ కథ. చక్కని ఎత్తుగడ ఎంచక్కని ముగింపు కథకు మరింత వన్నె చేకూర్చాయి.

ఎక్కువగా స్త్రీ దృష్టితో వ్రాసిన ఈ కథల్లో "తోడు" కథ వ్రాయడంలో రచయిత్రిలోని అత్యాధునిక భావాలు వెల్లడి కావడంతో పాటు ప్రతి మనిషి జీవితానికి తోడు ఒక టానిక్‌లా పనిచేస్తుంది అనే నిండు నిజాన్ని వెల్లడించారు. ఉత్కంఠతతో ప్రారంభమైన ఈ తోడు కథ ఊహించని ముగింపుతో పాఠకులకు కరుణరసాన్ని పంచి కళ్ళు చెమ్మగిల్లేట్టు చేస్తుంది.

సనాతన భారతీయతలో పల్లెలకు, వ్యవసాయానికి ఇచ్చిన ప్రాధాన్యత గుర్తుచేస్తూ అందులో గల ఆహ్లాదం, ఆరోగ్యం గురించి అందంగా, హృద్యంగా చెప్పబడ్డ కథ "అమ్మబడి". "ఆనందమే ఆరోగ్యం" అన్న నానుడికి దగ్గరగా సాగిన ఈ కథలో రైతు యొక్క ఔన్నత్యం, ప్రాధాన్యత చెప్పి ఆ వృత్తిపట్ల ఇష్టంలేనివారు వేరే వృత్తిలోకి వెళితే చేసేదేమీ లేదు. కానీ ఆ వృత్తినే దైవంగా భావించే "సేద్య ప్రేమికుల"ను కూడా బలవంతంగా పట్టణాలకు తీసుకువచ్చి, కాంక్రీట్ వనాల్లో బంధిచడం ఎంత నరకమో....! ఈ "అమ్మబడి" కథలో రచయిత్రి ఎంతో హృద్యంగా విశదీకరించారు. మానవజాతి మహత్తరంగా భావించి, ఆశపడి, తపించేది 'మాతృత్వం' గురించి. తమ జాతి అభివృద్ధి అనే చర్య పక్కన పెట్టి, అమ్మతనంలోని అనురాగం, మానవత్వానికి మూలమైన ప్రేమబంధం గురించి అతి చక్కని కథ.

"పల్లవి" ఆధునిక అమ్మతనంలోని డొల్లతనం గురించి బలమైన హెచ్చరిక జారీ చేసింది ఈ కథ. కథ ఆసాంతం ఊహాత్మకంగా వున్న, భవిష్యత్తులో నిజాన్ని ప్రస్ఫుటం చేసింది. ముఖ్యంగా పాశ్చాత్య దేశాల్లో ప్రస్తుతం కొనసాగుతున్న 'అద్దె గర్భాల' గురించిన నేపథ్యం ఇందులో కనిపిస్తుంది. బంధాలు అంటే కేవలం వరుసలు, సంబంధాలను బట్టి కాదని, ఆప్యాయతానుబంధాలు సందర్భాన్ని బట్టి ఒకరికి ఒకరు తర్జుమా చేసుకోవడం వల్లే అనుబంధాలు కలకాలం నిలుస్తాయి అనే గొప్ప సందేశాన్ని తెలియజేస్తుంది ఈ పల్లవి కథ.

మానవజాతికున్న సిరిసంపదల్లో అత్యున్నతమైనవి, మన సంస్కృతి, సంప్రదాయాలు. భావితరాలకు మనం పదిలం చేసి అందించడం ద్వారా మానవజాతి మనుగడ కలకాలం ఉంటుందనే నిండు నిజాన్ని గుర్తు చేస్తూ వ్రాసిన 'శ్రీకారం' కథ నేటి యువతకు మేలుకొలుపు.

మనమధ్య బంధాలకు, సంభాషణలకు, సమాచార ప్రసారానికి, భాషతో అవసరం లేదనే భావాన్ని ఎంతో చమత్కారంగా చెప్పడంలో సఫలమయ్యారు రచయిత్రి తన "చిరునవ్వుల చిగురుల్లు" కథలో. లిపిలేని భాషల్లో ఒకటి కళ్ళతో కబుర్లాడే మౌనభాష గురించి ఇందులో ఎంతో సౌకుమార్యంగా ఆవిష్కరించారు. డబ్బు విలువ చాటే అవ్యక్త బంధం, పిల్లల పెంపకంలో ఆధునిక అమ్మ పడుతున్న అగచాట్లను తెలిపే "మదర్స్ డే" కథ, బొమ్మల ప్రేమను ఆశిస్తున్న పిల్లల మనసులు ఆవిష్కరించిన "కొత్త చిగురు", పిల్లల పెంపకంలో ఉండాల్సిన సమానత్వపు విలువను తేటతెల్లం చేసిన 'పరిశోధన', ఇలా ప్రతి కథ ఓ పరిమళభరిత సుమంగా విరబూసాయి ఈ ఇరవై కథల పూదండలోని కథలు.

రచయిత్రి సంపూర్ణ భాష, పాండిత్యానికి తోడు, పరిశోధక విద్యార్థిగా సాధించిన అనుభవాల మేలు కలయికతో ఆవిష్కరించబడ్డ

ఈ సృజనాత్మక రచన తీరు 'పసిడికి పన్నీరు పూసిన చందం'గా సాగింది. సమాజంలోని మానవ సంబంధాలు, భాషా సంస్కృతులపై పాశ్చాత్య ప్రభావంతో సాగుతున్న దాడికి నిరసనగా వ్రాసిన ఈ కథల వెనుక రచయిత్రి 'డాక్టర్ అమరవాది' స్వీయానుభవాలు, పరిశీలనలను దాగి ఉన్నాయి. అందుకే ఈ కథల్లో అంతటి ప్రమాణికత, భాషా పరిపూర్ణత, నిండుగా కనిపిస్తున్నాయి.

సందర్భానుగుణంగా ఉపయోగించిన అన్యభాషాపదాలు మినహా కథల్లోని కథనాలన్నీ అందమైన తెలుగుదనంతో సాగించడంలో రచయిత్రికి అమ్మభాషపై మమకారం కనిపిస్తుంది. అంతేగాక కన్నతల్లికి 'వజ్రోత్సవ పుట్టినరోజు' కానుకగా తన కథా విరిదండను అంకితం ఇవ్వడంలో రచయిత్రి 'అమ్మప్రేమ' ఆదర్శంగా ఆవిష్కరించబడింది.

అటు వస్తువు, ఇటు శైలితో పాటు భాషా నైపుణ్యం అనే త్రివేణి సంగమంగా సాగిన ఈ కథలు పాఠకులకు చక్కని సంతృప్తితో కూడిన ఆలోచనలు హాయిగా ఆవిష్కరిస్తాయి. తెలుగు కథాక్షేత్రంలో కలకాలం నిలిచిపోయే అంతరంగ ఆవిష్కరణలు ఈ "పల్లవి మరికొన్ని కథలు".




**పల్లవి మరికొన్ని కథలు**
**రచయిత్రి : డా. అమరవాది నీరజ**
**పుటలు : 126, వెల : 150/-రూ.**
**ఫోన్ : 984916005**

# శిలాక్షరం

**(బి.ఎన్.శాస్త్రి సాహిత్యం - సమాలోచన)**

ప్రముఖ శాసన, చారిత్రక పరిశోధకులు, మూసీ పత్రిక వ్యవస్థాపకులు కీ.శే. బి.ఎన్.శాస్త్రిగారి రచనలన్నింటిపైనా సాధికారికమైన విశ్లేషణా వ్యాసాల సమాహారం 'శిలాక్షరం'.

సంపాదకులు : డా. భిన్నూరి మనోహరి
సహ సంపాదకులు : అట్టెం దత్తయ్య
వెల : 300/-




**సంప్రదించండి.**
**మూసీ మాసపత్రిక**
**ఫోన్ : 934 7971177**































**ప్రతులకు :**
**అచ్యుతానంద బ్రహ్మచారి**
**ఇం.నెం. 22-5-23,**
**వికలాంగుల కాలనీ,**
**పాల్వంచ - 507 115,**
**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా.**
**ఫోన్ : 994 481 8874**



స్వీకృతి



**ముట్నూరి కృష్ణారావు గారి సంపాదకీయాలు**
డా. మరుమాముల దత్తాత్రేయ శర్మ
వెల : 250 /-
**ప్రతులకు :** రచయిత, 'శ్రీరామసదనం', ఇం.నెం. 29-1499/6/1, కాకతీయ నగర్, రోడ్ నెం. 1, నేరేడ్‌మెట్, సికిందరాబాదు - 500 056, ఫోన్ : 94410 39146





**చంద్రశేఖరా!**
రుద్రాక్షల మఠం ప్రభులింగశాస్త్రి
వెల : 216 /-
**ప్రతులకు :** చి.ఆర్.ఎం. అభిజ్ఞ, ఇం.నెం. 3-132, బాలాజీనగర్, మహబూబ్ నగర్ - 509 001.
ఫోన్ : 94416 28134, 83096 36753



**పలక**
రుద్రాక్షల మఠం ప్రభులింగశాస్త్రి
వెల : 252 /-
**ప్రతులకు :** చి.ఆర్.ఎం. అభిజ్ఞ, ఇం.నెం. 3-132, బాలాజీనగర్, మహబూబ్ నగర్ - 509 001.
ఫోన్ : 94416 28134, 83096 36753



**తెలుగు సాహిత్యంలో స్త్రీవాదం**
- డా. బాణాల భుజంగరెడ్డి
వెల : 55/-
**ప్రతులకు :** తెలుగు అకాడమీ, హిమాయత్ నగర్, హైదరాబాదు - 500 029.

## మూసీ పబ్లికేషన్స్ వారి పుస్తకములు

**వివరాలకు : మూసీ మాసపత్రిక, 3-4-245/1, లింగంపల్లి, కాచిగూడ, హైదరాబాద్ -27, ఫోన్ - 27560616**

1. భారతదేశ చరిత్ర - సంస్కృతి (17భాగాలు 4,5 మరియు 7 నుండి 21 వరకు) రూ. 175/- ఒక్కొక్క భాగానికి రూ. 2875 - 00
2. బ్రాహ్మణ రాజ్య సర్వస్వము రూ. 1200 - 00
3. నల్లగొండ జిల్లా కవులు - పండితులు రూ. 350 - 00
4. మల్యాల వంశ చరిత్ర - శాసనములు రూ. 100 - 00
5. శాసన సంపుటి రూ. 150 - 00
6. కందూరు చోడుల శాసనములు - చరిత్ర - సంస్కృతిరూ. 100 - 00
7. షబ్నవీస్ శతజయంతి సంచిక రూ. 100 - 00
8. విజయనగర శాసనములు - సాహిత్య సాంస్కృతిక విశేషములు 90 - 00
9. త్రిపురాంతక దేవాలయ శాసనములు రూ. 75 - 00
10. పులిజాల రంగారావు సంక్షిప్త జీవిత చరిత్ర రూ. 75 - 00
11. దేవాలయ వాస్తుశిల్పము రూ. 50 - 00
12. మూసీ ద్వైవార్షిక ప్రత్యేక సంచిక రూ. 50 - 00
13. మూసీ 'తెలుగు సంస్కృతి' ప్రత్యేక సంచిక రూ. 75 - 00
14. 'సుచరిత' (బి.ఎన్.శాస్త్రి సంస్మరణ) ప్రత్యేక సంచిక రూ. 100 -00
15. మూసీ 'మన తెలుగు' ప్రత్యేక సంచిక రూ. 100 - 00
16. ఆంధ్రదేశ శాసన సాహిత్యంలో స్త్రీలు రూ. 175 - 00


## చిరునామా

**మూసీ రచయితలకు, చందాదారులకు విజ్ఞప్తి.**


చందాలు, రచనలు పంపాల్సిన చిరునామా
సంపాదకుడు, మూసీ మాసపత్రిక,
ఇం.నెం. 2-2-1109/
బికె-ఎల్.ఐ.జి.10, బతుకమ్మకుంట,
బాగ్అంబర్‌పేట, హైదరాబాద్-500013.
చందాలకు ఆన్‌లైన్ అకౌంట్
స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, నల్లకుంట,
హైదరాబాద్.
అకౌంట్ నెం. 52019740642
IFS Code : SBIN0020083
editormusi@gmail.com

# పొలిటికల్ సర్కస్






పొలిటికల్ సర్కస్‌లన్నీ స్టేటస్ షోలే గానీ
అధికారాలకు రాజముద్రలు గావు
మీ కోసం మీరు ఆలోచించినంత దూరం
మీరుమీరుగానే గానే మిగులుతరు
సినిమాలలో కథానాయకుల్లా వస్తుంటరు పోతుంటరు
నడిచిన అడుగులన్నీ ఈ నేలతల్లి నెత్తిన గాయాలే

మృగశిరలో వానొచ్చినప్పుడు
భూమ్మీద కొత్తకొత్త పురుగులు బుసకొడ్తాయి
నాలుగురోజులెండ తగులగానే మాయమైతయి
ఓట్ల కాలంలో కొత్తకొత్త వేషాలతో యాచన
కొస్తుంటారు ప్రదర్శనలతో ఊగిపోతుంటరు
జల్లెడతో నీళ్లను తోడుతుంటరు
దివినుంచి భువికి దగిన 'విధాతలు"

పుంగలు పుంగలు మైకులై రోడ్లన్ని పగులగొడ్తుంటరు
ఏ కులోన్మాదాలు కూలవు ఏ మతోన్మాదాల మాడలు
పగులవు
ట్రాక్టర్లెక్కి దున్నుతుంటరు,
చెప్పులు కుడుతుంటారు
చాయిహోటళ్ళకాడ బులోరు తిప్పుతుంటరు
సెలూన్ షాపులల్ల కటింగ్ చేస్తుంటరు
డప్పులు కొడ్తుంటరు భాజా వాయిస్తుంటరు ఎన్నెన్నో
ఆయాసాలు విన్యాసాలు ...
తెల్లారితే ఊరు పేరు గుర్తుండదు !

పేదల గుడిసెలల్ల వొంగివొంగి పోయి
మొసలి కన్నీళ్లు కార్చుతరు
స్వతంత్ర భారతంలో ఇల్లే లేదాని తెగబాధపడిపోతరు
అవ్వ భుజంమీద తలకాయపెట్టి ఒగలేడ్పులు
వాళ్ళకున్న వందెకురాలలో
నాలుగెకురాలన్న పేదలకు ఇండ్లస్థలాలకియ్యరు
మహోన్నతుడిగా మహాత్ముడిగా బిల్డపిస్తరు !
విద్య, వైద్యాన్ని జాతీయం చేయండంటే
గుడులను జాతీయం చేస్తున్నరు
ఉచితంగా పార్థనా స్తోత్రాల్ని పంచుతున్నరు
పెరిగిపోతున్న ధరల గురించి మాట్లాడండంటే
నీ బ్రాస్‌లెట్ పదితులాలంటే నీది పన్నెండుతులాలని
కాదుకాదు
ఎనిమిది తులాలని లెక్కలేస్తుంటరు
ఎవని కుర్చీ వానికి ఓలెక్కనే
కాగితపు పూలలా పూస్తుంటరు
నదుల్లో ప్లాస్టిక్ కవర్లై ప్రవహిస్తుంటరు
కుంభమేళాల్లో అఘోరాలలా కూడుతుంటరు
టైలర్లే వేరు వేరు
అంగిలొక్కటే కండువాలొక్కటే
బట్టలదుకుణం ఒకటే ..తాను ఒకటే జాగ్రత్త !

**వనపట్ల సుబ్బయ్య**
ఫోన్ : 9492 765 358

Regd No. R.N.37723/80
P.R.No.HSE-824/2020-2022
Date of Publication 1st of Every Month
Date of Posting 5th / 6th of Every Month


# హరిహర త్రిశక్తి క్షేత్రం

నవాలయ ఆవరణం, శ్రీ విద్యాపురం, వలిగొండ, యాదాద్రి జిల్లా.



ఆలయ నిర్మాణ, నిర్వహణకు సహకరించండి.....

దాతలు తమ సహకారం ఆన్‌లైన్ ద్వారా కూడ అందించవచ్చు.

**State Bank of India, Nallakunta Branch,**
**A/c. No. 62011461764, IFSC Code : SBIN0020083**

రండి ... ఈ ధర్మయజ్ఞంలో అందరం పాలుపంచుకుందాం.

# వేద సంస్కృతి పరిషత్

వైదిక సాంస్కృతిక ఉద్దీపన పరిశోధనా సంస్థ

సెల్ : 9704227744, 9347971177

Website : www.vsparishath.com, E-mail : vsp613@gmail.com


From :
**The Manager, MUSI Telugu Monthly Magazie**
# 2-2-1109/BK - LIG - 10, Batukammakunta, Bagh Amberpet, Hyderabad- 500 013.
Cell : 9347971177, Email : editormusi@gmail.com

Printed, Published and Owned by : B.Anantha Laxmi, Printed at Sri Sai Process, 3-4-612/1, Narayanguda, Hyderabad - 500 029. Telangana.
Published at H.No.3-4-245/1, Lingampally, Hyderabad - 500 027. Telangana
Editor : Dr.Sagi Kamalakara Sharma